RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




26 అక్టోబర్ 2024 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:125

# మూసీని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

## హైదరాబాద్ లో గాంధీ ఐడియాలజీ సెంటర్

## పటేల్ విగ్రహంలా బాపూఘాట్లో గాంధీ విగ్రహం

## దక్షిణాది రాష్ట్రాలపై ఎన్డీయే సర్కార్ వివక్ష

## ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్ అక్టోబర్ 25 హైదరాబాద్ వేదికగా జరిగిన ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్ ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ముఖ్యమంత్రి కీలక ప్రసంగం చేశారు. దేశ అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అదే సమయంలో కాంగ్రెస్ హయాంలో దక్షిణాదితో పాటు ఉత్తరాదికి మేలు జరిగింది, కానీ ఎన్డీయే హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు..

కాంగ్రెస్ హయాంలో దేశంలో అభివృద్ధి కోసం భాక్రానంగల్ నుంచి, నాగార్జున సాగర్ వరకు ఎన్నో ప్రాజెక్టులు కట్టారు. కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేసి విద్యావ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇందిరా గాంధీ హయాంలో గరీబీ హఠావో తో ఎన్నో మార్పులు చేశారు. ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలని చర్యలు చేపట్టారు. రాజీవ్ గాంధీ హయాంలో ఓటింగ్ వయసును 21 నుంచి 18 ఏళ్లకు మార్చారు. కంప్యూటర్లతో ఐటీ విప్లవం తీసుకురావడంతో పాటు టెలికాం రంగంలో మార్పులు తీసుకువచ్చారు. మహాత్మగాంధీ ఆలోచనల ప్రకారం స్థానిక సంస్థల్లో అధికారాలను కల్పించిన ఘనత కాంగ్రెస్దే నన్నారు. పీవీ నరసిహారావు దక్షిణాది నుంచి ప్రధానిగా సేవలు అందించిన గొప్పవ్యక్తి. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ తో కష్టాల్లో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించిన తెలుగు ఠీవీ..మన పీవీ నరసింహారావు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు కాంగ్రెస్ నేతలందరూ ప్రజలందరి మౌలిక అవసరాలు తీర్చాలని ప్రయత్నం చేశారు. తరువాత 30 ఏళ్లు టెక్నాలజీ, టెలికాం ఇతర రంగాల్లో కాంగ్రెస్, యూపీఏ సేవలు అందించింది. కాంగ్రెస్, యూపీఏ హయాంలో ఎన్నో విప్లమాత్మక మార్పులు వచ్చాయన్నారు.నెహ్రూ నుంచి మొదలుకుంటే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ వంటి అనేక మంది కాంగ్రెస్ ప్రధానులు ఈ దేశంలో అనేక సంస్కరణలు, విప్లవాలు తీసుకువచ్చారు. మరి మూడో సారి ప్రధాని అయిన నరేంద్రమోడీ ఈ దేశ ప్రజల కోసం ఏ రెవల్యూషన్ తీసుకువచ్చారు..? ఈయన హయాంలో దేశానికి ఏం సేవలు చేశారు..? ఎవరికి ప్రయోజనం చేకూర్చారో చెప్పండి. నేను సవాల్ విసురుతున్నా. పార్టీలను, ప్రభుత్వాలను విడగొట్టారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసేందుకు పనిచేశారు. కానీ ప్రజలకు మాత్రం ప్రధాని మోదీ పార్టీ ఏం చేయలేదు. రైతులను పట్టించుకోవటం లేదు. పార్టీలను చీల్చడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప మీరు చేసిందేంటీ..? ఈ దేశంలో ఉత్తర, దక్షిణ భారత దేశం అనే విభజన రావడానికి మాత్రమే ప్రధాని మోదీ పార్టీ ప్రయత్నాలు చేసింది కానీ దక్షిణాదికి చేసిందేమీ లేదు. దక్షిణాదికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది, కానీ ఇప్పుడు ఎన్డీయే మాత్రం దక్షిణాది నుంచి పెద్ద ఎత్తున పన్నులు తీసుకుంటోంది. కానీ తిరిగి ఇచ్చింది ఏమీ లేదన్నారు.దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సౌత్ స్టేట్స్ కు ప్రధాని మోడీ అందించిన సహకారం చాలా తక్కువ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దగా నిధులు ఇవ్వకపోయినా ఇక్కడి ఓట్లు కావాలని ఎలా అడుగుతారు. నార్త్ స్టేట్స్ తో పోలిస్తే సౌత్ స్టేట్స్ ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నా వాటిలో తిరిగి పొందేది మాత్రం చాలా తక్కువ. కేంద్రానికి మేం ఒక్క రూపాయి పంపిస్తే కేవలం రూ.40 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయి. అదే యూపీ నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే రూ.7, బిహార్ కు రూ.6 వెనక్కి వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలు ఆహ్వానిస్తున్నా నిధుల విషయంలో మాత్రం వివక్ష జరుగుతూనే ఉంది. ప్రధాని మోడీ ఉత్తర భారత దేశానికి చెందిన వ్యక్తి కావటమే ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడానికి కారణమన్నరు. "అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్ ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా బాపూ ఘాట్ అభివృద్ధి చేయబోతున్నాం. తేవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.గతంలో నార్త్ ఇండియా నుంచి ప్రధాని అయితే, సౌత్ ఇండియా నుంచి రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పాటించింది. కానీ ప్రధాని మోదీ హయాంలో ఇలాంటి సంప్రదాయాన్ని తుంగలో తొక్కారు. అందుకే దక్షిణాది నుంచి నీలం సంజీవరెడ్డి, అబ్దుల్ కలాం లాంటి వాళ్లు రాష్ట్రపతి అయ్యారు. కానీ ఎన్డీయే హయాంలో కేవలం అధికారంలోకి ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూ ఘాట్ ఉంది. గుజరాత్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంలా... బాపూ ఘాట్ లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోంది. గాంధీ వారసులుగా మేం బాపూ ఘాట్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి తీరుతాం. దీన్ని బీఆరెస్, బీజేపీ ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయి? .. మీరు గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించుకోవచ్చు కానీ మేము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే మీ బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారెందుకు..? ఎందుకంటే మేము గుజరాత్ కు పోటీ ఇవ్వబోతున్నామని అందువల్లే తెలంగాణను, హైదరాబాద్ ను ఫినిష్ చేయాలని బీజేపీ నేతలు మా ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటున్నారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతి సాధించి గుజరాత్ కు పోటీ ఇస్తుందనే విషయం తెలిసే మా ప్రయత్నాలను ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ వ్యతిరేకించిన మరుసటి రోజే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడతారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మిస్తే సమస్య ఏంటీ..?అని ప్రశ్నించారు.పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపించిన గత సీఎం కేసీఆర్ పది సార్లు కూడా సెక్రటేరియట్ కు రాలేదు. ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారు. కేసీఆర్ కు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్ ఆయనే ఫ్రీడం ఫైటర్ అని చెప్పుకుంటాడు. నాకేమీ అభ్యంతరం లేదు. తన ఫాంహౌస్‌లో పడుకొంటాడు. పదేళ్లలో ఒక్కసారి సచివాలయానికి రాలేదు. గత పది నెలల్లో ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు. మీకు డెమొక్రసీపై గౌరవం ఉంటే ఎందుకు రావట్లేదు. తానో జమిందార్, ప్రజలందరూ గులాంలని కేసీఆర్ అనుకుంటాడు. అందుకే బయటరు రావడం లేదు. తెలంగాణలో నాలుగు కోట్ల ప్రజలు ఎన్నుకుంటేనే మేము అధికారంలోకి వచ్చాం.

మీకు నచ్చుకుంటే ఇంట్లో కూర్చోండి. మా ప్రభుత్వాన్ని పని చేయనివ్వండి. మా ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలు అంతా గమనిస్తున్నారు. పార్లమెట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో కేసీఆర్ ప్రజల ఆలోచనను అర్థం చేసుకోవాలి.

ప్రజల ఆలోచనను పట్టించుకోకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సర్కార్ ను పడగొట్టాలని అనుకున్నారు. కానీ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే నాకు మద్దతుగా నిలిచారన్నారు.

# నవంబర్ 11న సీజేఐ కొత్త బాధ్యతలు



న్యూఢిల్లీ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్) భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో మొదటి ప్యూస్నే న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఖన్నా, ప్రస్తుత సీజేఐ , ఆజ చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. చంద్రచూడ్ గతంలో జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖన్నా నియామకానికి ప్రభుత్వ ఆమోదాన్ని ధృవీకరిస్తూ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చీ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. జస్టిస్ ఖన్నా 183 రోజులు మాత్రమే సీజేఐ ఉండనున్నారు. అంటే ఆయన కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ పదవిలో ఉంటారన్నమాట. అతను మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్ రాజ్ ఖన్నా మేనల్లుడు జస్టిస్ సంజీవ్ ఖన్నా ౦ఆఓ జబల్‌పూర్ కేసులో ఇచ్చిన తీర్పుతో ఆయన ప్రసిద్ధి చెందాడు.

# మోడీతో జర్మన్ చాన్సలర్ భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్) భారత ప్రధాని నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించేందుకు గాను శుక్రవారం వీరిద్దరూ సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా రక్షణ, వాణిజ్యం, స్వచ్ఛ ఇంధన రంగాలపై ఇరువురు నేతలు విస్తృత స్థాయిలో చర్చలు జరపున్నట్లు తెలుస్తోంది.18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో పాల్గొనేందుకు జర్మనీ ఛాన్సలర్ గురువారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చారు. గురువారం అర్థరాత్రి వచ్చిన ఛాన్సలర్‌ను రాష్ట్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిత్యానంద రాయ్ కలుసుకున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు స్కోల్జ్ అక్టోబర్ 24 నుంచి 26 వరకు భారత్‌లో అధికారికంగా పర్యటిస్తారని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. మెరుగైన భద్రత, రక్షణ సహకారంతో పాటు ఆర్థిక సహకారం.. స్థిరమైన అభివృద్ధి భాగస్వామ్యంపై ఇరువురు నేతలు చర్చించనున్నారని తెలుస్తోంది.అదే విధంగా శుక్రవారం ఢిల్లీలో జరిగిన 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ సమ్మిట్‌లో ఇరువురు నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జర్మనీతో పాటు ఇతర దేశాలకు చెందిన వ్యాపారులు, అధికారులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొననున్నారు. అనంతరం జర్మీ ఛాన్సలర్ గోవాకు వెళ్లనున్నారు. భారత్, జర్మనీలు 2000 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగిఉన్నట్లు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

# ఢిల్లీ బయలు దేరిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



శుక్రవారం, శనివారం రెండు రోజులు ఢిల్లీలో ఉండనున్న పీసీసీ అధ్యక్షుడు

పార్టీ పెద్దలతో కలిసే అవకాశం

రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశం

కార్యవర్గం కూర్పు ఇతర అంశాలు చర్చకు వచ్చే అవకాశం

రేపు సాయంత్రం ఢిల్లీలో జరగనున్న వీహెచ్‌పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో

పాల్గొననున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




న్యూఢీల్లీలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కూమార్‌గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్.శ్రీకాంత్‌గౌడ్

# కేటీఆర్ పరువు నష్టం కేసులో మంత్రి సురేఖకు షాక్..

× ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలి

× భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై యవద్దని కొండాను సురేఖను ఆదేశించించిన కోర్టు



హైదరాబాద్, అక్టోబర్ 25 కొండా సురేఖ తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ. 100 కోట్ల పరువు నష్టం కేసులో కోర్టు మంత్రి కొండా సురేఖకు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండిపడింది. ఓ బాధ్యత గల మహిళ మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొంది. కేటీఆర్ పై కొండా సురేఖ వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సీరియస్‌గా పరిగణించింది. భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబ్, ఫేస్ బుక్, గూగుల్ సంస్థలకు కూడా ఈ వ్యాఖ్యలు ఉన్న వీడియోలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రసారం చేసిన, కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలకు కూడా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆయా సంస్థలను కోరింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని ఆమె వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కథనాలు, వీడియోలు పబ్లిక్ డొమైన్ లో ఉండవద్దని కోర్టు తెలిపింది.

దేశంలో ఇదే మొదటి సారి..

పరువు నష్టం కేసుకు సంబంధించిన ఓ కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం ఇదే తొలిసారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని.. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిందన్నారు. ఆయనప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శిస్తున్నారు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్ కు బలం చేకూరినట్లైంది.

# ప్రజాబలం

**26 అక్టోబర్ 2024 శనివారం**


# రిజర్వేషన్లను అడగడం నేర్చుకోవాలి !

బీసీలకు రాజ్యాధికారం, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, మా వాటా మాకే, బీసీల కులగణన వంటి పతాక శీర్షికలతో మన దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీలు, మేధావులు, మీడియా సంస్థలు, విద్యావేత్తలు, ఉన్నత విద్యావంతులు, బీసీ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రయివేటు రంగ ఉద్యోగులు, కవులు, రచయితలు తదితరులు చేస్తున్న భావ ప్రకటనలు, సామాన్య ప్రజల మధ్య చర్చలు ఎనిమిది దశాబ్దాలకు చేరువలో ఉన్న స్వాతంత్ర్య భారతాన్ని నేడు తీవ్రంగా ప్రభావితం చేస్తుందనడం నిర్వివాదాంశం. ప్రపంచానికి భారతదేశం ఓ ఆశాకిరణం అంటూ మన ప్రధాని నరేంద్ర మోడీ, బీసీ డిక్లరేషన్ అంశాలతో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వంటి దేశ నాయకులు సైతం నేటి భవిష్యత్తు భారతంలో బీసీ సమాజం పాత్ర కీలకమని విశ్వసిస్తున్నారు. దాదాపు దేశ జనాభాలో 50 శాతం పైగా వున్న బీసీలు కొన్ని దశాబ్దాలుగా కొంతమంది నాయకుల స్వార్థపూరిత ఓటు బ్యాంకు రాజకీయాలతో విద్యా, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడి వున్నారని, ప్రజాస్వామ్య, లౌకిక భారతంలో సమాన అవకాశాలు పొందలేకపోయారని గణాంకాలతో సహా కొంతమంది మేధావులు, ప్రజాప్రతినిధులు విశ్లేషిస్తున్నారు. చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అవసరమని, మా హక్కుల కోసం మా పోరాటం అంటూ బీసీల పోరుబాట ప్రారంభమైంది. స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తోంది. ఏది ఏమైనా భారత్ లాంటి దేశంలో ప్రజల జీవితాల్లో మార్పు కేవలం రాజ్యాధికారం ద్వారానే సాధ్యపడుతుందని, కొన్ని దశాబ్దాలుగా రాజ్యాధికారం కొంతమంది చేతుల్లోనే ఉందని, ఆ తీరు మారి ప్రజల తీర్పుల్లో మార్పు రావాలనే ఆలోచనలు బలంగా వ్యాపిస్తున్నాయి. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులుగా బీసీలు ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా, దేశ ప్రధానమంత్రులుగా వున్నప్పుడే ఆశించిన మార్పు బీసీల జీవితాల్లో కనిపిస్తుందని, అందరికీ సమాన అవకాశాలు ఇస్తూనే, ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహం అందిస్తే మన దేశం ప్రపంచానికి దిక్సూచిగా మారుతుందని గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

1970లో అనంతరామన్ కమిషన్ నివేదిక, 1982 లో మురళీధరరావు ఏకసభ్య కమిషన్, తెలంగాణ ఆవిర్భావం తర్వాత బి.యస్ రాములు నేతృత్వంలోని తొలి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ వంటివి ఎన్నో విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలు చాలా వెనుకబడి వున్నారని వివరించాయి. నేడు దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయి నుంచే బీసీల రాజకీయ చైతన్యం కొత్త మలుపులు తిరుగుతోంది. ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో, అసెంబ్లీ, లోక్‌సభల్లో బీసీల గొంతుకలు వినిపించడం లేదు. మనమంతా కలిసి దేశంలో సగం భాగమై వున్నా కూడా "మన పాలన" ఏమయ్యిందంటూ కారణాలు వెతుక్కుంటున్నారు బీసీలు. ఇన్నాళ్లూ కేవలం పనివాళ్లు గానే వుంటూ పాలించే వారిగా ఎదగలేకపోయామని, కనీసం మన పిల్లల భవిష్యత్తులను మార్చుకుందామని అనుకుంటున్నారు. కొన్ని దశాబ్దాల పరిణామ క్రమం గమనిస్తే కొంతమంది బీసీ నాయకులే తమ స్వార్థ పూరిత రాజకీయ పదవుల కోసం కొంతమం ది అగ్రకులాల రాజకీయ నాయకుల వద్ద బీసీ జెండా వాడుకున్నారని, కుల సంఘాలను త్యాగం చేశారని తెలుస్తోంది. బీసీ కుల సంఘాల్లో కూడా కొన్ని కులాలకు చెందిన కొంతమంది నాయకుల ఆధిపత్య ధోరణే నేటి బీసీల అనైక్యత, వర్గపోరుకు కారణమని మేధావులు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్ స్థాయి అధికారులు వంటివారు సైతం అభిప్రాయపడుతున్నారు. అడుక్కోవడం మానేసి అడగడం నేర్చుకోవాలంటున్నారు. కనీసం ఇప్పటినుంచైనా ఎన్ని జెండాలు మన మధ్య వున్నా "బీసీల ఎజెండానే బీసీల రాజ్యాధికారం" కావాలని తమ సందేశాలను వినిపిస్తున్నారు. బీసీల సంఘటితమే నేడు చారిత్రాత్మక అవసరమని, బీసీల ఐక్యత ఓటు రూపమై బ్యాలెట్ బాక్సులో నిక్షిప్తం కావాలని బీసీల అభ్యున్నతికై పాటుపడే వ్యక్తులను నాయకులుగా మార్చాలని ఆశిస్తున్నారు. దేశవ్యాప్తంగా కొన్ని సందర్భాల్లో కొన్ని రాజకీయ వేదికల ద్వారా "మేము మాత్రమే పాలించగలం" అంటున్న కొంతమంది అగ్రకులాల నాయకులకు "బహుజనులం.. మేమేం తక్కువ కాదని చూపాల్సిన సందర్భం ఆసన్నమైంది. ఒక దగ్గర "ఆకలితో వున్న నలుగురు వ్యక్తులకు పది మందికి సరిపడా భోజనం ఇచ్చి, ఇంకో దగ్గర ఆకలితో ఉన్న ఇంకో 52 మందికి 25 మందికి సరిపడే భోజనం ఇచ్చి ఆకలి తీర్చుకోమంటే ఎలా? అని ప్రశ్నించే కలాలు, గళాలు కావాలిప్పుడు నేటీ బీసీల జీవితాల్లో మార్పు కోసం..! ఆకలి బాధ అందరికీ ఒక్కటే అయినప్పుడు న్యాయం జరగాలి. ప్రస్తుత తరుణంలో బీసీల కులసంఘాల నాయకులు వారి రాజకీయపార్టీల కతీతంగా ఏకాభిప్రాయానికి రావాలి. గంటలు గంటలు చర్చలు, రాజకీయ నాయకులపై విమర్శలు మాని, గతాన్ని వదిలేసే మౌనంగా బీసీలు ఐక్యమయ్యే పనులు చేస్తూ పోవాలి. ఎన్నికలు వచ్చినప్పుడు బీసీల వాణి ఓటు రూపమై ప్రతిధ్వనిస్తే బీసీల ప్రాతినిధ్యం అన్ని రంగాల్లో త్వరలోనే ఈ దేశం చూస్తుంది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ వారి రాజకీయ, సామాజిక చైతన్యం, సంఘటితం వంటి అంశాలను బీసీలు ఆదర్శంగా తీసుకొని జనాభా ప్రాతిపదికన అన్నిరంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కోసం అడుగులు వేయాల్సిందే. ప్రస్తుత పరిస్థితిలో బీసీలంటే కేవలం కొన్ని కులాల సమూహాలు కావు..! కొన్ని దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో సమాన అవకాశాలు పొందలేకపోయి వివక్షతకు గురైన స్వాతంత్ర్య భారతంలోని ఓ మెజారిటీ ప్రజల వర్గం. బీసీల పోరాటమంటే కొన్ని అగ్రకులాల అవకాశాలకు వ్యతిరేకం కాదు. కనీసం తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు కావాలని న్యాయబద్ధంగా కదిలిన కొన్ని కోట్ల మంది తల్లిదండ్రుల అంతరంగపు ప్రయత్నం.

# సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

### ఉపా చట్టం రద్దుచేసి, రాజకీయ ఖైదీలను విడుదల

### సిపిఐ, సిపిఎం, ఎం సిపిఐ, పలు ప్రజాసంఘాలు డిమాండ్

పిడుగురాళ్ల, పిడుగురాళ్ల పట్టణం లెనిన్ నగర్ స్తూపం సెంటర్లో శుక్రవారం ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు వివిధ ప్రజా సంఘాలు ఘనంగా నివాళులు అర్పించాయి. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపైన ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి జీవిత ఖైదీలుగా జైల్లో మగ్గించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనన్నారు. జీవితాంతం ప్రజల పక్షాన నిలిచిన నేరానికి పదేళ్లు జైలు శిక్ష అనుభవించి, అనారోగ్యం పాలైన ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆయన మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఉపా చట్టం రద్దుచేసి, జైల్లో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు, కే ఎన్ పి ఎస్ నాయకులు కె.కృష్ణ, భారత్ బచావో నాయకులు నవజ్యోతి, సర్దార్, ఎం సిపిఐ నాయకులు ఓర్సు కృష్ణ, పిడిఎం నాయకులు శ్రీనివాసరావు, మస్తాన్వలి, సిపిఐ నాయకులు కృష్ణా నాయక్, సిపిఎం టీ. శ్రీనివాసరావు,గిరిజన సంఘం కోట నాయక్, ఆర్టిఐ కుమార్ ఎమ్మార్పీఎస్ ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.



# దానా తుఫాను ప్రభావం సుఖాంతం!

## తుఫాను కారణంగా ఏలాంటి ప్రాణ నష్టం జరుగలేదు



భువనేశ్వర్ అక్టోబర్25 : దానా తుఫాను ఒడిశా, పశ్చిమ బెంగాల్ లో పంటలను, చెట్లను విధ్వంసం చేసింది. పౌర సేవలకు అంతరాయం కలిగించింది. శుక్రవారం ఉదయం కల్ల నెమ్మదించింది. ఒడిశాలో 7లక్షలకు పైగా జనాలను తీర ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శుక్రవారం తుఫాను కారణంగా ఎవరూ మరణించలేదని తెలిపారు.ఫాను ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాన్ని గురువారం రాత్రి దాటింది. తుఫాను నెలను తాకే ప్రక్రియ దాదాపు 10 గంటలు తీసుకుంది.ఒడిశాలో ఆరువేల మంది గర్భిణీ మహిళలను ఆరోగ్య కేంద్రాలకు తరలించడం సహా మొత్తం 6లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.తుఫాను నెలను తాకాక ఎన్ డిఆర్ఎఫ్ బలగాలు కేంద్రపాడ, భద్రక్, జగత్సింగ్పూర్ లలో పునరుద్ధరణ పనులు మొదలెట్టారు.శుక్రవారం ఉదయం నుంచి విమానాల రాకపోకలు, రైళ్ల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీనికి ముందు ఒడిశా, పశ్చిమ బెంగాల్ లకు 200కు పైగా రైళ్లను రద్దు చేశారు.దానా తుఫాను ఒడిశాలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగించింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ఒడిశాలో ఉన్న అతిపెద్ద రేవుపట్టణం పారాదీప్ కు ఎలాంటి నష్టం వాటిల్ల లేదు.

# వ్యక్తిపై కత్తులతో దాడి




విజయవాడ గొల్లపూడి మెయిన్ రోడ్డు వద్ద పట్టపగలే దారుణం జరిగింది. ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి జరిపారు. దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మేడపైన బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నిందితుల కోసం గాలింపు ప్రారంభించారు. బాధితుడు కంచికచర్ల పట్టణానికి చెందిన చరణ్ గా గుర్తించారు.

## సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉద్రిక్తత

కొడంగల్ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్లోని ఆర్బీ తండాలో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగాతండా వాసులు ఆందోళన చేపట్టారు. తమ గ్రామాల్లో ఫార్మా వద్దంటూ ఆందోళన చేసారు. ఆందోళన కారులను పోలీసులు అడ్డుకున్నారు.

## జనగామలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వాగ్వాదం

జనగామలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ రసభాస గా మారింది. బీఆర్ఎస్ –కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తులం బంగారం ఎక్కడ అని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్ ఎదుట బీఆర్ఎస్ –కాంగ్రెస్ నాయకులు వాగ్వాదం జరిగింది. గత ప్రభుత్వ విధానాలతో ఆర్థిక లోటి ఏర్పడిందని కాంగ్రెస్ కౌన్సిలర్లు అంటున్నారు.

# ఎర్రచందనం స్వాధీనం



బద్వేలు సిద్దవటం రేంజ్ లోని గొల్లపల్లి బీటులో 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. గొల్లపల్లి బీట్ సాలుపెంట ప్రదేశంలో ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసారు. ఒక్కరు పరారీ లో వున్నారు. డీఎఫ్ ఓ వినీత్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఎర్రచందనం దుంగలు మోసుకెళ్తున్న చాపాడు మండలానికి చెందిన హబీబుల్లా, తమిళనాడుకు చెందిన గోపి, తీర్థగిరిని అరెస్ట్ చేసారు.

## కంటైనర్ ఆటో ఢీ ముగ్గురికి గాయాలు



పత్తికొండ గుత్తి రహదారిలో రాతన మెట్టబండ దగ్గర పత్తికొండ నుండి తుగ్గలి పోయే ఆటో రాతన మెట్టబండ దగ్గర ఒకరిని దింపేందుకు సైడ్ కు ఆపడంతో వెనకనుంచి వేగంతో వస్తున్న మహారాష్ట్ర నుండి చెన్నైకి వెళ్తున్న,కంటైనర్ ఓఊ 46 ఃఈ9045 ఢీకొనడంతో రాతన గ్రామానికి చెందిన తిప్పన్న(80) లక్ష్మీ నారయణ(80) రంగమ్మ,(40) గాయాలయ్యాయి వైద్యం కోసం స్థానికులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు లక్ష్మీ నారయణ కు బాధితులు తరలించాలని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు

## భక్త కనకదాసు జయంతి ను అధికారికంగా నిర్వహించాలి

తుగ్గలి భక్త కనకదాసు జయంతి ను అధికారికంగా నిర్వహించాలని సంగోళి రాయన్న సేన నాయకులు గురువారం రోజున కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజుకు వినతిపత్రం ను అందజేశారు.ఈ సందర్భంగా వారు ఎంపీ తో మాట్లాడుతూ కురువల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ భక్త కనకదాస జయంత మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి,భక్త కనకదాసు రాష్ట్ర కార్యక్రమాన్ని కర్నూల్ లోనే నిర్వహించాలని,అన్ని ప్రభుత్వ సంస్థలలో కనకదాస జయంతిని నిర్వహించి,కనకదాసు జయంతి రోజున సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వారు ఎంపికు తెలియజేశారు.అదేవిధంగా శ్రీ శ్రీ శ్రీ భక్త కనకదాస భవనము,మ్యూజియం, విద్యాసంస్థలను కర్నూలు జిల్లాలోనే ఏర్పాటు చేయాలని ఎంపీకు వారు సమన్వయంగా విన్నవించారు.దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ ఖచ్చితంగా ఇలాంటి వ్యక్తులకు తగిన గుర్తింపు ఇచ్చి వారి పేరు మీద తగిన సంస్థలను నెలకొల్పాలని సీఎం దృష్టికి తీసుకుని వెళ్లి మాట్లాడతానని ఎంపీ భరోసానిచ్చినట్లు వారు తెలియజేశారు.

కర్నూలు ఎంపీకు జాతీయ సంగోలి రాయన్న సేన తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంగోలి రాయన్న సేన ప్రధాన కార్యదర్శి బత్తిన కిరణ్ కుమార్,కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీపురం మురళీమోహన్, మధుసూదన్,బండారి శ్రీనివాసులు, రాయలసీమ రవి ఎంకే సుంకన్న,లాలు, శివ నారాయణ,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రమరిచిన జర్నలిస్టు గణేశ్ శంకర్

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అందులో కొందరు గుర్తింపు లేకుండా పోయారు. ఆలాంటి వారిని సందర్భం వచ్చినప్పుడల్లా గుర్తు చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసిన రెండు రోజుల తరువాత, మరొక అమర వీరుడు భారత దేశం కోసం తన ప్రాణాలను అర్పించాడు. 40ఏళ్ల వయసులో ఒక లక్ష్యం కోసం ప్రాణాలను పోగొట్టుకున్న అసలు సిసలైన దేశ భక్తుడు. అయితే దురదృష్ట వశాత్తూ చాలామంది ఆయనను, ఆయన త్యాగాన్ని మరచి పోయారు. ఆయన భగత్ సింగ్ లాంటి విప్లవ వీరులతో కలిసి పోరాడిన స్వాతంత్ర్య పోరాట యోధుడు, పాత్రికేయుడు, భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడు, జాతీయోద్యమ కారుడు. అను వాదకుడు, ముఖ్యంగా హిందీ వార్తాపత్రిక "ప్రతాప్" వ్యవస్థాపక సంపాదకుడిగా సుపరిచితుడు. ఒక వార్తా పత్రిక వేదికగా,18 సంవత్సరాల పాటు బ్రిటిష్ వలస పాలనపై రాజీ లేని పోరు సల్పి పోరాడిన దమ్మున్న ఎడిటర్. విద్యార్థి ఆయనే గణేశ్ శంకర్ విద్యార్థి. అరుదైన వ్యక్తిత్వం కలిగిన గణేష్ శంకర్ తనకు తానే తన పేరు చివర "విద్యార్థి" (జ్ఞానాన్ని కోరేవాడు) అనే పదాన్ని చేర్చుకున్నాడు. గణేశ్ శంకర్ విద్యార్థి (26 అక్టోబర్ 1890 – 25 మార్చి 1931) ఫతేపూర్ జిల్లా హాథ్‌గావ్ అనే గ్రామంలో ఒక క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. మంగోలి అనే గ్రామంలో ఒక మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే తండ్రి జయ నారాయణ్ శిక్షణలో ప్రాథమిక విద్యను అభ్యసించి తర్వాత మంగోలి, విదిశలలో హైస్కూలు విద్య చదివాడు. పేదరికం కారణంగా చదువు కొనసాగించ లేక గుమాస్తాగా, అధ్యాపకునిగా కాన్పూరులో పనిచేశాడు. ప్రజా జీవితం పట్ల, జర్నలిజం పట్ల ఆసక్తి కలిగివుండి జాతీయోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. విప్లవ భావాలను ప్రచారం చేస్తున్న కర్మయోగి, స్వరాజ్య అనే హిందీ ఉర్దూ పత్రికలకు ఆయన పంపిణీ దారుగా పనిచేస్తూ క్రమేపీ ఆ పత్రికలలో రచనలు చేయడం ప్రారంభించాడు. ఆ క్రమంలో "విద్యార్థి" అనే కలం పేరును పెట్టు కున్నాడు. ఆయన ప్రతిభ చూసి పండిట్ మహావీర్ ప్రసాద్ ద్వివేది 1911లో తన హిందీ సాహిత్య మాసపత్రిక "సరస్వతి"లో ఉప సంపాదకునిగా ఉద్యోగం ఇచ్చాడు. అయితే సాహిత్యం కంటే వర్తమాన విషయాలు, రాజకీయాలలో ఉన్న ఆసక్తితో హిందీ రాజకీయ వారపత్రిక "అభ్యుదయ"లో ఉప సంపాదకునిగా ఆయన చేరాడు. 1913లో కాన్పూరుకు తిరిగి వచ్చి పాత్రికేయుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా తన జీవితాన్ని మలుచు కున్నాడు. "ప్రతాప్" అనే విప్లవాత్మక వారపత్రికను స్థాపించి తను మరణించే వరకు 18 సంవత్సరాలపాటు నడిపాడు. ఆ పత్రిక అనతి కాలంలోనే అన్నిరకాల అణచివేతలు వ్యతిరేకంగా పోరాడే పత్రికగా గుర్తింపు పొందింది. ఆ పత్రిక ద్వారా గణేష్ శంకర్ రాయబరేలీ రైతుల పక్షాన, కాన్పూరు మిల్లు కార్మికుల పక్షాన నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు. ఫలితంగా పలుమార్లు న్యాయస్థానాలలో అభియోగాలను ఎదుర్కొని భారీ జరిమానాలను చెల్లించాడు. ఐదు సార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. 1916లో లక్నోలో మహాత్మా గాంధీని ఆయన తొలిసారి కలిసి జాతీయోద్యమంలో చేరాడు. 1917–18లలో హోమ్ రూల్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. కాన్పూర్ జౌళీ కార్మికుల మొదటి సమ్మెను ముందుకు నడిపించాడు. 1920లో ప్రతాప్ దినపత్రిక ఎడిషన్‌ను ఆరభించాడు. అదే ఏడాది రాయ్‌బరేలీ రైతాంగ పోరాటంలో అరెస్ట్ అయ్యి రెండేళ్ళు కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. 1922లో విడుదలైన వెంటనే ఫతేగఢ్‌లో ఒక సభలో రాజ్య ద్రోహాన్ని ప్రేరేపించే విధంగా ప్రసంగించాడనే కారణంతో తిరిగి వెంటనే అరెస్టు చేశారు. ఫతేగఢ్‌లో జరిగిన ప్రావిన్షియల్ పొలిటికల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా శంకర్‌కు దేశద్రోహ ప్రసంగానికి జైలు శిక్ష విధించ బడింది. 1924లో భగత్‌సింగ్ కు సన్నిహితుడై ఆయన భగత్‌సింగ్‌తో కలిసి పోరాడాడు. తరువాత చంద్రశేఖర్ అజాద్‌కు కూడా సన్నిహితుడయ్యాడు. 1925లో స్వరాజ్ పార్టీ తరఫున ప్రావెన్షియల్ శాసన సభలకు జరిగిన ఎన్నికలలో కాన్పూర్ నుండి శాసన సభ్యుడిగా ఎన్నికై 1929 వరకు కొనసాగాడు. 1929లో కాంగ్రెస్ పార్టీలో చేరాక తన సభ్యత్వానికి రాజీనామా చేశాడు. 1928లో మజ్దూర్ సభను స్థాపించి మరణించే వరకూ నాయకత్వం వహించాడు. 1929లో యునైటెడ్ ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు. ఆ ప్రాంతంలో సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1930లో గోరఖ్ పూర్, న్యూ ఢిల్లీలలో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనాలకు హాజరయ్యాడు. అదే సంవత్సరం తిరిగి అరెస్టయి జైలుకు వెళ్ళాడు. గాంధీ – ఇర్విన్ సంధి ప్రకారం 1931 మార్చి 9న విడుదలయ్యాడు. కరాచీలో జరిగే కాంగ్రెస్ సమావేశాలకు హాజరు కావాలని తయార వుతుండగా అదే సమయంలో కాన్పూరులో మత ఘర్షణలు చెలరేగాయి. గణేశ్ శంకర్ విద్యార్థి అల్లరి మూకల మధ్య నిలబడి వారిని వారించి వేలాది మంది అమాయకుల ప్రాణాలను కాపాడాడు. వారిలో హిందువులు, ముస్లిములు కూడా ఉన్నారు. ఈ ప్రయత్నంలో ఆయనను ఒక అల్లరి మూక దారుణంగా పొడిచి చంపింది. అలా మత పరమైన ఘర్షణలు అడ్డుకునే క్రమంలో అమరుడు అయినాడు.

## తెలంగాణ వాతావరణం

### మాదిరెడ్డిసులోచన రచనా నేపథ్యం

తెలుగునాట నవలల్ని విశేషంగా చదివింపచేసే ఆలవాటు చేసిన రచయితల్లో మాదిరెడ్డి సులోచన ఒకరు. ఆనాడు కాల్పనిక ప్రభావంతో రచనలు చేసిన వారిలో ఆమె ఒకరు. ఊహాజనిత చిత్రణ కంటే వాస్తవిక జీవిత చిత్రణకు ప్రయత్నించారు. ప్రేమలు, పెళ్ళిళ్ళు కంటే కుటుంబ జీవితానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు. తెలంగాణ రచయిత్రుల సాహిత్య ప్రస్థానంలో మాదిరెడ్డి సులోచన ఒక మైలురాయి. ఆచార్య పాకాల యశోదారెడ్డి తరువాత తెలంగాణ పలుకుబడి, తెలంగాణ స్థానీయతను రచనల్లో చూపించిన రచయిత్రి మాదిరెడ్డి. మారుతున్న కాలంలో మారని విలువలను తెలియ జెప్పడంతో పాటు స్త్రీలను చైతన్య వంతులను చేసే ధ్యేయంతో నవలా యజ్ఞం సాగించిన రచయిత్రి మాదిరెడ్డి సులోచన. సమాజం విధించే కుహనా కట్టుబాట్లు, ఆచారాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని, జీవితాలను తీర్చిదిద్దుకున్న పాత్రలు మాదిరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. అలాగే, మార్పులకు లోనవుతున్న ఆర్థిక విధానాలతో ప్రభావితమైన సామాజిక విలువలు, ఆ క్రమంలో విపరీత మైన సంఘర్షణలకు లోనైన స్త్రీల జీవితాలకు కూడా సులోచన నవలలు అద్దం పడతాయి. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఎన్ని తరాలు మారినా, మారని మానవ నైజాలు, ప్రవృతులూ, ప్రేమ , ద్వేషం, స్వార్థం లాంటివి మాదిరెడ్డి సులోచన నవలలో స్పష్టంగా కనిపిస్తాయి. అర్ధ శతాబ్ది క్రితం, తెలంగాణ వాతవరణం, మానవ సంబంధాలూ కలిపి చక్కనైన కుటుంబ కథా నవలలను వ్రాశారు. ఆమె నవలలలో ఎక్కువగా మధ్య తరగతి కుటుంబాలలలో ఎదురయ్యే సమస్యలు కనిపిస్తూ వుంటాయి. మన చుట్టూ వుండే వాతావరణం ప్రతిబింబిస్తూ వుంటుంది. ఆ నవల చదువుతూ వుంటే ఇది ఎక్కడో మనమధ్యే జరిగిందే అన్నట్లు అనుభూతిని కలిగిస్తుంది. మాదిరెడ్డి సులోచన (26.10.1935 – 16.2.1983)

మహబూబ్ నగర్ జిల్లా శంషాబాద్ లో 1935 అక్టోబర్ 26న ఒక భూస్వామ్య కుటుంబంలో మామిడి రామకృష్ణారెడ్డి, మాణిక్యమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజుల్లో దొరలు, దేశముఖ్ ల ఇళ్ళల్లోని ఆడపిల్లలు ఘోషా పాటించడం వల్ల సులోచన ప్రాథమిక విద్యను ఇంట్లోనే పూర్తి చేసుకున్నారు. కొంతకాలం ఆర్య సమాజ్ గురుకుల పాఠశాల, బేగం పేటలో చదువుకుని మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి కళాశాల, నారాయణ గూడలో బి.ఎస్సీ డిగ్రీ చదివారు. భువనగిరి, నల్గొండ జిల్లా వాస్తవ్యులైన మాదిరెడ్డి రామచంద్రారెడ్డితో 1952లో వివాహం జరిగింది. వివాహం తర్వాత భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించారు. అలా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.యిడి ఎం.ఎ., ఎం.యి.డి పూర్తి చేశారు. తర్వాత మాదిరెడ్డి సులోచన ఉపాధ్యాయవృత్తిలో చేరి 1971 వరకు సుమారు పది సంవత్సరాలు కెమిస్ట్రీ ఉపాధ్యాయినిగా సెయింట్ జాన్స్ హైస్కూలులో పనిచేశారు. బోధనను తన వృత్తిగానే కాక ప్రవృత్తిగా కూడా మలచుకున్న ఉత్తమ పాటు ఇథియోపియా, జాంబియా దేశాలకు వెళ్ళి అక్కడ కూడా కొంతకాలం ఉపాధ్యాయినిగా పనిచేశారు. 1965లో 'జీవనయాత్ర' పేరుతో ప్రారంభమైన ఆమె నవలా ప్రస్థానం తరంగాలు , కలహంస, అంద గాడు, అపురూప , నాగ మల్లికలు, సంధ్య, శిక్ష, పూల మనసులు, మిష్టర్ సంపత్ ఎంఎ, లాహిరి, సజీవ స్మృతులు, స్నేహ ప్రియ, రాలిన రేకులు, నవతరం, ఎంత ఘాటు ప్రేమయో, పంతులమ్మ, వారసులు, కలకాదు సుమా, వంశాంకురం, అందని పిలుపు, నెలవంక, బిందు పథం, సుప్రియ, గడ్డితినే మనుషులు, మరో ప్రేమకథ, గాజు బొమ్మలు, ప్రేమ పంజరం, అపరంజి, సంసార నౌక, పుణ్య పురుషులు, ఋతుచక్రం, చిగురాకులలో చిలకమ్మ, మీరైతే ఏం చేస్తారు, ఆశయాల ఆఖరి మెట్టు, అధికారులు – ఆశ్రిత జనులు, సంధ్యారాగం, గెలుపు నాదే, అభినేత్రి, ఇల్లు కట్టి చూడుపెళ్ళి చేసి చూడు, శ్రీనిలయం, సృష్టిలో తియ్యనిది లాంటి 72 నవలలతో పాటూ దాదాపు 150 కథలు, 21 నాటికలు, 10 ఏకాంకికలు రాశారు. వీరి రచనలు ఆనాటి దిన, వార, మాస పత్రికల్లో ప్రచురిత మయ్యాయి. ఆమె రచించిన 10 నవలలు మేన కోడలు, ప్రేమలు – పెళ్ళిళ్ళు, ఈ కాలం పిల్లలు, ఈ తరం మనిషి , కళ్యాణి, కలవారి సంసారం, చందమామ, తరం మారింది మొదలైనవి సినిమాలుగా నిర్మించ బడ్డాయి. 1977 లో తరం మారింది సినిమాకు నందిఅవార్డు లభించింది. ఆమె రచనలపై అనేక పరిశోధనలు జరిగాయి. 1965 నుండి రచనలు ప్రారంభించిన మాదిరెడ్డి సులోచన 1983 ఫిబ్రవరి 16న అకాల మరణం చెందే వరకు రచనను కొనసాగించారు.

గృహలక్ష్మి నవలకు 1978లో స్వర్ణ కంకణము లభించింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు విభిన్న సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని నవలలు వ్రాసి ఆంధ్ర పాఠకుల హృదయాలలో చిర స్మరణీయంగా నిలచి పోయిన మాదిరెడ్డి సులోచన 1984లో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో మరణించారు.

# నిరసన ఉద్యమాల నగరం కోల్‌కతా !

అనాదిగా కోల్‌కతా నగరాన్ని 'సిటీ ఆఫ్ జోయ్' లేదా ఆనంద నగరం'గా పిలుస్తున్నాం. గత రెండు నెలలకు పైగా అదే ఆనంద నగరం "ఆక్రందల నగరం", "ఉద్యమాల నగరం" లేదా "ఊరేగింపుల నగరం"గా మారడం చూస్తున్నాం. 09 ఆగష్టు 2024న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరంలోని ఆర్ జి కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో 31 ఏళ్ళ పిజీ ట్రైనీ డాక్టర్ అమానవీయంగా రేప్ చేయబడి హత్యకు కూడా గురైన ఘటనతో భారత పౌర సమాజమంతా నిరసనల ఆగ్రహజ్వాలలతో అట్టుడికి పోయింది. ఈ కేసులో అనుమానితుడిగా 33 ఏండ్ల సివిల్ వర్కర్‌ను 10 ఆగష్టున అరెస్టు చేయడం కూడా జరిగింది. రాష్ట్రమంతటా నిత్యం పెద్ద సంఖ్యలో మహిళలు నిరసనల ర్యాలీలు, న్యాయపోరాటాలతో నేటికీ ఆనంద నగరం ఆసాంతం నిరసనల నగరంగా మారి న్యాయం కోసం ఊరేగింపుల ఉద్యమాలతో వేడెక్కుతున్నది. ఈ కేసును కోల్‌కతా హైకోర్టు సిబిఐకి అప్పగించడం, దర్యాప్తు ప్రారంభించడం కొనసాగుతోంది. న్యాయం కోసం నగరమంతా ఒకేసారి దీపాలు ఆర్పి వేయడం, నినాదాలు చేయడం, కవితాత్మకంగా తమ నిరసన గళాలు విప్పడం, మమతా బెనర్జీ నేతృత్వపు టియంసి ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటించడం లాంటి చారిత్రాత్మక ఉద్యమాల నెలవుగా నేడు కోల్‌కతా మారింది. నాటి నుంచి నేటి వరకు జూనియర్ డాక్టర్లు 10– డిమాండ్లతో నిరాహార దీక్షలు, దుర్గా పూజల్లో సహితం మహిళలు నిరసనలు తెలపడం, "జస్టిస్ ఫర్ ఆర్ జీ కర్" అంటూ నివేదించడం, సాధారణ ప్రజలు సహితం ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొనడం అనునిత్యం జరుగుతున్నాయి. ఈ ఉద్యమాల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ఉద్యమకారులు జాగ్రత్త పడుతున్నారు. బిజెపీ, లెఫ్ట్, కాంగ్రెస్ లాంటి ప్రతిపక్ష పార్టీలను ఆమడ దూరం పెడుతున్నారు. న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటం రానున్న రోజుల్లో మమత ఓటు బ్యాంకును కొల్లగొట్టే అవకాశాలు కూడా లేకపోలేదని అంటున్నారు. ఈ కేసులో న్యాయం కావాలంటూ మమత బెనర్జీపై అపారమైన ఒత్తిడిని పెంచడం, ప్రజాభిమానం కలిగిన టియంసీ నేడు ఆత్మరక్షణలో పడడం చూస్తున్నాం. నేడు సాధారణ పౌర సమాజం, ముఖ్యంగా మధ్య తరగతి మమతా బెనర్జీ అభిమాన జనం సహితం న్యాయం కావాలని ఊరేగింపుల్లో పాల్గొనడం, రాష్ట్రం స్కాములు/దోపిడీల నిలయంగా మారడం, వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి చెదలు పట్టడం, నిరుద్యోగం పెరగడం, ఉద్యోగాల ఎంపికల్లో మంత్రుల కనుసన్నల్లో అక్రమాలు చోటు చేసుకోవడం, పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు కేటాయించడం, పెట్టుబడులు పలుచబడడం, ఎన్నికల్లో హింసను ప్రోత్సహించడం, అభివృద్ధి కుంటుపడడం, ఆర్థికంగా రాష్ట్రం చితికి పోవడంతో రానున్న రోజుల్లో ప్రజాగ్రహం ఉవ్వెత్తున ఎగిసిపడుతూ మమతా బెనర్జీకి ఈ కేసు పంటి కింద రాయి వలె మారడం, తన ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా మారడం జరుగవచ్చు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాల సపోర్టు కూడా పొందిన ఈ న్యాయ పోరాట ఉద్యమాల్లో ఆయా వర్గాలు నేరుగా నిరసనల్లో పాల్గొనడం లేదు. ప్రభుత్వ ఉచిత పథకాలు, జీవనోపాధులు పొందుతున్న పేదలు ఈ కేసులో ఉద్యమించే విషయంలో పునరాలోచిస్తున్నట్లు తెలుస్తున్నది. నేడు బెంగాల్ ముస్లిమ్ ఓటు బ్యాంకు కూడా టిఎంసీ పాలనను క్షుణ్ణంగా పరిశీలించడం ప్రారంభించినప్పటికీ వారు మమతను విడిచి దూరం జరగడం అంత సులభమేమీ కాదని తెలుస్తున్నది. నేటి పశ్చిమ బెంగాల్ ఆర్ జీ కర్ కేసు పరిష్కారం మమతకు జీవన్మరణ సమస్యగా మారింది. తనకు వ్యతిరేకంగా తమ ఓటర్లు నిరసనలు పెంచితే దాని ప్రభావం రానున్న రోజుల్లో రాజకీయ సవాళుగా మారి ఎన్నికల్లో టిఎంసీకి ప్రాణ సంకటంగా కూడా మారే ప్రమాదం కూడా లేక పోలేదు. ఈ కేసులోను నీరుగార్చడానికి సాక్ష్యాలు, రుజువులను రూపుమాపే లేదా తారుమారు చేసే ప్రయత్నాలు ప్రభుత్వం లేదా పోలీసు వర్గాలు చేస్తే భవిష్యత్తులో మమతకు చిక్కులు మరింతగా పెరిగే ప్రమాదం కూడా ఉన్నట్లు విశ్లేషిస్తున్నారు. నేడు మమత ముందున్న ఏకైక మార్గం ఆర్ జీ కర్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నేరస్తులకు తగిన శిక్ష పడే విధంగా అడుగులు వేయడం తప్పనిసరి అవుతున్నది. రానున్న రోజుల్లో "జస్టిన్ ఫర్ ఆల్", "జస్టిస్ ఫర్ ఆర్ జీ కర్" సత్వరమే లభిస్తుందని, దోషులను ఉరి తీస్తేనే ప్రజాగ్రహంపై నీళ్ల చల్లినట్లు అవుతుందని మమత భావించాలి, ప్రజలకు/మహిళలకు కనీస భద్రతను కల్పించి మనోధైర్యం పెంచాల్సిందిగా బెంగాలీ పౌర సమాజం కోరుకుంటున్నది.

# మేజిస్ట్రేట్ హోదాలో సీవీ ఆనంద్ వార్నింగ్

వరంగల్, అక్టోబరు 25, హైదరాబాద్ మహానగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో కార్యనిర్వాహక న్యాయస్థాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అందజేసిన సమాచారంపై సమీక్షించారు. ఇటీవల నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగిన ఉద్రిక్తతను సమీక్షించారు. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ ఫిరోజ్ ఖాన్ మధ్య తీవ్రమైన రాజకీయ వైరం నెలకొంది. ఈ రెండు నేతల రాజకీయ వ్యత్యాసాలు మరియు అనుచరుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంతో నియోజకవర్గంలో శాంతి భద్రతలు తరచూ ప్రశ్నార్థకంగా మారాయి. కొద్ది రోజుల క్రితం మహ్మద్ మజీద్ హుస్సేన్ తన అనుచరులతో కలిసి ఫిరోజ్ గాంధీ నగర్‌లో సిసి రోడ్డుకు సంబంధించిన సివిల్ పనులను పరిశీలించేందుకు వెళ్లారు. అదే సమయంలో, కాంగ్రెస్ పార్టీకి చెందిన మహ్మద్ ఫిరోజ్ ఖాన్ కూడా తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. ఇద్దరు నాయకుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఇరువర్గాల అనుచరులు పరస్పర విరుద్ధంగా వ్యవహరించడం వలన ఆ ప్రాంతంలో ప్రజలలో భయాందోళనలు ఏర్పడ్డాయి, మరియు అక్కడి శాంతి భద్రతలు భంగం కలిగించాయి. ఆ ప్రాంతంలోని పరిస్థితులు తీవ్రతరమవుతుండగా, హుమాయున్ నగర్ పోలీసులు ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొట్టేందుకు దాడి చేశారు. శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాలపై చట్టప్రకారం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు హుమాయున్ నగర్ ఎస్‌హెచ్‌వో సమర్పించిన సమాచారాన్ని సమీక్షించారు. ఎస్‌హెచ్‌వో నివేదిక ఆధారంగా, ఇరువర్గాల మధ్య తీవ్ర రాజకీయ వైరం ఉంది. వారి తప్పుడు చర్యలు భవిష్యత్తులో శాంతికి పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ సమాచారంపై విచారణ చేపట్టిన కమిషనర్ ఇరువర్గాల ప్రతినిధులను వ్యక్తిగతంగా పిలిచి వారి వాదనలు విన్నారు. ఇరువర్గాల నాయకులు వారి వాదనలు విన్న కమిషనర్, ఇలాంటి రెచ్చగొట్టే చర్యల నుండి దూరంగా ఉండాలని కఠినంగా హెచ్చరించారు. కోర్టు విచారణ అనంతరం, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈ కేసును తదుపరి విచారణకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం, ఎవరైనా వ్యక్తి లేదా సమూహం భవిష్యత్తులో శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉంటే, వారికి షరతులతో కూడిన బాండ్ అమలు చేయాల్సి వస్తుందని సీపీ వార్నింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించగల వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆనంద్ నిర్ణయించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ఉండటానికి ఇరువర్గాలపై నిఘా ఉంచాలని కొత్వాల్ సూచించారు.

# పెండింగ్ డీఏలకు మోక్షమెప్పుడో..?

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ అన్నది ప్రభుత్వం ఎప్పుడు ఆర్భాటంగా ప్రకటించే కానుక కాదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వాస్తవ వేతనాలు పడిపోకుండా ఇచ్చే పరిహారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ డీఏలను విడుదల చేస్తామనే హామీని పది నెలలు గడిచిన నూతన ప్రభుత్వం ఎందుకు నిలబెట్టుకోవడం లేదు? రైతన్నలకు, నిరుద్యోగులకు, మహిళా సంఘా లకు ప్రభుత్వ విద్యకు అండగా ఉంటున్న ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల వివక్ష ఎందుకు చూపిస్తుంది. అంటూ సగటు ఉద్యోగి ఆవేదన చెందుతున్నాడు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏ ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టడం పట్ల చిన్నాచితక ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీఏను ప్రభుత్వం ఏడాదిలో రెండుసార్లు ఇస్తుంది. ఒకటి ఏడాది ప్రారంభం జనవరిలో రెండవది జూలై నెలలో ఉంటుంది. గత ప్రభుత్వం మూడు డీఏలను పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులందరికీ తక్షణ మే మూడు డీఏలు చెల్లిస్తామని అలాగే ఫస్ట్ తారీఖున వేతనాలు అందజేస్తామని, పీఆర్సీ ఇస్తామని, సీపీఎస్ విధానం రద్దు చేస్తామని, 317 జీవోను సమీక్షించి బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. కానీ నూతన ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క జీతాల సమస్య తప్ప మిగతా హామీలు నెరవేర్చలేకపోయింది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతభత్యాలలో గుణాత్మక మార్పు లేకపోవడమే కాకుండా ప్రతి ఆరు మాసాలకు ఒకసారి ప్రకటించాల్సిన కరువు భత్యంను గత రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయుల జీవన వ్యయం నిరంతరాయంగా పెరుగుతున్నది. 2022 జనవరి కరువు భత్యంను గత ప్రభుత్వం 2023 జూన్ నెలలో ప్రకటించింది. 2022 జూలై డీఏ 2023 జనవరి, జూలై డీఏలు అలాగే 2024 జనవరి, జూలై మొదలైన 5 డీఏలకు సంబంధించిన 18.20 శాతం కరువు భత్యంను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం డీఏను, కేంద్ర ప్రభుత్వం లేటెస్ట్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ ఆధారంగా నిర్ణయిస్తుంటుంది. గత మూడేళ్లు గా నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. పండగల సందర్భంగా రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా పెరగడంతో చిన్న స్థాయి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నానాయాతన పడుతున్నారు. మంచి నూనె ధరలు లీటర్‌పై రూ. 20–45 వరకు పెరిగాయి. అల్లం కిలో రు.100 నుంచి రు.150, వెల్లుల్లి రూ.300 నుంచి రూ.360, ఎండుమిర్చి రూ. 200 నుంచి రూ. 250, కందిపప్పు కిలో రూ.150 నుంచి రూ.175, పెసరపప్పు రూ. 120 నుండి రూ. 150, మినపప్పు రూ.135కు చేరింది. ఉల్లి ధరలు రూ.60 నుంచి కిందకు దిగడం లేదు. కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. ఇలా పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాలు పెరగక ఇవ్వాల్సిన డీఏలు ఇవ్వక ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కరువు భత్యంను ప్రకటించడం ప్రభుత్వాల దయగా మారింది. ఉద్యోగుల హక్కు ఆయన కరువు భత్యం కోసం కొట్లాడవలిసిన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు గత దశాబ్ద కాలంగా పోరాటాలు మర్చిపోయాయి. పెండింగ్ డీఏల గురించి ప్రశ్నించలేకపోతున్నాయి. నూతన సంవ త్సరం, రాష్ట్ర అవతరణ దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం, దసరా దీపావళి పండుగల కానుకగా సీఎం మంజూరు చేస్తారంటూ ఎప్పటికప్పుడు సంఘాలు మభ్య పెట్టడమే తప్ప గట్టి ప్రయత్నం చేయడం లేదు. ధరల పెరుగుదలను అరికట్టలేని ప్రభుత్వాలు నిజవేతనాన్ని భర్తీ చేసే కరువు భత్యాన్ని మాత్రం ఎగ్గొట్టడం ప్రభుత్వం చేతగానితనం అవుతుం ది. కావున పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకోవాలి.

# తారాస్థాయికి ఆస్తి వివాదం జగన్ వర్సెస్ షర్మిల



కడప, అక్టోబరు 25, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య తలెత్తిన ఆస్తుల వివాదాలు తారాస్థాయికి చేరాయి. అన్న లేఖాస్త్రాలు, చెల్లి విమర్శనాస్త్రాలతో ఇద్దరి మధ్య చిన్నపాటి యుద్ధమే నడుస్తోంది. దీంతో వివాదాలు మరింత ముదురుతున్నాయే తప్ప, ఫుల్‌స్టాప్ పడే అవకాశాలు ఏ మాత్రం కనిపించట్లేదు. ఈ మాటల యుద్ధం ప్రత్యర్థులకు ప్రధాన అస్త్రంగా మారింది. అధికార టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందన, ఇందుకు ప్రతిస్పందనగా జగన్ కౌంటర్ ఇవ్వడంతో ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు వేడెక్కాయి. దీంతో ఇప్పుడు ఆస్తుల లొల్లి గురించే ఎక్కడ చూసినా మాట్లాడుకుంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్ర దర్యాప్తు సంస్థలు షేర్ల బదిలీలపై ప్రశ్నించడంతో ఈ మొత్తం వివాదం మొదలైందనే చర్చ జరుగుతోంది.

రెండు మూడ్రోజులుగా మీడియా, సోషల్ మీడియాలో ఎటుచూసినా ఈ వివాదంపైనే చర్చ నడుస్తుండటంతో విజయనగరం పర్యటనలో భాగంగా జగన్ నేరుగా తొలిసారి స్పందించారు. ' నేను విజయనగరం వస్తున్నానని టీడీపీ టాపిక్ డైవర్ట్ చేసింది. మా చెల్లెలు, మా అమ్మ, నా ఫోటోలతో రాజకీయం చేస్తున్నారు. విమర్శలు చేస్తున్న అందరినీ ఒకటే అడుగుతున్నా. మీ ఇళ్లలో ఇలాంటి కుటుంబ గొడవలు ఏమీ లేవా?. అయ్యా ఇవన్నీ ఘర్ ఘర్‌కీ కహానీలు. ప్రతి ఇంట్లో ఉన్న విషయాలే. వీటిని మీ స్వార్థం కోసం పెద్దవి చేసి చూపడం, నిజాలు లేకపోయినా వక్రీకరించి చూపించడం మానుకుని ప్రజల సమస్యలపై ధ్యాస పెట్టండి. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలని చంద్రబాబును అడుగుతున్నాను. పక్క చూపులు మాని ప్రజా పరిపాలన సాగించండి. ఎప్పుడూ మా కుటుంబంపై పడి ఏడ్చే బదులు, రాష్ట్రంలోని అఘాయిత్యాలు, నేరాలను అరికట్టండి. మీడియా ముసుగులో చంద్రబాబును మోస్తున్న వారిని, దత్తపుత్రుణ్ని కూడా అడుగుతున్నాను. టీడీపీ అక్రమాలు, అన్యాయాలు బయటపడుతున్నాయనే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు' అని వైఎస్ జగన్ ఆరోపించారువైఎస్ జగన్ లేఖ, విమర్శలకు షర్మిల కూడా ఘాటుగానే బదులిచ్చారు. కుటుంబాల్లో సమస్యలు ఉంటాయి సహజమే కానీ అందరూ అమ్మల మీద కోర్టులో కేసులు వేయరని అన్నకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తండ్రి వైఎస్ ఆదేశాలను, అభిమతాన్ని గాలికి వదిలేసి మాట తప్పి మడమ తిప్పారని కన్నెర్రజేశారు. నైతికంగా దిగజారిపోయినా, అథ:పాతాళపు లోతుల నుంచి పైకొచ్చి ఇప్పటికైనా తండ్రికి ఇచ్చినా నిలబెట్టుకోవాలన్నారు. 2019 ఆగస్టు 31న చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నట్లు షర్మిల చెప్పారు. ఎప్పటికీ జగన్ ఇలాగే ఉంటే మాత్రం తన హక్కులను కాపాడుకునేందుకు కచ్చితంగా చట్టపరంగా మార్గాలను ఎంచుకుంటానని హెచ్చరించారు. నాన్న ఆస్తులన్నీ తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా చెందాలని ఆదేశించిన విషయాన్ని షర్మిల గుర్తు చేశారు.'నాన్న కలలో కూడా ఊహించని పని జగన్ చేశారు. నా రాజకీయ జీవితం నా ఇష్టం. నా వృత్తిపరమైన వ్యవహారశైలి ఎలా ఉండాలో చెప్పే అధికారం మీకు లేదు. నాకు వాటాగా పేర్కొన్న సరస్వతి పవర్‌లోని షేర్లు ఒప్పందంపై సంతకం చేసిన వెంటనే బదలాయిస్తానని మాటిచ్చారు. ఆ హామీ నెరవేర్చకుండా అనవసర వివాదాలు లేవనెత్తుతూ కుటుంబాన్ని రచ్చకీడ్చడం ఏ మాత్రం పద్ధతి కాదు" అని అన్నపై షర్మిల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంపై మాట్లాడేందుకు షర్మిల శుక్రవారం మీడియా ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే వాడీవేడిగా వివాదం నడుస్తుండగా ఆమె ఏం మాట్లాడుతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఇవన్నీ ఒకఎత్తయితే ఈ ఆస్తి వివాదం ఇప్పుడే ఎందుకనే ప్రశ్నలకు పలు రకాలుగా సమాధానాలు వస్తున్నాయి. మనీలాండరింగ్ కేసులో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆస్తుల బదలాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రశ్నించడంతోనే వివాదం మొదలైనట్లుగా తెలుస్తోంది. అయితే సరస్వతీ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు అన్నీ ఉన్నాయని లేఖలో స్పష్టం చేశారు. డాక్యుమెంట్స్ అన్నీ ఆయన దగ్గరే ఉంటే గిఫ్ట్‌డీడ్ ఆధారంగా షేర్లు ఎలా బదిలీ అయ్యాయనే ప్రశ్నలకు సమాధానాలు దొరకట్లేదు. షేర్లను తల్లి విజయమ్మ పేరిట బదిలీ చేసిన తర్వాత, గిఫ్ట్ డీడ్‌పై జగన్, భారతీ సంతకాలు చేసినా వివాదాలు సృష్టించడం ఎందుకు అని షర్మిల ప్రశ్నిస్తున్నారు.ఆస్తి వివాదాలు నడుస్తున్న ఈ తరుణంలో బాంబ్ లాంటి వార్త బయటికొచ్చింది. కాంగ్రెస్‌లో వైసీపీ విలీనం అంటూ ఢిల్లీ నుంచి గల్లీ వరకూ చర్చ నడుస్తోంది. మూడో కంటికి తెలియకుండా ఇదంతా జరుగుతోందని అందుకే అన్నా చెల్లి ఇద్దరూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గడిచిన మూడు మాసాలుగా వైసీపీ-కాంగ్రెస్ మధ్య జరిగిన చర్చలు కొలిక్కి వచ్చాయని టీడీపీ నేతలు కొందరు ఆరోపిస్తున్నారు. విలీనం లేకపోయినా కాంగ్రెస్‌తో పొత్తు అయినా ఉంటుందన్నది మరికొందరి వాదన. అయితే ఈ వార్తలపై వైసీపీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో, మౌనానికి అర్థం అంగీకారమనే మాటలు వినిపిస్తున్నాయి.

# లీడర్లకు ఫ్యాన్ కింద ఉక్కపోత ఎక్కువైందా?

విజయవాడ, అక్టోబరు 25,పవర్ ఈజ్ అల్వేస్ పవర్ ఫుల్. పార్టీ పవర్‌లో ఉన్నప్పుడు అందరూ వెంట నడుస్తారు. అపోజిషన్‌లో ఉన్నప్పుడు మనోళ్లు అనుకున్నోళ్లు ఆమడ దూరం వెళ్లిపోతుంటారు. రాజకీయమన్నాక ఇదంతా కామన్. ఇప్పుడిదే పరిస్థితిని ఫేస్ చేస్తోంది వైసీపీ. ఆళ్లనాని నుంచి లేటెస్ట్‌గా వాసిరెడ్డి పద్మ వరకు..అందరూ జగన్‌కు వెన్నుదన్నుగా నిలిచినవారే.కాంగ్రెస్‌ను విబేధించి బయటికి వచ్చినప్పటి నుంచి..జగన్ వెంట నడిచిన వారే. ఈ లీడర్లు ఇప్పుడు ఫ్యాన్ పార్టీకి దూరం అవుతున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం.. నమ్మిన నేత కోసం పనిచేసిన నేతలు..అధికారంలో ఉన్నప్పుడు తమకు దక్కని గౌరవం, జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ..ఇప్పుడు రాజీనామాలా బాటపట్టారు. లేటెస్ట్‌గా వాసిరెడ్డి పద్మ రాజీనామా చర్చనీయాంశం అవుతోంది.ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. రాజీనామా లేఖను వైసీపీ ఆఫీస్‌కు పంపారు. రిజైన్ లెటర్‌లో వైసీపీ చీఫ్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ పాలనలో జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారని.. ప్రభుత్వ మద్యం పేరుతో పేద ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు.ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని.. వైసీపీలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని..ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేశానని చెప్పుకొచ్చారు వాసిరెడ్డి పద్మ. పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదని..నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసిందన్నారు. జగన్ గుడ్ బుక్ పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు..నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది గుడ్ బుక్ కాదు గుండె బుక్ అంటున్నారు వాసిరెడ్డి పద్మ.ఇప్పటివరకు వైసీపీని వీడిన నేతలు పార్టీ కోసం చాలా త్యాగాలు చేశారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని జగన్ వెంట నడిచారు. అధికారంలోకి వచ్చాక జగన్ కూడా వాళ్లకు మంచి స్థానమే కల్పించారు. మోపిదేవి వెంకటరమణ అయినా, బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అయినా..వాసిరెడ్డి పద్మ అయినా తగిన న్యాయమే చేశామని చెప్తున్నారు వైసీపీ నేతలు.కానీ గొంతెమ్మ కోరికలు కోరి..పైగా ఇచ్చిన పదవులతో గత ఐదేళ్లు కంఫర్ట్‌గా ఉండి..ఇప్పుడు జగన్ మీద విమర్శలు చేయడమే స్వార్థపూరితమేనని కౌంటర్ ఇస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవిస్తున్నప్పుడు..వీళ్లకు ఈ లోపాలు కనిపించలేదా అని ప్రశ్నిస్తున్నారు. నచ్చకపోతే అప్పుడే పార్టీకి ఎందుకు దూరంగా ఉండలేదో చెప్పాలంటున్నారు.అయితే నేతలు పార్టీని వీడటం వెనక జగన్ తప్పిదాలు కూడా ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. కష్టపడినోళ్ల కంటే పవర్‌లోకి వచ్చాక దగ్గరైన వారికే ఎక్కువగా న్యాయం చేశారంటున్నారు. అలాంటప్పుడు 15ఏళ్లుగా జగన్ వెంట నడుస్తున్న లీడర్లకు అసహనం కలగడంలో న్యాయమే ఉందన్న టాక్ కూడా ఉంది.పార్టీ మారుతున్న నేతలది తప్పా..లేక జగన్ జంపింగ్‌ను కట్టడి చేయలేకపోతున్నారా.. అదీ కాకపోతే లైట్ తీసుకుంటున్నారా అన్న చర్చ జరుగుతోంది. అయితే అవసరాలు, పరిస్థితులదే ప్రస్తుత సిచ్యువేషన్‌లో కీరోల్ అని స్పష్టం అవుతోంది. జంప్ అవుతున్న కొందరు నేతలకు బిజినెస్‌లు ఉండొచ్చు. కొందరికి ఈ ఐదేళ్లు అపోజిషన్‌లో ఉండే ఇష్టం లేకపోవచ్చు. లేకపోతే అధికార పార్టీ నుంచి ఆఫర్ రావొచ్చు. అధినేత తీరు నచ్చకపోవచ్చు. దీంతో రీజన్ ఏదైనా జంపింగ్ కామన్ అయిపోయింది.

# గంజాయి స్వాధీనం

సంగారెడ్డి జిల్లా బిడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్దనూర్ అవుటర్ రింగ్ రోడ్డు వద్ద ఒరిస్సా నుంచి కర్ణాటక వైపునకు అక్రమంగా తరలిస్తున్న 50 కిలోల గంజాయిని పట్టుకున్నారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం బాల్కికి చెందిన మల్లేష్ జాదవ్ (23) తో పాటు మరో ముగ్గురు రెండు కార్లు, ఒక బైక్ లో గంజాయిని తీసుకెళ్తున్నారు. పక్కా సమాచారంతో బీడీఎల్ పోలీసులు పట్టుకోవడంతో మల్లేష్ జాదవ్ పట్టుబడగా మరో ముగ్గురు అక్కడే వాహనాలను వదిలిపెట్టి పరారయ్యారు. నిందితుని వద్ద నుంచి రెండు కార్లు, ఒక బైక్, రెండు సెల్ ఫోన్లతో పాటు 50 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 50 కిలోల గంజాయి బహిరంగ మార్కెట్లో 12లక్షలు50 వేలు ఉంటుందని డిఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడించారు.

### తిరుపతిలో పలు హోటల్స్ కు బాంబు బెదిరింపులు

### అర్థరాత్రి ఉలిక్కిపడ్డ తిరుపతి నగరం

తిరుపతి నగరంలోని లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హోటళ్లు, రామానుజ కూడలిలోని మరో హోటల్కు మెయిల్లో బెదిరింపులు రావడం కలకలంరేపింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. గురువారం ఆర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. తమిళనాడులో టెర్రరిస్ట్ జాఫర్ సాదిక్ కు జైలు శిక్ష ఖరారు పై మెయిల్ లో అగంతకులు ఆక్రోశం వ్యక్తం చేసారు. శిక్ష పడేందుకు తమిళ సర్కార్ తరఫున సీఎం స్టాలిన్ సహకారం అందించడం మాకు నచ్చలేదని పేర్కొన్నారు.రాష్ట్రంలోని పాఠశాలల్లో పేలుళ్లకు ఐఎస్ఐ పూనుకొంది. అలాగే సమీపంలో ఉన్న పుణ్యక్షేత్రం తిరుపతిలో పలు హోటళ్లను కూడా పేల్చేస్తామని మెయిల్ లో పేర్కొన్నట్లు సమాచారం.

# ఇక డెలివరీ ప్లాట్ ఫాంగా వాట్సాప్

విజయవాడ, అక్టోబరు 25, ఏపీలో పౌర సేవలు, ప్రభుత్వ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే ప్రజలు నేరుగా వాట్సాప్‌లో పౌర సేవలు అందుకునే రోజులు అతి సమీపంలో ఉన్నాయి. వాట్సాప్ మాతృ సంస్థ మెటాతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. మెరుగైన పౌరసేవల కోసం మెటాతో ఎపి ప్రభుత్వ ఒప్పందంతో నవంబర్ 30నుంచి వాట్సాప్ బిజినెస్ ద్వారా 100 రకాల పౌరసేవలు నేరుగా అందుకునే అవకాశం లభిస్తుంది.

ప్రభుత్వం నుంచి పౌరసేవల అందించే డెలివరీ మెకానిజంను సులభతరం చేయడానికి మెటాతో , ఆంధ్రప్రదేశ్ ఐటి,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖల నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల వాట్సాప్ బిజినెస్ సర్వీస్ డెలివరీ ప్లాట్ ఫాంగా పలురకాల పౌరసేవలను ప్రజలకు అందిస్తుంది.

చిప్తజీబిబంజూజూ మూడు ప్రాథమిక నమూనాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి డెలివరీ ప్లాట్ ఫాంగా ఈ ఒప్పందం ఉపయోగపడుతుంది.

1).ఉ2అ (ప్రభుత్వం నుండి పౌరులకు)

2).ః2అ (వ్యాపారం నుండి వినియోగదారునికి)

3).ఉ2ఉ (ప్రభుత్వం నుండి ప్రభుత్వం)

100రకాల పౌరసేవలు?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 30, నవంబర్, 2024 నాటికి వాట్సాప్ ద్వారా 100రకాల సేవలను ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. మొదటి దశలో వాణిజ్యరంగంలో సమర్థవంతమైన ప్రభుత్వ సర్వీస్ డెలివరీ కోసం రీ ఇంజనీరింగ్ విధానాలను అమలుచేస్తారు. రెండోదశలో ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా సులభతరంగా పౌరసేవలు అందిస్తారు.ఈ ప్రక్రియలో, ఈ క్రింది విధంగా వివిధ రకాలసేవలను అందించడానికి ప్రాథమికంగా నిర్ణయించారు.

1.ఎండోమెంట్ సేవలు:

ఆంధ్రప్రదేశ్‌లోని 7 ప్రధాన దేవాలయాల్లో దర్శనం, వసతి, విరాళాలు, వివిధరకాల సేవల కోసం స్లాట్‌ను బుక్ చేసుకోవడం వంటి సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయి.

2. రెవెన్యూ సేవలు:

పౌరులు వివిధ రకాల సేవల కోసం చేసుకున్న తమ దరఖాస్తుల స్థితిని సులభంగా తనిఖీ చేసుకోవడానికి వీలుకలుగుతుంది. పారదర్శకమైన యాక్సెస్ తో సర్వే నంబర్లు, భూభాగాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంటాయి. సర్వే నంబర్ల ఆధారంగా భూమిని గుర్తించడంలో సహాయం అందుంది. ఈ సమాచారాన్ని స్వతంత్రంగా కనుగొనడంలో వినియోగదారుల యాక్సెస్ మెరుగుపరుస్తారు.కులం, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం అభ్యర్థనలను క్రమబద్ధీకరిస్తారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ కోసం వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ప్రజలకు లభిస్తుంది.

3. పౌర సరఫరాలు

పౌరులు రేషన్ కార్డ్ల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలయ్యాక రేషన్ కార్డులను జారీ చేయడం, రేషన్ పంపిణీ స్టేటస్ ను అప్ డేట్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

4. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ అఫైర్స్ (ఓండజఆ)

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వాణిజ్య లైసెన్సులు వంటి సేవలు వాట్సాప్ ద్వారా పొందే అవకాశం ఏర్పడుంది.

5. నమోదు

ప్రభుత్వ శాఖల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి చిప్తజీబిబంజూజూను సాంకేతిక భాగస్వామిగా సేవలను అభివృద్ధి చేస్తుంది. భద్రతను నిర్ధారించే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి సకాలంలో నోటిఫికేషన్‌లు, సర్టిఫికెట్‌లు జారీ, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ మొదలైన వాటి కోసం దరఖాస్తు చేయడానికి అవకాశమేర్పడుంది.

6. విద్యుత్ శాఖ

విద్యుత్ శాఖలోని ఒఖఇఖఆఅఒ, ఒఖఅఖఆఅఒ, ఒఖూఖఆఅఒ పరిధిలో విద్యుత్ బిల్లు చెల్లింపునకు వాట్సాప్ ద్వారా అవకాశం లభిస్తుంది. ప్రజల అభ్యర్థనల మేరకు జియో లొకేషన్ ఆధారంగా కొత్త హై-టెన్షన్ లైన్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇన్‌స్టాల్ చేయడం, ట్రాన్స్‌కో, అంతర్గత కమ్యూనికేషన్ ఛానెల్‌లు, అలర్ట్ సర్వీస్‌లు అందుబాటులోకి వస్తాయి.

7. పరిశ్రమలు

పరిశ్రమల శాఖ ఇప్పటికే ఔట్ రీచ్ కమ్యూనికేషన్ కోసం చాట్‌బాట్‌లను ఉపయోగిస్తోంది. యుటిలిటీ సేవలను ఏకీకృతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వ్యవస్థాపకుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్‌ను ఏకీకృతం చేయడం కోసం విధివిధానాలు సిద్ధమయ్యాయి. భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేయడం, పెట్టుబడి విధానం, ప్రమోషన్ వంటివాటికి అవకాశం లభిస్తుంది.

8. రవాణాశాఖ

అన్ని రవాణా లైసెన్స్‌లకు సంబంధించిన సేవలు, అనుమతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి అన్ని ఫేస్‌లెస్ సర్వీస్‌లను చిప్తజీబిబంజూజూతో ఏకీకృతం చేసి సేవలను అందుబాటులోకి తెస్తారు. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మోడల్ లో ఏపిఎస్ ఆర్టీసితో మెటా టీమ్ కలిసి పనిచేస్తుంది. టిక్కెట్ బుకింగ్, పార్శిల్ బుకింగ్‌ల కోసం ఒఖూఖీఅ లో సేవలను ఏకీకృతం చేస్తారు.

9. పాఠశాల విద్య

తల్లిదండ్రులు, విద్యార్థులు, డిపార్ట్‌మెంట్ కార్యనిర్వాహకులకు ముఖ్యమైన సమాచారాన్ని పంపడం వంటిసేవలు వాట్సాప్‌తో అనుసంధానం చేయడం వల్ల సులభతరమవుతాయి. విద్యార్థుల హాజరు, పనితీరుకు సంబంధించి 7 మిలియన్ల మంది తల్లిదండ్రులతో కమ్యూనికేట్ చేయడానికి మొబైల్ నంబర్‌తో పాటు ఆధార్ ప్రామాణీకరణతో మెసేజింగ్ సిస్టమ్ అందుబాటులోకి వస్తుంది. పాఠ్యప్రణాళిక ఫలితాలను ట్రాక్ చేయడంతోపాటు మెటా బృందం డిజిటల్ నాగ్రిక్ వంటి అదనపు కోర్సులను కూడా అందుబాటులోకి తేవడానికి కృషిచేస్తుంది.

10. ఉన్నత విద్య

ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్లు మొదలైన వాటి కోసం హెచ్చరికలను షెడ్యూల్ చేయడం వంటి సమాచారం అప్ డేట్ గా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. స్టూడెంట్ - స్టాఫ్ సపోర్ట్ సర్వీసెస్, వర్చువల్ టీచింగ్ అసిస్టెన్స్, కమ్యూనికేషన్, ఇతర సాఫ్ట్ స్కిల్స్ మెరుగుపరచడానికి ఒటూ వంటివి అందుబాటులోకి వస్తాయి. విద్యా సేవలకు అంతరాయంలేని యాక్సెస్ కోసం ఒఖంంఖీ ఎఆని అనుసంధానిస్తారు. డ్రగ్, పొగాకు రహిత క్యాంపస్‌ల కోసం ప్రచారాలు, యూనివర్శిటీల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకునే సౌలభ్యం లభిస్తుంది.

11. నైపుణ్యాల అభివృద్ధి ఁ శిక్షణ

భారత ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పలురకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయి. స్కిల్ డెవలప్‌మెంట్ అవసరాలపై డేటాను సేకరించేందుకు స్కిల్ సెన్సస్ నిర్వహించడంలో మెటా సహకరిస్తుంది. మెటా బృందం వాయిస్/టెక్స్ట్ ద్వారా డైనమిక్ ప్రతిస్పందనల కోసం ంఎని ఏకీకృతం చేస్తుంది.

12. ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజి

ఆయా శాఖల్లో డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్‌లను నిర్ధారించడం కీలకం. చిప్తజీబిబంజూజూ అనేది అదనపు కమ్యూనికేషన్ ఛానెల్ మాత్రమే. మొత్తం డేటా ప్రభుత్వం వద్ద ఉన్నందున ఇంటిగ్రేషన్ కోసం వైట్‌లిస్ట్ చేయదగిన సమాచారాన్ని అందుబాటులోకి తెస్తారు. డిపార్ట్‌మెంటల్ సమాచారం ఇంటిగ్రేషన్ కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ప్రణాళికను తయారుచేసి నిర్ణీత కాలవ్యవధిలో ఏకీకృతంచేస్తారు.

13. గ్రామ సచివాలయాలు, వార్డుసచివాలయ విభాగం

గ్రామ, వార్డు సచివాలయ్యాల్లో సమర్థవంతమైన సర్వీస్ డెలివరీ కోసం 29 విభాగాల్లో 350+ సేవలు ఇప్పటికే ఏకీకృతం చేయబడ్డాయి. వివిధ విభాగాలకు అనుసంధానించడం ద్వారా ఇతర డైనమిక్ సేవలను సమాంతరంగా అందుబాటులోకి తెస్తారు.

వాట్సాప్ గంటకు 10 లక్షల అలర్ట్‌ల సామర్థ్యంతో రియల్ టైమ్ నోటిఫికేషన్‌లను సులభతరం చేస్తుంది. పర్యాటకరంగానికి సంబంధించి అవసరమైన అప్ డేట్లు, ప్రయాణ సమాచారం అందుబాటులోకి వస్తుంది. పౌరులు తమ సమస్యలను తెలియజేయడానికి క్రమబద్ధమైన వేదికగా ఉపకరిస్తుంది. రాష్ట్రంలో అమలవుతున్న(న్నా) ప్రాజెక్టులు, రహదారి పరిస్థితులు వంటివాటిపై రెగ్యులర్ అప్‌డేట్‌లు లభిస్తాయి.

వ్యవసాయ రంగానికి సంబంధించి మార్కెట్ ధరలు, వాతావరణం, ఉత్తమ యాజమాన్య నిర్వహణ పద్ధతులపై సమాచారం పొందవచ్చు. వివిధ పన్నులకు సంబంధించిన సమాచారం, గడువులు, విధానాలపై కమ్యూనికేషన్ సులభతరం అవుతుంది. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లో క్రమబద్ధీకరిస్తారు.

# జనసేనకు పెరిగిన గ్రాఫ్....



కాకినాడ, అక్టోబరు 25, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు రాజకీయంగా డిమాండ్ పెరుగుతుంది. వైసీపీ నుంచి నేతలు పెద్దయెత్తునచేరేందుకు సిద్ధమయ్యారు. జనసేన గేట్లు తెరిస్తే చాలు.. ఇక పోలోమంటూ దూసుకు రావడానికి లీడర్లు సిద్ధంగా ఉన్నారు. ఎవరు ముందు చేరాలన్న తపన వైసీపీ నేతల్లో కనిపిస్తుంది. అందుకే జనసేనకు డిమాండ్ పెరిగింది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆచితూచి చేరికల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నారు. చేరికల విషయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవడమే కాకుండా, నేతల ట్రాక్ రికార్డును కూడా తెప్పించుకుని లోతుగా పరిశీలించిన తర్వాతనే చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని తెలిసింది. చేరికల విషయంలో పవన్ కల్యాణ్ కొన్ని మార్గదర్శకాలను పాటిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఆ నేత ఏదైనా పెద్దపదవులు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఆ శాఖలో ఏదైనా అవినీతికి పాల్పడ్డారా? అందులో నిజానిజాలు ఎంత? అన్నది కూడా నివేదికలు తెప్పించుకున్నారట. అవినీతి మాత్రమే కాదు.. క్యాడర్ తో పాటు ప్రజల్లో బలంగా ఉన్న నేతలను మాత్రమే తీసుకోవాలన్నది పవన్ కల్యాణ? ఫైనల్ నిర్ణయంగా తెలుస్తుంది. ఆ నేత కారణంగా జిల్లా వ్యాప్తంగా పార్టీ బలపడుతుందన్న నమ్మకం ఉంటే వెంటనే ఓకే చెబుతున్నారని, లేకుంటే నియోజకవర్గానికే పరిమితమైన నేత అయితే మాత్రం కొంత వెయిట్ చేస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. మరోవైపు నేతలను చేర్చుకుంటే ఆ నియోజకవర్గంలో ఇతర పార్టీలకు అంటే మిత్రపక్షాలైన తెలుగుదేశం పార్టీ, బీజేపీ నేతలు ఇబ్బంది పడకుండా కూడా చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. ప్రధానంగా కూటమి పార్టీల మధ్య నేతల చేరికతో ఇబ్బందులు తలెత్తదని భావిస్తేనే ఆయన ఓకే చెబుతున్నారు. అది కూడా సరైన నేత అయితేనే కండువా కప్పేందుకు అంగీకరిస్తున్నారు. లేకుంటే తర్వాత చూద్దామని దాటవేస్తున్నారు. తోట త్రిమూర్తులు చేరికపై కూడా నిర్ణయం తీసుకోకపోవడానికి ఆయనపై ఉన్న కేసులతో పాటు, ఆయన పట్ల టీడీపీ నేతలు స్థానికంగా వ్యతిరేకం వ్యక్తం చేయడంతోనే ఆయన జనసేనలో చేరిక నిలిచిపోయిందని చెబుతున్నారు. భారీ ప్రాజెక్టు మంజూరు ఇక్కడి నుంచే చేరికలు... జనసేనలో చేరేందుకు వైసీపీ నుంచి ఎక్కువగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నేతలు ఆసక్తిక కనపరుస్తున్నారు. ఇటు రాయలసీమలోనూ కొందరు నేతలు పవన్ ఓకే అంటే రెడీ ఉన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారట. అక్కడ బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నుంచి డిమాండ్ అధికంగా ఉందంటున్నారు. అయితే కండువా కప్పుతున్న ఏ నేతకు కూడా పార్టీ టిక్కెట్ ఇస్తానని మాత్రం పవన్ కల్యాణ్ హామీ ఇవ్వడం లేదు. అదే సమయంలో పార్టీలో గుర్తింపు ఉంటుందని చెబుతున్నారు. అలాగే పార్టీ పరమైన పదవులు ఇచ్చేందుకు ఆయన సిద్ధపడుతున్నారు తప్పించి నియోజకవర్గంలో తలనొప్పులు తెచ్చే కార్యక్రమాలు చేపట్టవద్దని కూడా పవన్ ముందుగానే నేతలకు చెప్పి పార్టీలో చేర్చుకుంటున్నారట. మొత్తం మీద మరి కొద్ది రోజుల్లోనే సెకండ్ లిస్ట్ లో కొందరు వైసీపీ నేతలు జనసేనలో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

# పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు




గుంటూరు, అక్టోబరు 25,భక్తులకు ఆర్టీసీ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు వివరించారు.కార్తిక మాసం సందర్భంగా పుణ్య క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీపీటీవో వరప్రసాద్ వివరించారు. ఏలూరులో పుణ్య క్షేత్రాలకు సందర్శనకు ప్రత్యేక బస్సుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తిక మాసంలో పంచారామ క్షేత్రాలు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు ప్రతి ఆదివారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బస్సులు బయల్దేరుతాయని వివరించారు.

తిరిగి సోమవారం రాత్రి మళ్లీ ఆయా డిపోలకు చేరుకుంటాని వరప్రసాద్ చెప్పారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్టు వరప్రసాద్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని సూచించారు.పంచారామాలైన అమరావతి (అమరేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కొమర లింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలను దర్శించేవారి కోసం సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నారు. మూడు ఆర్టీసీ డిపోల నుంచి ప్రయాణ ఛార్జీలు ఒకే విధంగా ఉన్నాయి. ఒక్కొక్కరికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌కు రూ.900. సూపర్ లగ్జరీకి రూ.1,200, అల్ట్రా డీలక్స్ రూ.1,100 టికెట్ చార్జీగా నిర్ణయించారు. టికెట్లను ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో, లేదంటే డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చు. ప్రత్యేకంగా బస్సును బుక్ చేసుకునే భక్తుల కోసం.. వారు ప్రయాణించే చోటుకు బస్సు పంపుతామని అధికారులు వివరించారు.

శబరిమలకు కూడా..

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములు, భక్తుల కోసం కొత్త బస్స?లను ఏర్పాటు చేశామని వరప్రసాద్ వివరించారు. డిపో మేనేజర్లను సంప్రదించి శబరిమల స్పెషల్ బస్సులు బుక్ చేసుకోవచ్చని సూచించారు. యాత్రలకు స్పెషల్ ప్యాకేజీలు కల్పించామని చెప్పారు. రోజులను బట్టి ప్యాకేజీలు వర్తిస్తాయని తెలిపారు. వాటి వివరాలు స్థానిక బస్ డిపోల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

త్రిలింగ దర్శనం..

త్రిలింగ దర్శిని పేరుతో స్పెషల్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చామని వరప్రసాద్ వెల్లడించారు. త్రిలింగ దర్శినిలో శ్రీశైలం, మహానంది, యాగంటిలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ యాత్రలకు కూడా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. పూర్తి వివరాలు ఆర్టీసీ డిపోల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

# వడివడిగా భోగాపురం పనులు

## 50 వేల మంది వరకు ఉపాధి అవకాశం

విజయనగరం, అక్టోబరు 25,ఏపీ ప్రభుత్వం ప్రధాన నగరాల్లో మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. గత ప్రభుత్వం అమరావతిని పూర్తిగా పక్కన పెట్టి విశాఖపట్నానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, చంద్రబాబు సర్కారు వైజాగ్ తో పాటు అమరావతికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నది. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ లో భాగంగా భోగాపురం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2026లోగా అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణ పనులకు ప్రణాళికలు కొనసాగుతున్నాయి.ఏపీలో మహా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురంలో చేపడుతున్న అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు మరింత ఊపందుకున్నాయి. గత టీడీపీ హయాంలో మంజూరైన విమానాశ్రయానికి అప్పటి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు అనుమతులు మంజూరు చేశారు. అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. కొంతమేర నిర్మాణాలు చేపట్టింది. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడంతో ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రీసెంట్ గా ఎయిర్ పోర్టు పనులు పరిశీలించిన సీఎం చంద్రబాబు, 2026 వరకు రన్ వే మీదికి తొలి విమానం వచ్చేలా పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గడువుకు ముందే పూర్తయ్యేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు.ఓవైపు విమానాశ్రమం నిర్మాణం జరుగుతుంటే.. మరోవైపు ఎయిర్ పోర్టు చుట్టూ అధునాతన ప్రాజెక్టులు రాబోతున్నాయి. భీమిలి నుంచి భోగాపురం వరకు బీచ్ రోడ్డు వరకు సుమారు రూ. 1000 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. విమానాశ్రయం కోసం సేకరించిన భూమిలో ఇతర అవసరాల కోసం ఉంచిన 500 ఎకరాల్లో కోస్టల్ కారిడార్ డెవలప్ మెంట్ కోసం 88 ఇవ్వనున్నారు. ఇరువైపులా సైక్లింగ్ ట్రాక్‌లు, పార్కులు రానున్నాయి. ఆ తర్వాత పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర సంస్థలు వచ్చే అవకాశం ఉంది.రూ.4,700 కోట్లతో నిర్మాణం అవుతున్న భోగాపురం విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరగనుంది. అదే స్థాయిలో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రత్యక్షంగా 50,000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండగా పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి దొరికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2026 కల్లా భోగాపురం విమానాశ్రయం పూర్తి కావడం, మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణం జరిగితే, ఇన్నాళ్లూ హైదరాబాద్‌కు ఉపాధి అవకాశాల కోసం వలస వెళ్తున్నవారి సంఖ్య తగ్గుతుంది. ఐటీ కంపెనీలు కూడా తమ శాఖలను ఏర్పాటు చేయడం మొదలుపెడితే.. ఏపీ ప్రజలు మరే రాష్ట్రంపై ఆధారపడకుండా సొంత రాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలను పొందవచ్చు. మొత్తంగా విశాఖపట్నంతో పాటు అమరావతి హైదరాబాద్ కు ప్రత్యామ్నాయంగా మారనున్నాయి.

# సూపర్ పి ఆర్ పి తో మెరుగైన చికిత్సలు

## -ఇపియాన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుధీర్ ధార

హైదరాబాద్ వైద్య రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలతో రోగులకు మెరుగైన చికిత్సలు అందించగలుగుతున్నామని ఇపియాన్ ఆసుపత్రి వ్యవస్థాపకులు, డాక్టర్ సుధీర్ ధర అన్నారు. మోకాలు, ఇతర కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఎలాంటి శాస్త్ర చికిత్స లేకుండా పిఆర్పి విధానంతో చికిత్సలు అందిస్తున్న తమ ఆసుపత్రి సూపర్ పిఆర్పి విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కీళ్ల వ్యాధులతో బాధపడుతున్న రోగి రక్తాన్నే సేకరించి పి ఆర్ పి విధానంతో అందిస్తున్న చికిత్సలకు ఎంతో ఆదరణ ఉందని అన్నారు. కాగా స్టేజ్ 4 లో ఉన్న రోగులకు గతంలో చికిత్సలు అందించడం కష్టసాధ్యంగా ఉండేదని, సూపర్ పి.ఆర్.పి విధానంతో అలాంటి వారికి కూడా అద్భుతంగా చికిత్సలు అందించవచ్చునని అన్నారు. దేశ, విదేశాలలో తమ శాఖలను విస్తరించేందుకు ప్రత్యేక ప్రాణాలికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

# ఆదిలాబాద్ జిల్లాలో

## పెద్దపులి టెన్షన్

అదిలాబాద్, అక్టోబరు 25, ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి టెన్షన్ పెడుతోంది. బోథ్ మండలం వజ్జర్ అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులి స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. బుధవారం సాయంత్రం వేళల్లో బోథ్ మండలంలోని చింతగూడ, బాబేరతండా సమీపంలో పులి సంచరించింది.అయితే ఓ రైతు చూస్తుండగానే ఎద్దుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. స్థానిక రైతు సమాచారం మేరకు.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండంలోని బాబేరతండా గ్రామానికి చెందిన రైతు జాదవ్ దిలీప్ రేండ్లపండ్లి గ్రామంలో ఉన్న తన పొలంలో ఎడ్లను మేపుతున్నాడు. ఆయన చూస్తుండగానే ఒక్కసారిగా పెద్దపులి ఎద్దుపై దాడి చేసింది. దీంతో తీవ్ర భయాందోలనకు గుర్తైన రైతు హుటాహుటిన పరిగెత్తుకుంటూ గ్రామంలోకి వచ్చి అందరికీ విషయం చెప్పాడు.దీంతో గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆ ప్రాంతంలో అలజడి సృష్టించడంతో పులి వెనుదిరిగింది. పెద్దపులి వచ్చిందన్న సమాచారం తెలియడంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ పులి మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి భీంపూర్, తలమడుగు, బార్డర్ మీదుగా మహారాష్ట్రలోని కిన్వట్ వెనుకవైపు నుంచి బోథ్ మండలంలోని వజ్జర్ అటవీ ప్రాంతంలోకి సంచరించినట్లు చెబుతున్నారు.

# మొదటి వారంలో మెగాడీఎస్సీ నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 25,ఆంధ్రప్రదేశ్ మెగా డిఎస్సీ నోటిఫకేషన్ విడుదలలో స్వల్ప జాప్యం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే టెట్ పరీక్షలు పూర్తి కావడంతో తొలుత నవంబర్ రెండో తేదీలోగా టెట్ 2024 ఫలితాలను వెల్లడించనున్నారు. టెట్ ఫలితాలు వెలువడిన వెంటనే డిఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని విద్యాశాఖ వర్గాలు మొదట ప్రకటించాయి. తాజాగా ఈ తేదీల్లో మార్పు ఉండొచ్చని చెబుతున్నారు. సాంకేతిక కారణాలతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటన నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదలలో స్వల్ప మార్పులు ఉండొచ్చని చెబుతున్నారు.మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను నవంబరు మొదటి వారంలోనే విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. తొలుత 3వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వాలని భావించారు. ఆ రోజు ఆదివారం కావడంతో ముఖ్యమైన నాయకులు అందుబాటులో ఉంటారో లేదోననే సందేహంతో మరో తేదీలో నోటిఫికేషన్ విడుదల చేస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. 16,347 పోస్టులతో మెగా డిఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు.మరోవైపు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత న్యాయ వివాదాలు సృష్టించే అవకాశాలు ఉంటాయని భావించిన ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ వర్గాలను ఆదేశించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్‌లోగా నియామకాలను భర్తీ చేస్తామని ప్రకటించినా టెట్ నిర్వహణతో పరీక్షలు, నోటిఫికేషన్ ఆలస్యమైంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మెగా డిఎస్సీలో ఎలాంటి న్యాయవివాదాలకు తావివ్వకుండా చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారుల్ని ఇప్పటికే ఆదేశించారు.టెట్, మెగా డీఎస్సీ మధ్య ఎక్కువ సమయం ఉండాలని అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో అభ్యర్థులు, విద్యార్థి, యువజన సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఇప్పటికే ఆశావహులు కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉద్యోగాలు మానుకుని పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఉద్యోగ ప్రకటన చేసిన ఆర్నెల్లకు మించి ఆలస్యమైతే అభ్యర్థుగా భారమవుతుందని భావించారు. దీంతో నవంబర్‌లోనే డిఎస్సీ పరీక్షల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

సిలబస్‌లో మార్పు లేదు?

డిఎస్సీ 2024 సిలబస్ విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ప్రభుత్వం ఇప్పటికే తోసిపుచ్చింది. సిలబస్ వివరాలను ష్ట్రబిబిజూబ://జీజూబివబి.జీజూఇటబబ.తిని అందుబాటులో ఉంచామని స్పష్టత ఇచ్చారు.

పోస్టుల వివరాలు?

తాజాగా వచ్చే నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 6,371,స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)- 7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీలు)-1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీలు)-286, ప్రిన్సిపాళ్లు 52, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు)-132 ఉద్యోగాలు ఉన్నాయి.

స్కూల్ అసిస్టెంట్ - 7,725
ఎస్‌జీటీ - 6371
టీజీటీ - 1781
పీజీటీ - 286
పీఈటీ - 132
ప్రిన్సిపల్స్ - 52

టెట్ సెలక్షన్ లో తప్పులు

టెట్ స్కూల్ అసిస్టెంట్ (2ఏ) ఇంగ్లీష్ సబ్జెక్టులో తమకు అన్యాయం జరిగిందంటూ కొందరు అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. ఈ పేపర్ రెండో సెక్షన్‌లో మాతృ భాషగా తెలుగు సబ్జెక్టు రాయాల్సి ఉండగా, చాలామందికి ప్రశ్నాపత్రంలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ రావడం వివాదంగా మారింది. నిజానికి, ఇంగ్లీష్ సబ్జెక్ట్ ఎస్ఏ వారికి దరఖాస్తు సమయంలోనే మాతృభాషగా తెలుగు ఎంపిక చేసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది. ఎస్ఏ ఇంగ్లీష్ సబ్జెక్టుకు టెట్‌లో నాలుగు సెక్షన్లు ఉంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్ పెడగాజీ, మాతృభాష, జనరల్ ఆంగ్లం, సబ్జెక్టు కంటెంట్-మెథడాలజీ ఉంటాయి. రెండో సెక్షన్‌లో సాధారణంగా మాతృభాషగా తెలుగు సబ్జెక్టును ఎంపిక చేసుకోవాల్సి ఉంది. కానీ చాలా మంది మళ్లీ ఆ విభాగంలో తెలుగుకు బదులుగా మళ్లీ ఇంగ్లిష్‌నే ఎంపిక చేసుకున్నారు.ప్రభుత్వం ప్రకటించిన టెట్ ప్రకారం మాతృభాషను ఎంపిక చేసుకోవాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా కొందరు అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. కొందరు తెలుగు ఎంపిక చేసుకోవడం, మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఆంగ్లం ఎంపిక చేసుకోవడంతో మార్కుల్లో వ్యత్యాసం వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు. టెట్ రాసే వారిలో తమిళ్, కన్నడ, ఒడియావారు కూడా ఉన్నారు. దీంతో మాతృభాషగా అన్ని సబ్జెక్టులూ వచ్చేలా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్ష రాసే సమయంలో రెండో సెక్షన్ మాతృభాషకు సంబంధించి ఎవరికి వారు ఆయా భాషలను ఎంపిక చేసుకోవాలి. తెలుగు రాయాల్సిన వారు తెలుగుకు బదులు మళ్లీ ఆంగ్లాన్నే ఎంచుకోవడంతో సమస్య తలెత్తింది. నిజానికి, టెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో మాతృభాషగా తెలుగు ఎంపిక చేసుకుప్పటికీ ఆంగ్ల సబ్జెక్టే వచ్చింది. దీనిపై అప్పట్లో అభ్యర్థులు ఫిర్యాదు చేస్తే సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఇలా జరిగిందనీ, పరీక్ష సమయంలో మార్పు చేస్తామని పేర్కొన్నారు. కానీ, తాజాగా జరిగిన ఆన్‌లైన్ పరీక్షలో మాత్రం అభ్యర్థుల మాతృభాషగా తెలుగుకు బదులు ఇంగ్లిష్ ఓపెన్ అయ్యింది. దీంతో అభ్యర్థులు తెలుగు పరీక్ష రాయలేదు.టెట్ నిబంధనల ప్రకారం నాలుగు విభాగాలకు కలిపి మొత్తం 150 మార్కులు ఉంటాయి. సబ్జెక్టు కంటెంట్-పెడగాజీకి 90మార్కులు మిగతా మూడు సెక్షన్లకు 30 మార్కుల చొప్పున ఉంటాయి.

ఇప్పుడు మాతృభాష సబ్జెక్టు ఎంపికలో జరిగిన మార్పు కారణంగా 30 మార్కుల్లో తేడాలు వస్తే తమకు ర్యాంకులు మారిపోతాయని అభ్యర్థులు వాపోతున్నారు.

# పెంచి పోషించిన ఐసీస్ కాటు వేస్తే...

"ప్రపంచాన్ని వణికిస్తున్న సమస్య ఉగ్రవాదం. టెర్రరిజంపై రాజీలేని పోరాటం చేస్తున్నాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పని చేసే దేశాలకు సాయం చేస్తాం" నిత్యం అమెరికా చెప్పే కబుర్లు ఇవి. కానీ, అగ్రరాజ్యం పైకి చెప్పేది ఒకటి. లోపల చేసేది మరొకటి. చారిత్రక వాస్తవాలను పరిశీలిస్తే ఈ రోజు ప్రపంచం ఎదుర్కొంటున్న ఉగ్రకల్లోలానికి అసలు ముద్దాయి అమెరికా అని చెప్పక తప్పదు. ఉగ్రవాదానికి పెంచి పోషించేది ఆ దేశమే. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడేది ఆదేశమే. అమెరికా తన స్వార్థం కోసం ఆడిన వికృత క్రీడలో నుంచి పుట్టిన విష వృక్షమే ఐసిస్. ఇరాక్ లో 1999లో జమాత్ అల్ తాహిద్ వల్ జిహాద్ పేరుతో ఓ ఉగ్రసంస్థ పుట్టింది. ఆ సంస్థ అల్ ఖైదాతో దోస్తీ కట్టింది. 2003లో ఇరాక్ మీద మీద అమెరికా దాడులు చేస్తున్న నేపథ్యంలో ఈ సంస్థ ఎదురు దాడులకు దిగింది. 2006లో ఇతర సున్నీ తీవ్రవాద సంస్థలతో కలిసి ముజాహిదీన్ షురా కౌన్సిల్ గా రూపాంతరం చెందింది. కొద్దికాలం తర్వాత ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాన్ గా పేరు మార్చుకుంది. అబుబకర్ అల్ బాగ్దాదీ చీఫ్ గా వ్యవహరించారు. ఆయన నేతృత్వంలోని ఈ సంస్థ ఎన్నో కిరాతకాలకు పాల్పడింది. అదే సమయంలో సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యింది.ఈ సంస్థ అక్కడికి మకాం మార్చింది. సున్నీలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై పట్టు పెంచుకుంది. 2013 ఏప్రిల్ లో సిరియాలోని అల్ ఖైదా అనుబంధ సంస్థ జభాట్ అల్ సుస్రా ఫ్రంట్ ను తనలో కలుపుకుంది. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాగా మారింది. 2014లో అల్ ఖైదాకు దూరం అయ్యింది. ఆ తర్వాత రక్తపుటేరులు పారించింది. ప్రస్తుతం ఇరాక్ , సిరియాలోని ఆయిల్ బావులను తమ చేతుల్లో పెట్టుకుని రోజు రోజుకు తన పరిధిని పెంచుకుంటున్నది.2003లో అమెరికా ఇరాక్ మీద యుద్ధానికి దిగింది. ఆ దేశంలో అణు ఆయుధాలు ఉన్నాయనే కారణంతో వైమానిక దాడులకు పాల్పడి సద్దాం హుస్సేన్ పాలనను కూల్చివేసింది. ఆ తర్వాత ఇరాక్ లో అధికార శూన్యత ఏర్పడింది. యుద్ధం తర్వాత ఇరాక్ ను పునర్నిర్మించడంలో అమెరికా విఫలం అయ్యింది. ఆ సమయంలో ఉగ్రవాద గ్రూపులు పెరిగేందుకు మద్దతు ఇచ్చింది. అమెరికా షియా ఆధిపత్య ప్రభుత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నించింది. ఈ నిర్ణయం సున్నీల ఆగ్రహానికి కారణం అయ్యింది. అప్పుడే సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యింది.సిరియా అధినేత అసద్ వ్యతిరేక తిరుగుబాటుదారులకు అమెరికా మద్దతు ఇచ్చింది. ఆ సమయంలో ఐసీస్ అమెరికా మద్దతుతో అసద్ కు యాంటీగా పని చేసింది. సిరియాలో బలంగా విస్తరించింది. తాను మద్దతు ఇచ్చిన ఐసీస్ ఏకు మేకై కూర్చుంటుందని అమెరికా తెలిసేందుకు ఎంతో సమయం పట్టలేదు. కొద్ది నెలల్లోనే అదే ఉగ్రసంస్థ అమెరికాకు ఎదురు తిరిగింది. సిరియాలోని చమురు బావులను అమెరికా ఆధీనంలోకి తీసుకోకుండా ఐసీస్ తన కంట్రోల్ లోకి తీసుకుంది. అమెరికా ఐసీస్ మీద దాడులకు దిగింది. ఉగ్రసంస్థను ఎదుర్కొనేందుకు స్థానిక దళాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఆర్థికసాయం చేసింది. అయినప్పటికీ అమెరికా ఐసీస్ని కంట్రోల్ చేయలేకపోయింది.స్వప్రయోజనాల కోసం దేశాల అధినేతలే ఉగ్రవాదానికి కొమ్ము కాస్తే అది ఏనాటికైనా మానవజాతి మనుగడకే పెను సవాలుగా మారుతుందన్న విషయం ఐసీస్ తిరుగుబాటుతో రుజువైంది. పాముకు పాలు పోసి పెంచిందీ.. పడగ విప్పి బుసలు కొడుతున్న పాముపై పోరాడుతున్నది అమెరికానే. నెత్తుటి క్రీడ ఆడిన అల్ ఖైదా, ఐసీస్ మూలాలు పరిశీలిస్తే అవి తేలేది అమెరికాలోనే. లాడెన్ మృతితో అల్‌ఖైదా ఉగ్రవాదం మటుమాయమైందని ప్రపంచమంతా భావించింది. కానీ, అల్ బాగ్దాదీ నేతృత్వంలో ఐసీస్, అల్‌ఖైదా కన్నా తీవ్రంగా, అంతకు మించి క్రూరంగా విజృంభించింది.అల్ బాగ్దాదీని బలం పెరిగేలా చేసింది లాడెన్ అయినప్పటికీ, లాడెన్‌ను సృష్టించింది అమెరికానే. ఈ మొత్తం కల్లోలానికి అసలు కారణం అమెరికానే. ఎవడు తీసుకున్న గోతిలో వాడే పడతాడు. ఇది చరిత్ర చెప్పిన నిజం. అమెరికా విషయంలో రుజువైంది. స్వార్థం కోసం ఆడుతున్నవికృత క్రీడలోంచి పుట్టుకొచ్చిన మొక్కే విష వృక్షమై అగ్రరాజ్యాన్నే కబలించే ప్రయత్నం చేసింది. నిజానికి ఉగ్రవాదంపై పోరు విషయంలో అమెరికాను మించిన టెర్రరిస్టు ప్రపంచంలో మరెవరూ లేరు. ఎన్నో ప్రభుత్వాల్ని కూల్చింది. ఎంతోమంది నాయకుల్ని చంపింది. ఎన్నో కుట్రలు చేసింది. ఇప్పటికీ చేస్తూనే ఉంది.

# కోకాపేటలో విషాదం.



రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 25 అక్టోబరు 2024.ఆంధ్రప్రదేశ్ కు చెందిన నాగ ప్రభాకర్ గచ్చిబౌలి లోని ఓ కంపనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తూ, కోకాపేట్ లోని హాస్టల్ గదికి వచ్చి 7 అంతస్తుల భవనంపై నుండి కిందికి దూకి బలవన్మరణ ఆత్మహత్య గావించి నాడని సంఘటన స్థలానికి చేరుకున్న నార్సింగీ పోలీసులు వెల్లడించారు, తదనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలింప చేసికేసు నమోదు చేసి ఆత్మహత్య కు గల కారణాలలో పని ఒత్తిడి కారణమా అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రతన్ టాటా లాంటి వారు ఉండి దానం చేశారు.

# జానకిరామ్ లాంటి వారు తనకు ఉన్నదాంట్లో నుండి సేవా చేశారు.

## ఇద్దరి దృక్పథం ఒక్కటే సేవ చేయడం








తూప్రాన్, అక్టోబర్, 24. తూప్రాన్ ప్రెస్ క్లబ్ కు చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ జానకిరామ్ తనకు అన్నదాంట్లో నుండి సేవ చేసి నేడు డాక్టరేట్ పట్టా పొందడం అరుదైన గౌరవం లభించింది అని తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రా రెడ్డి అన్నారు. గురువారం ఉదయం సీనియర్ జర్నలిస్ట్ మన కర్తవ్యం ఎడిటర్ జానకిరామ్ గారికి గౌరవ డాక్టరేట్ పట్టా పొంది నేడు సన్మానం పొందడం సర్వ మత ప్రార్థనలతో ఆయనను బ్రాహ్మనోత్తములు, క్రైస్తవ మత ప్రార్థనలతో, ముస్లిం మౌలానా లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయ చంద్రా రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రతన్ టాటా లాంటి వారు తన సంపాదన నుండి పేదలకు దానం చేసి మహోన్నతులుగా ఎదిగారని గుర్తుచేశారు. తూప్రాన్ ముద్దు బిడ్డ సీనియర్ పాత్రికేయులు తన కున్న కొద్ది పాటి సంపాదన తో సమాజ సేవ చేసి అమెరికా కాలిఫోర్నియా బార్కెలి తియోలాజికల్ రిసెర్చ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రదీప్ ఫ్రెడీడ్ తో డాక్టరేట్ పట్టా పొందారు అని అన్నారు. ఈ డాక్టరేట్ అంటే సుధులు మందులు ఇచ్చే వారు కాదని సమాజం లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన దానికి గుర్తింపుగా అధికారికంగా అందించ బడిన పట్టా అని జానకిరామ్ ను కొనియాడారు. అనంతరం ఎస్ ఐ శివానందం మాట్లాడుతూ తన జీవితంలో ఇలాంటి గౌరవం పొందిన వారిని చూడలేదని ఇది అరుదైన మరువలేని గౌరవం అని జానకిరామ్ చేసిన సేవలకు మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ ఏ వెంకటస్వామి మాట్లాడుతూ డాక్టరేట్ అనేదు ప్రపంచస్థాయిలో మనం చేసిన సేవలకు గుర్తుగా చిరస్థాయిగా నిలిచిపోయే ఒక అపురూప ఘట్టం అని అన్నారు. ఇంత అరుదైన గౌరవ డాక్టరేట్ పట్టా పొంది నేడు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి తరించాలని తెలిపారు. అనంతరం సలాక రాజేశ్వర శర్మ మాట్లాడుతూ డాక్టరేట్ పట్టా పొందిన జానకిరామ్ సరస్వతి దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం మొజెస్ న్యూటన్ పిట్టా, రాజ్ కుమార్ ఫాస్టర్ లు బైబిల్ వాక్యం చదివి ఆశీర్వచన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్ద మౌల్వి అమెర్, షరీఫ్ లు ఖురాన్ చదివి దువా ఇస్తూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ప్రెస్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పాంజాల ఆంజనేయులు గౌడ్, అధ్యక్షులు కంఠాయపాలెం వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్ గౌడ్, లయన్ డాక్టర్ ప్రదీప్ సిహ్మా, లు మాట్లాడుతూ జానకిరామ్ చేసిన సేవలు కొనియాడారు. ముందుగా భారీ బాణసంచా పేల్చగా వికాస్ హైస్కూల్ విద్యార్థులు ఆర్డీవో జయ చంద్రా రెడ్డి, ఎస్ ఐ శివానందం తోపాటు ముఖ్య అతిథులకు భ్యాండ్ మేళతాళాలతో స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్ట్ కడిమె మోజేస్ అధ్యక్షత వహించారు. వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ నాయిని శ్రీధర్ గౌడ్ అన్ని తానై పర్యవేక్షించారు. లయన్స్ క్లబ్ నాయకులు పల్లెర్ల బాలేష గుప్త, బొడ్డు విజయ భాస్కర్, వంగ భాస్కర్ రెడ్డి, పుట్ట వెంకటేష్, చందాయిపేట సర్పంచ్ బుడ్డ భాగ్య రాజ్, డాక్టర్ అప్సర్ భాయ్,పి.మల్లేష్ గౌడ్, నాచారం రవి, ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, మరో ఎంపీటీసీ శంకర్ నాయక్, పుల రాం మోహన్, బల్ రాం రెడ్డి, కుమ్మరి రమేష్, ఫాస్టర్ లు రాజ్ కుమార్, తిమ్మతి, బెన్ని, ప్రెస్ క్లబ్ నాయకులు ఇందురి రవీందర్, శివ శంకర్ గౌడ్, పూర్ణరాజు గౌడ్, పెద్దిగారి నగేష్ గుప్త, టి.నాగరాజు, సి.హెచ్.రామస్వామి, సాత్కూరి సందీప్, సర్గల స్వామి, నవీన్, చందూ, గౌస్ భాయ్, షకీల్ భాయ్, భూషణం చారి, చిరంజీవి, మచ్చ యాదగిరి, బాల సాయి హారి ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, కోవూరి శ్రీనివాస్, వెంకటోల్ల శివకృష్ణ గౌడ్, జయ్ పాల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డంగా బుక్కైన అమోయ్...

హైదరాబాద్, అక్టోబరు 25,ఐఏఎస్ అమోయ్ కుమార్‌పై ఈడీ ఫుల్ ఫోకస్ పెట్టింది. రియల్ ఎస్టేట్ సంస్థల నుంచి కమిషన్లు తీసుకున్నారని 90కి పైగా ఫైళ్లలో మార్పులు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో కొన్ని కేసులను ఆధారంగా చేసుకుని ఆయన్ను విచారిస్తోంది ఈడీ. మొదటి రోజు 8 గంటలపాటు ప్రశ్నల వర్షం కురిపించిన అధికారులు రెండో రోజు కూడా 7 గంటలపాటు అనేక ప్రశ్నలు వేశారు. మూడోరోజు కూడా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. దీంతో ఇవాళ కూడా ఈడీ ముందుకు రానున్నారు అమోయ్. రెండు రోజులపాటు ఆయన నుంచి కీలక సమాచారాన్ని ఈడీ రాబట్టినట్టు తెలుస్తోంది.రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో భూకేటాయింపులకు సంబంధించి భారీగా వెనకేసుకున్నట్టు అనుమానాలున్నాయి. ముఖ్యంగా మహేశ్వరం మండలం నాగారం గ్రామ పరిధిలోని 42 ఎకరాల భూదాన్ భూమి రికార్డ్స్ తారుమారుకు సంబంధించి కేసులు నమోదు కాగా, ఈడీ ఎంటర్ అయింది. దీనికి సంబంధించే ఆయన్ను రెండు రోజులుగా ప్రశ్నిస్తోంది ఈడీ. అమోయ్‌తోపాటు భూదాన్ భూములపై ఆరా తీసేందుకు పలువురు రియల్టర్లను కూడా విచారణకు పిలిచింది ఈడీ. భూముల రికార్డ్స్‌తో ఈడీ ఎదుట హాజరైన రియల్టర్స్ కీలక సమాచారం అందించినట్టు సమాచారం. అమోయ్ కుమార్, రియల్టర్లను ఎదురెదురుగా కూర్చోబెట్టి ప్రశ్నలు వేసింది ఈడీ.

కోట్ల విలువైన 42 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా బదిలీ చేశారన్న దానిపై ఈడీ ప్రశ్నలు వర్షం కురిపించింది. తాను అంతా నిబంధనల ప్రకారమే చేశానంటూ ఆయన బదులిచ్చారు. ప్రభుత్వ భూమికి తప్పుడు రికార్డులు సృష్టించి పట్టాపాసు పుస్తకాలు జారీ చేయడం గురించి గుచ్చి గుచ్చి అడిగారు ఈడీ అధికారులు. విజిలెన్స్ విచారణ రిపోర్ట్ ముందు పెట్టి ప్రశ్నిచారు. అయితే, కొన్నింటికి సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. అబ్దుల్లాపూర్ మెట్‌లో సర్వేనెంబర్ 17లో 26 ఎకరాల సాగు భూమిని బలవంతంగా లాక్కున్నారని, కోట్లలో మీకు ముడుపులు అందాయని ఫిర్యాదులు వచ్చాయని ఈడీ తెలిపింది. అయితే, తాను ఎక్కడా నిబంధనలు అతిక్రమించలేదని అమోయ్ కుమార్ చెబుతూ వస్తున్నారు.అమోయ్ కుమార్ బినామీ వ్యవహారాలకు సంబంధించి పత్రికలలో అనేక కథనాలు ఇచ్చింది. అతని క్లాస్మెంట్‌కు చేరిన డబ్బుల వివరాలు వెల్లడించింది. ఎక్కడి నుంచి ఎక్కడికి డబ్బు వెళ్లింది, ఎలా వెళ్లిందో అన్ని వివరాలను ప్రచురించింది. ఈ దిశగా ఈడీ ముందుకు వెళ్తే అమోయ్ గుట్టంతా బయటపడే ఛాన్స్ ఉంటుంది. అన్నీ రూల్స్ ప్రకారమే చేశానని చెబుతున్న అమోయ్, విచారణలో తప్పించుకునే ధోరణలోనే సమాధానాలు చెప్తున్నారు. స్వేచ్ఛ కథనాల ఆధారంగా ఈడీ ముందుకు సాగితే కీలక విషయాలు తెలిసే ఛాన్స్ ఉంది.

# ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 2024- 25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, 12వ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షల తేదీలు విడుదలయ్యాయి. ఈ మేరకు సీబీఎస్సీ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు తరగతులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే ఏడాది) జనవరిలో ప్రారంభం కానున్నాయి. ఇక అబాఇ 10వ తరగతి, 12వ తరగతికి సంబంధించిన థియరీ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయి.పదో తరగతి, 11వ తరగతికి సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు 2025, జనవరి 1 నుంచి, థియరీ పరీక్షలు 2025, ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారిక ప్రకటనలో వెలువరించింది. ప్రాక్టికల్/ప్రాజెక్ట్/ఇంటర్నల్ అసెస్మెంట్‌కు సంబంధించి మార్కులను అప్‌లోడ్ చేసేటప్పుడు పాఠశాలలు కొన్నిసార్లు తప్పులు చేస్తున్నాయని, ఈ సారి ఈ విధమైన తప్పులు చోటు చేసుకోకుండా.. ఆయా పాఠశాలలకు ప్రాక్టికల్/ప్రాజెక్ట్/అంతర్గత మూల్యాంకనం, థియరీ పరీక్షలను సజావుగా నిర్వహించడంలో సహాయపడటానికి సబ్జెక్టుల జాబితా సమాచారం వివరాలను కూడా సర్క్యులర్‌కు జతచేసినట్లు బోర్డు వెల్లడించింది.

సీబీఎస్సీ బోర్డు పరీక్షల మార్కుల నమోదు జాబితా..

తరగతి

సబ్జెక్ట్ కోడ్

విషయం పేరు

థియరీ పరీక్షలో గరిష్ట మార్కులు

ప్రాక్టికల్ పరీక్షలో గరిష్ట మార్కులు

గరిష్ట మార్కుల ప్రాజెక్ట్ అంచనా

గరిష్ట మార్కుల అంతర్గత మూల్యాంకనం (ıo)

ప్రాక్టికల్/ప్రాజెక్ట్ అసెస్మెంట్ కోసం ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌ని నియమిస్తారా?

బోర్డు ద్వారా ఆచరణాత్మక సమాధానపుస్తకం అందించబడుతుందా

థియరీ పరీక్షలలో ఉపయోగించే జవాబు పుస్తకం రకం

ఈ జాబితాలో ఇచ్చిన వివరాల ప్రకారం థియరీ, ప్రాక్టికల్, ప్రాజెక్ట్, ఎం భాగాల మధ్య మార్కుల పంపిణీతో ప్రతి సబ్జెక్టుకు గరిష్టంగా 100 మార్కులు కేటాయిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. అబాఇ వింటర్-బౌండ్ పాఠశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలు నవంబర్ 5 నుంచి డిసెంబర్ 5 మధ్య జరుగుతాయి. ఈ పాఠశాలల్లో కూడా ప్రాక్టికల్ ఎగ్జామినేషన్, ప్రాజెక్ట్, ఇంటర్నల్ అసెస్మెంట్‌లను నిర్వహించడానికి బోర్డు రూఖలు, మార్గదర్శకాలను కూడా

# రెండు కూటములకు అగ్ని పరీక్షే...

ముంబై, అక్టోబరు 25, (న్యూస్ పల్స్)సీట్ల లెక్క తేలింది. ఆట మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల వేళ మహారాష్ట్ర రాజకీయం మరుగుతోంది. సీట్ల పంపకాలపై మహా వికాస్ అఘాడీ ఓ క్లారిటీకి రాగా, మహాయుతిలో దాదాపుగా ఒక సయోధ్య కుదిరింది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను కూడా ప్రకటించేశాయి.మహారాష్ట్ర ఎన్నికల కోసం దేశమంతా ఎదురుచూస్తోంది. ఎన్డీయే కూటమిని భారీగా దెబ్బతీసిన లోక్ సభ ఎన్నికల ఫలితాలు ఓవైపు.. హర్యానాలో బీజేపీ హ్యాట్రిక్ అధికారం మరోవైపు.. మరిప్పుడు మహారాష్ట్రలో ఏం జరగబోతోంది? ఎన్డీయే సర్కార్ సత్తా చాటుతుందా లేదా అనే అంచనాలు, ప్రశ్నలతో మహా రాజకీయం మహా సంగ్రామాన్ని తలపిస్తోంది. దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది.ఇక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఇండియా కూటమిలో సయోధ్య కుదిరింది. విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలోని ప్రధాన పార్టీలైన శివసేన యూబీటీ, కాంగ్రెస్, ఎన్సీపీ, ఎస్పీ చెరో 85 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 270 సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదిరింది. మిగతా 18 సీట్లను సమాజ్ వాదీ పార్టీ సహా మిగిలిన భాగస్వామ్య పక్షాలకు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నాయి. మహా వికాస్ అఘాడీ కూటమిలో ఎస్పీతో పాటు ఆప్, పీడబ్లుపీ, లెఫ్ట్ పార్టీలు ఉన్నాయి.వెంటాడుతున్న లోక్ సభ ఫలితాలు ఒకవైపు.. మరాఠాల్లో వ్యతిరేకత మరోవైపు.. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి కత్తి మీద సాము లాంటి పరిస్థితులు ఉన్నాయి. మరిప్పుడు కమలం పార్టీ ఎలాంటి స్ట్రాటజీలు సిద్ధం చేయబోతోంది? బీజేపీ ముందున్న ఆప్షన్స్ ఏంటి? హర్యానా స్ట్రాటజీని ఇక్కడ వర్కౌట్ చేద్దాం అనుకుంటున్న కమలం పెద్దల ఆలోచన కరెక్టేనా?మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మరాఠాలు ఎటువైపు ఉంటారు అనేది కీలకంగా మారింది. రాష్ట్రంలో 33 శాతంగా ఉన్న మరాఠా జనాభా మద్దతు మహాయుతి, మహా వికాస్ అఘాడీ కూటములకు కీలకంగా మారింది. 288 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగిన మహారాష్ట్రలో దాదాపు 160 నియోజకవర్గాల్లో మరాఠాలు గెలుపోటములను ప్రభావం చేసే స్థాయిలో ఉన్నారు. రిజర్వేషన్ల కోసం 6 సార్లు దీక్షలు చేసిన మరాఠాలకు మనోజ్ జరాంజే పాటిల్ సరికొత్త నాయకుడిగా ఎదిగారు. దీంతో జరాంజే మద్దతు కోసం అభ్యర్థులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

# ఢిల్లీలో డేంజర్ బెల్స్...

న్యూఢిల్లీ, అక్టోబరు 25, (న్యూస్ పల్స్‌ఢిల్లీలో కాలుష్య స్థాయి మరింత ప్రాణాంతకంగా మారింది. కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్య తీవ్రతతో కళ్ల మంటలు, గొంతు నొప్పి, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనంతో ఢిల్లీని కాలుష్యం కమ్మేస్తోంది.ఢిల్లీలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 2 ను అమలు చేస్తోంది అక్కడి ప్రభుత్వం. కాలుష్యాన్ని నియంత్రించడానికి గ్రీన్ వార్ రూమ్ ను ఏర్పాటు చేసిన ఢిల్లీ ప్రభుత్వం.. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ లైట్ ఆన్, వెహికల్ ఆఫ్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది.

కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరుతోంది. ఇందుకోసం వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించింది ప్రభుత్వం.ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పైన సగటున 349 పాయింట్లుగా కాలుష్యం తీవ్రత నమోదు కావడం జరిగింది. ఈ తరహా పరిస్థితులు మరికొద్ది రోజులు పాటు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనంతో అక్కడి నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళి కాలుష్యం అంతా ఢిల్లీని కమ్మేస్తోంది. ఢిల్లీలో విండ్ స్పీడ్ లేకపోవడం, పొగ మంచు కురుస్తుండటం, శీతాకాలం ప్రారంభం అవుతుండటంతో ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పొగ, దుమ్ము, ధూళి, కాలుష్యం అంతా కూడా గాలిలోనే నిలిచిపోయి కాలుష్యం తీవ్రత అనేది అధికంగా నమోదవుతున్న పరిస్థితి ఉంది.ప్రపంచంలోనే కాలుష్య ప్రభావిత నగరాల్లో ఢిల్లీ ముందు వరుసలో ఉన్న పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ ప్రజానికం తీవ్ర అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా కళ్ల మంటలు, దగ్గు, గొంతు నిప్పి, శ్వాస కోశ సంబంధ సమస్యలు.. కాలుష్య తీవ్రత అధికంగా ఉండటం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి.ఉదయం మార్నింగ్ వాక్స్ వెళ్లలేని పరిస్థితి. విజిబులిటీ గణనీయంగా పడిపోతున్న పరిస్థితి ఉంది.

దుమ్ము, ధూళి కణాలు గాలలోనే నిలిచి ఉండటంతో శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బందికర పరిస్థితులు ఢిల్లీలో నెలకొన్నాయి. కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో కాలుష్య తీవ్రత ప్రతీ ఏడాది శీతాకాలం సమయానికి ఢిల్లీ వాసులు కొంత ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

# డిసెంబర్ నాటికి హైడ్రోజన్ ట్రైన్స్

బెంగళూరు, అక్టోబరు 25 భారతలో రైల్వే వ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. అతిపెద్ద రైల్వే వ్యవస్థ శతాబ్దాల క్రితమే భారత్‌లో ఏర్పడింది. బ్రిటిష్ పాలనలోనే రైలు మార్గాల నిర్మాణం జరిగింది. విస్తరణ, ఆధునికీకరణతో కొత్త పుంతలు తొక్కుతోంది.మారుతున్న కాలానికి అనుగుణంగా భారత రైల్వే కూడా మార్పులు చేస్తోంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు రైళ్లను, ట్రాక్‌ను ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల సెమీ స్పీడ్ రైళ్లను ప్రారంభించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన వందే భారత్ రైళ్లను పట్టాలెక్కించింది. వీటితో దేశంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం బాగా తగ్గింది. తాజాగా మరో అద్భుతమైన ప్రాజెక్టుకు భారత రైల్వే సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది చివరి నాటికి తొలి హైడ్రోజన్ రైలును పట్టాలెక్కించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ రైలును హర్యానాలోని జింద్ నుంచి సోనిపట్ వరకు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేసింది. హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్ ప్రోగ్రాంలో భాగంగా దశల వారీగా 35 హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ క్రమంలో జర్మనీకి చెందిన టీయూవీ?ఎస్‌యూడీ సంస్థ రైతు భద్రతకు సంబంధించిన సేఫ్టీ ఆడిట్ నిర్వహించేందుకు సిద్ధమైంది.హైడ్రోజన్ రైలును పట్టాలు ఎక్కించేందుకు భారత రైల్వ భారీగా ఖర్చు చేస్తోంది. ఒక్కో యూనిట్‌కు రూ.10 కోట్లకుపైగా ఖర్చవుతుందని సమాచారం. ఒక్కో రైలుకు సుమారు రూ.80 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీని గ్రాండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేయడానికి రూ.70 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్ బ్యాటరీ, రెండు ఇంధన యూనిట్లను విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. మొదటి రైలు నమూనాను హరాయనాలోని 89 కిలోమీటర్ల జింద్?సోనిపట్ మార్గంలో పరీక్షిస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రల్ కోట్ ఫ్యాక్టరీలో ఇంటిగ్రేషన్ పనులు జరుగుతున్నాయి.ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నాలుగు దేశాల్లో హైడ్రోజన్ రైళ్లు నడుస్తున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనాలో హైడ్రోజన్ రైళ్లు ఉండగా, భారత్ ఈ జాబితాలో ఐదో దేశంగా చేరనుంది. ఫ్రెంచ్ కంపెనీ తొలిసారిగా హైడ్రోజన్ రైలును సిద్ధం చేసింది. 2018 నుంచి ఫ్రాన్స్‌లో ఈ హైడ్రోజన్ రైలు నడుస్తోంది. భారత్‌లో మాత్రం మొట్టమొదటి రైలు ఈ ఏడాది చివరకు పట్టాలెక్కనుంది. హర్యానాలో నడిచే ఈ రైళ్లకు జింద్‌లో ఉన్న 1 ఎండబ్ల్యూ పాలిమర్ ఎలక్ట్రోలైట్ మెమ్బ్రేన్ ఎలక్ట్రోలైజర్ నుంచి హైడ్రోజన్ అందిస్తారు. అక్కడ రోజుకు దాదాపు 430 కిలోల హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. 3 వేల కిలోల హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం కూడా ఉంది.

# కేటీఆర్ నోటీసులతో జవాబులు

హైదరాబాద్, అక్టోబరు 25, నేను ఎవరినైనా అనొచ్చు.. కానీ నన్నెవరూ అనొద్దు.. మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా ఇదేనా. అంటే ప్రత్యర్థుల నుంచి అవునన్న సమాధానమే వస్తోంది. ఎందుకంటే గతంలో కేటీఆర్ చాలా సార్లు నోరు జారారు. మొన్నటికి మొన్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు వేసుకోవాలన్నారు. మహిళా కమిషన్ ఆగ్రహానికి గురయ్యారు. విచారణకూ హాజరై వివరణ ఇచ్చుకున్నారు. అంతకు ముందు అసెంబ్లీ సమావేశాల్లో సీఎంను ఏకవచనంతోనూ పిలిచి ఆ తర్వాత మాటలు వెనక్కు తీసుకున్నారుకొత్తగా తనపై విమర్శలు చేసేవారిపై లీగల్ నోటీసులు సంధిస్తున్నారు. ప్రతి విమర్శలకు 'నోటి'ని కాకుండా నోటీసులనే నమ్ముకుంటున్నారు. అంతకు ముందు మంత్రి కొండా సురేఖ విషయంలోనూ అదే చేశారు. తాజాగా కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన కామెంట్లపైనా లీగల్ నోటీసులనే నమ్ముకున్నారు. వారంలో క్షమాపణ చెప్పకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవంటూ కౌంటర్ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు.రాజకీయం అన్నాక విమర్శలు ప్రతివిమర్శలు కామన్. అంత మాత్రాన లీగల్ నోటీసులతో నోరు మూయిస్తానంటే ఎవరైనా బెదురుతారా? అందుకే బండి సంజయ్ కూడా కౌంటర్ నోటీసులు ఇస్తానంటున్నారు. ఇంతకీ కేటీఆర్ లీగల్ నోటీసులతో రాజకీయ అపరిపక్వత బయటపెట్టుకుంటున్నారా? దీనిపై రాజకీయ విశ్లేషకులు ఏమంటున్నారో చూద్దాం.బండి సంజయ్ చదువుకున్నది లేదు. ఎప్పుడైనా పరీక్షలు రాశాడా? ఆయనకు తెలిసిందేమీ లేదు. చెప్పినా అర్థం కూడా కాదు. పేపర్ లీకులే ఆయనకు తెలుసు" గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన ఆందోళనకు కౌంటర్ ఇస్తూ కేటీఆర్ చేసిన కామెంట్లు ఇవి. సో మొదట వ్యక్తిగతంగా కామెంట్స్ చేసింది కేటీఆర్. ఆయన ఉన్నది ప్రతిపక్షంలో. అవతల ఉన్న నాయకుడు కేంద్రంలో అధికార పక్షంలో ఉన్నారు. పైగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి. ఊరుకుంటారా.. ఇష్యూ పర్సనల్ దాకా వెళ్లడంతో ఊగిపోయారు. అంతే పర్సనల్ గా కేటీఆర్ పై కామెంట్లు చేశారు. ఇంకా ఎక్కువ మాట్లాడితే చీకటి జీవితం బయటపెడుతానని ఘాటు వార్నింగ్ కూడా ఇచ్చారుసో పర్సనల్ అటాకింగ్స్ తో ఇద్దరి మధ్య రాజకీయం వేడెక్కింది. మాటకు మాట, సవాల్ కు ప్రతిసవాల్ జరిగిపోయాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి డైలాగ్ లు విసురుకోవడం, విమర్శలు చేసుకోవడం ఈ రోజుల్లో కామన్ అయ్యాయి. ఎలా చూసుకున్నా ఇష్యూ అక్కడికి ఆగిపోవాలి. కానీ అక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. సీన్ కట్ చేస్తే కేటీఆర్.. కేంద్రమంత్రి బండి సంజయ్ కు లీగల్ నోటీసులు పంపారు. తన పరువుకు భంగం కలిగించేలా బండి సంజయ్ మాట్లాడారని నోటీసుల్లో కేటీఆర్ పేర్కొన్నారు. డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, రేవంత్ తో కలిసిపోయానన్న వ్యాఖ్యలను నిరూపించాలన్నారు. వారం రోజుల్లోగా తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని.. లేదంటే న్యాయపరమైన చర్యలు తప్పవని బండి సంజయ్‌ను కేటీఆర్ హెచ్చరించారు.అంతకు ముందు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్ పై పరువు నష్టం దావా కూడా వేశారు కేటీఆర్. వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేశారు. తనను ఎవరైనా విమర్శస్తే ఇక ఊరుకునేది లేదని?, కోర్టుకు ఈడుస్తానని, చట్టం ముందు నిలబెడుతానంటూ వరుసగా లీగల్ నోటీసులు పంపే పని పెట్టుకున్నారు కేటీఆర్. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి లీగల్ నోటీసులు ఇస్తే ప్రతిగా మరిన్ని నోటీసులు ఇచ్చేందుకు ప్రత్యర్థులు రెడీగా ఉంటారు. ఎవరైనా బెదురుతారా? కామెంట్లు చేసేటప్పుడే ఇవన్నీ చూసుకోవాలని గుర్తు చేస్తున్నారు.ఇదంతా రాజకీయ అపరిపక్వతే అన్న పాయింట్ తెరపైకి వస్తోంది. పాలిటిక్స్ లోకి వచ్చి ఇన్నేళ్లయినా.. రాజకీయాలు వంటబట్టలేదా అన్న టాక్ నడుస్తోంది. పొలిటికల్ విమర్శలన్నిటికీ లీగల్ నోటీసులు ఇచ్చుకుంటూ వెళ్తే ఇక అదే పనిలో కేటీఆర్ ఉండాల్సిందే అన్న చర్చ కూడా నడుస్తోంది. ఎందుకంటే నువ్వొకటంటే.. నే రెండంటా అన్నట్లుంది ఇప్పటి రాజకీయం. పైగా రాజకీయాల్లో భాష కూడా రోజురోజుకూ దిగజారిపోతోంది. అన్ పార్లమెంటరీ పదాలు పెద్ద ఎత్తున వాడుతున్నారు. ఇలాంటి సమయంలో లీగల్ నోటీసులు పని చేస్తాయా.. అన్నది హాట్ డిబేట్ గా మారింది.లీగల్ నోటీసులతో నోరు మూయించే ప్రయత్నాలు చేస్తే ప్రత్యర్థులు సైలెంట్ గా ఉంటారని కేటీఆర్ ఆలోచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ ఈ కథ చాలా దూరం వెళ్తుంది. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలా లీగల్ నోటీసులు ఇస్తున్నారా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు కేంద్రమంత్రి బండి సంజయ్ కి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. నెక్ట్స్ ఏం జరుగుతుంది? సింపుల్ గా కౌంటర్ నోటీసులు పంపే అవకాశం ప్రత్యర్థి నేతకూ ఉంటుంది కదా. ఇప్పుడు బండి సంజయ్ కూడా చేస్తున్నది అదే. తనను మొదట వ్యక్తిగతంగా అంటేనే తాను పర్సనల్ కౌంటర్ ఇచ్చానని కేటీఆర్ కు గుర్తు చేస్తున్నారు. నోటీసులకు నోటీసులతోనే బదులిస్తానంటున్నారు. లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరంటున్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందన్నారు. కేటీఆర్ సుద్దపూస కాదని, ఆయన బాగోతం అంతా ప్రజలకు తెలుసన్నారు కేంద్రమంత్రి. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారం లో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో అందరికీ తెలుసు అని, ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చానని ఇక లీగల్ నోటీసులకు నోటీసులతోనే జవాబిస్తానని కాచుకోవాలంటూ సవాల్ చేశారు. ఈ లీగల్ నోటీస్ వార్ కాస్తా ఇప్పుడు మరో లెవెల్ కు వెళ్లింది.ఎవరి పరువుకు ఎలా భంగం కలిగింది.. ఏ ఆరోపణలు చేశారు.. వాటికి ఆధారాలు ఉన్నాయా.. ఇలాంటి వాటి చుట్టూ ఇప్పుడు రాజకీయం తిరగడం ఖాయమే. మ్యాటర్ కాస్తా లీగల్ గా మారడంతో ఒకరిపై మరొకరి విమర్శలను డీకోడ్ చేసే సీన్ వస్తుంది. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ లో లీగల్ నోటీసులు పంపడం ద్వారా మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయంగా ఎలాంటి వ్యూహంతో వెళుతున్నారన్నది హాట్ టాపిక్ గా మారుతోంది. జనరల్ గా చేసుకున్న విమర్శలకు నోటీసులు ఇవ్వడం అంటే రాజకీయ అపరిపక్వతేనా అన్న చర్చ కూడా జరుగుతోంది. నిజానికి ఇలాంటి నోటీసులు ఇస్తే.. ఎవరి లీగల్ పాయింట్లు వారికి ఉంటాయి. అవన్నీ బయటకు తీస్తారు. చట్టపరంగానే ఎవరి కౌంటర్ వారు ఇచ్చుకుంటారు. సో తెలంగాణలో ఎన్నికలకు ఇంకా చాలా టైం ఉంది. ఇలాగే లీగల్ నోటీసులు అంటే అప్పటిదాకా ఇంకెన్ని ఇవ్వాల్సి ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలపై కేటీఆర్ చేసిన కామెంట్స్ ఎవరూ మరిచిపోలేరు. దానిపై ఆయన స్పందిస్తూ.. యథాలాపంగా వచ్చినవి తప్ప కావాలని అనలేదు అని విమర్శలు వచ్చాక జవాబు ఇచ్చుకున్నారు. మహిళల గురించి ఇలా యథాలాపంగా బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు బస్సుల్లో చేసుకోండని ఎవరైనా అంటారా? కానీ కేటీఆర్ మాత్రం అన్నారు. నోరు జారితే వెనక్కు తీసుకోలేం. ఇది కావాలని అన్నారా.. లేదంటే అనుకోకుండా వచ్చిందా అన్నది వేరే విషయం. నిజానికి లోపల ఏముంటుందో అదే నోటి నుంచి బయటికొస్తుందంటారు. ఇప్పుడు కేటీఆర్ విషయంలోనూ అదే జరిగిందా అన్న చర్చ జరుగుతోంది.కేటీఆర్ కు ఇంట్లో నేర్పిన సంస్కారం ఇదేనా అని అప్పట్లో మంత్రులు విమర్శించారు. అటు కేటీఆర్ వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ అప్పట్లో సుమోటోగా తీసుకుంది. మహిళల పట్ల కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా.. కించపరిచేలా ఉన్నాయని కమిషన్ పేర్కొంది. విచారణకు హాజరుకావాలన్నది. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో కమిషన్ ముందు విచారణకు కూడా హాజరై వివరణ కూడా ఇచ్చుకున్నారు.గతంలో అసెంబ్లీలో ద్రవ్యవినిమియ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఏకవచనంతో మాట్లాడారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన మాటలను వెనక్కు తీసుకుంటున్నట్లు చెప్పారు. నోరు జారనేల తిరిగి వెనక్కు తీసుకోవడమేల అన్న పాయింట్లు అప్పుడూ వినిపించాయి. ఇప్పుడు కూడా బండి సంజయ్ పై కేటీఆర్ చేసిన కామెంట్లు చాలా దుమారంగా మారాయి. బండి పరీక్షలు రాయలేదని, చెప్పినా అర్థం కాదని, పేపర్ లీకులు చేయడం తెలుసు అని ఇలాంటివి పర్సనల్ గా వెళ్లాయి.నేతల నోటి దురుసుతోనే ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయం కేటీఆర్ కు తెలియంది కాదు. అయినా అదే వైఖరి కంటిన్యూ చేస్తున్నారన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతోంది. తాజాగా బండి వర్సెస్ కేటీఆర్ డైలాగ్ వార్ కాస్తా లీగల్ వార్ గా మారింది. కేటీఆర్ లీగల్ నోటీసులపై బండి నోటీసులతోనే వస్తా కాచుకో అని రియాక్ట్ అవగా? కేటీఆర్ మళ్లీ చిట్ చాట్ లో కామెంట్స్ చేశారు. తాను లీగల్ నోటీసుల విషయంలో మోడీని ఫాలో అవుతా అంటున్నారు.రాహుల్ గాంధీకి గతంలో ప్రధాని మోడీ లీగల్ నోటీసులు ఇవ్వలేదా అని గుర్తు చేస్తున్నారు. బండి సంజయ్ తనకు లీగల్ నోటీసులు ఇస్తే తాను మళ్లీ మళ్లీ అవే నోటీసులు పంపుతానంటున్నారు. పైగా ఉడుత ఊపులకు భయపడేది లేదన్న బండి సంజయ్ ఎందుకు భయపడుతున్నారని కూడా ప్రశ్నిస్తున్నారు. ఇంత చేసి కేటీఆర్.. నోటీసుల చుట్టూనే రాజకీయం తిప్పుతారా అన్న చర్చ జరుగుతోంది. ఇన్నేళ్ల రాజకీయ అనుభవంలో లీగల్ నోటీసులతో ప్రత్యర్థిని కట్టడి చేయొచ్చా చేయరాదా అన్నది క్లారిటీ లేకుండా పోయిందా అన్న ప్రశ్నలైతే వస్తున్నాయి. ప్రతి మాటకు లీగల్ నోటీసులంటే ఇక రాజకీయాల్లో వాద ప్రతివాదాలు ఉండవు. మాటలుండవ్, మాట్లాడుకోవడాల్లేవ్ అన్నట్లుగా సీన్ మారుతుంది.ఎందుకంటే రాజకీయాల్లో ఒకరిపై మరొకరు చేసుకునే ప్రతి మాట తూటానే. తాజా లీగల్ నోటీసులతో తనపై ఎవరూ గట్టిగా మాట్లాడకుండా ఉండాలని కేటీఆర్ అనుకుంటున్నారా అన్న టాక్ నడుస్తోంది. నోటీసులు ఇచ్చినంత మాత్రాన కేటీఆర్ ను ఎవరూ విమర్శించకుండా ఉంటారా అన్నది కూడా కీ పాయింటే. ఎందుకంటే పర్సనల్ గా అవతలి పార్టీ నాయకులపై విమర్శలు చేసినప్పుడు.. అలాంటి పర్సనల్ ఎటాకింగ్స్ కేటీఆర్ పై రావడం కూడా అంతే సహజం. ఇప్పుడు కేటీఆర్ వర్సెస్ బండి సంజయ్ ఎపిసోడ్ లో కూడా జరిగింది ఇదే. రాజకీయ విమర్శలపేరు చెప్పి, ఎలాంటి ఆధారాలు లేకుండా నీచమైన వ్యాఖ్యలు చేసే వారికి కొండా సురేఖపై వేసిన 100 కోట్ల రూపాయల పరువు నష్టం దావా ఒక గుణపాఠం కావాలంటున్నారు.మరి మనం అవతలి వారిపై చేసే కామెంట్లకు జవాబు ఏది అన్న ప్రశ్నలకు జవాబు ఉందా అన్న పాయింట్ చుట్టూ రాజకీయం తిరుగుతోంది. తనపై బీఆర్ఎస్ నుంచి ట్రోల్స్ చేయడంతో మంత్రి సురేఖ.. కేటీఆర్ పై ఇటీవలే తీవ్రస్థాయిలో కామెంట్స్ చేశారు. తనను ట్రోలింగ్ చేస్తే కనీసం స్పందించకపోవడంతో ఫైర్ అయ్యారు. తమపై సోషల్ మీడియాలో పిచ్చిరాతలు రాయిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. అయితే తన వ్యాఖ్యలపై ఎవరైనా నొచ్చుకుంటే క్షమాపణలు చెబుతున్నానని ఆ మరుసటి రోజు అన్నారు. సో ఫైనల్ గా వంద కోట్ల పరువు నష్టం మ్యాటర్ కోర్టుకు చేరింది. అక్కడ ఎవరి వెర్షన్ వారు వినిపించుకునే అవకాశం ఉంది. ఏం జరుగుతుందన్నది తర్వాతి విషయం. అయితే ప్రతి పొలిటికల్ మ్యాటర్, వాద ప్రతివాదాలను లీగల్ నోటీసుల చుట్టూ కోర్టుల చుట్టూ తిప్పాలనుకోవడమే ఇప్పుడు హాట్ డిబేట్.



## రేవంత్ మౌనానికి కారణం ఏమిటో...

హైదరాబాద్, అక్టోబరు 25, ధరలు పెంచింతే.. ఆదాయం వచ్చేది, ఖజానా నిండేది.. ఆరు గ్యారంటీలు అమలయ్యేది. ఇదీ సీఎం రేవంత్‌కు అధికారులు చేసిన ప్రతిపాదన. మద్యం ధరలు.. విద్యుత్, ఎల్ఆర్ఎస్ చార్జీలు పెంచేద్దామని సూచించగా.. రేవంత్ పెదవి విరిచినట్లు టాక్. ప్రస్తుతానికి ఇవన్నీ పక్కనపెట్టమని చెప్పారట. రేవంత్ నిర్ణయం వెనక కారణం ఏంటి.. అధికారుల ప్రతిపాదనలపై మౌనానికి కారణం ఏంటి.. సచివాలయవర్గాల్లో జరుగుతున్న చర్చ ఏంటి..తెలంగాణ సర్కార్.. ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల అమలుతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం నిధుల కొరత రేవంత్ సర్కార్‌ను తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికే రైతు రుణమాఫీ కోసం సుమారు 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన తెలంగాణ ప్రభుత్వం.. 2లక్షలపైన పంట రుణాలను మాఫీ చేసేందుకు కావాల్సిన 13వేల కోట్ల రూపాయల నిధుల కోసం వేట కొనసాగిస్తోంది.ఇక అటు గతేడాది డిసెంబర్‌లో అమలు చేయాల్సిన రైతుభరోసా.. ఇంతవరకు అమలు చేయలేదు. రైతుభరోసా కోసం కనీసం 20 వేల కోట్ల రూపాయలు కావాలని అంచనా. ఆరు గ్యారంటీల హామీల్లోని మహిళలకు నెలకు 25వందల రూపాయల పథకం అమలు చేయాల్సి ఉంది. దళితబంధు, మూసీప్రక్షాళనలాంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత ఉంది.ఓ వైపు హామీలు.. మరోవైపు అభివృద్ధి పథకాలు.. వీటన్నంటికి నిధుల కోసం.. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సీఎం రేవంత్, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రెండు నెలల పాటు కసరత్తు చేసి ఆదాయపెంపుపై.. ఆ అధికారులు ప్రభుత్వానికి సిఫారసులు చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని అందులో సూచించారని తెలుస్తోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచాలని కూడా చెప్పారట.ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుండగా.. మద్యం ధరలను పెంచితే? ఆదాయం పెరుగుతుందని ప్రపోజల్ పెట్టారని తెలుస్తోంది. అటు విద్యుత్ చార్జీలను కొంతమేర పెంచే అవకాశాన్ని పరిశీలించాలని రేవంత్ సర్కార్‌కు అధికారులు సూచించారని టాక్. గృహ వినియోగదారులకు 2వందల యూనిట్ల వరకు ఎలాగూ ఉచితంగా అందిస్తున్నాం కాబట్టి.. మిగతా సెక్టార్లతో పాటు.. కమర్షియల్ విద్యుత్ చార్జీలు కొంత పెంచితే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అధికారులు సూచించారట.ఇక హైదరాబాద్‌లో విలువైన భూములను అమ్మేద్దామనే మరో ప్రతిపాదనను కూడా తెలంగాణ ప్రభుత్వం ముందుపెట్టారట అధికారులు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ సర్కార్ హైదరాబాద్‌లో సుమారు 15వేల కోట్ల రూపాయల భూములను అమ్మేసిందని.. హైదరాబాద్, రంగారెడ్డిలో విలువైన ప్రభుత్వ భూములు ఇంకా ఉన్నాయని.. వాటిలో కొంతమేర అమ్మకాలు జరిపితే.. ఇప్పటికిప్పుడు సుమారు 10వేల కోట్ల రూపాయలను సమకూర్చుకోవచ్చని అధికారులు ప్రపోజల్స్ పెట్టారని తెలుస్తోంది.భూములను అమ్మకపోతే.. కనీసం ఆర్బీఐకి తాకట్టు పెట్టడం ద్వారా కూడా రుణం పొందవచ్చని ప్రతిపాదించారట. మరోవైపు ఎల్ఆర్ఎస్‌పై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టగా.. గతంలో నిర్ణయించిన చార్జీల కంటే.. కాస్త పెంచేద్దామని అధికారులు సూచించారని సమాచారం. ఇలా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు పలురకాల ప్రతిపాదనలు చేశారని సచివాలయ వర్గాల సమాచారం.ఐతే ఆదాయ పెంపుపై అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై.. సీఎం రేవంత్ పెదవి విరిచారని తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలుదీరి ఏడాది కాకముందే ఇలా హైదరాబాద్‌లో భూములు అమ్మేస్తే.. బీఆర్ఎస్ సర్కార్‌కు, తమకు తేడా ఏముంటుందని రేవంత్ భావిస్తున్నారట. భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎలాగూ పెంచుతున్నాం.. మళ్లీ ఎల్ఆర్ఎస్ చార్జీలను పెంచడం సరికాదని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారని అంటున్నారు. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ ద్వారా భారీగానే ఆదాయం వస్తుండగా.. మళ్లీ మద్యం ధరలను పెంచితే జనాల నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనన్న సందేహాన్ని కూడా వ్యక్తం చేశారట.విద్యుత్ చార్జీలను పెంచితే.. జనం నుంచి వ్యతిరేకత రావడంతో పాటు పారిశ్రామికవర్గాల నుంచి కూడా ఆందోళనలు వచ్చే ఛాన్స్ ఉందని భావిస్తున్నారట. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కాకముందే.. ఇలా ధరలు, చార్జీలు పెంచితే ప్రతిపక్షాలతో పాటు జనాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని.. ఆదాయ పెంపు ప్రతిపాదనలను కొన్నాళ్లపాటు పక్కనపెట్టాలని అధికారులకు రేవంత్ చెప్పారని సమాచారం. దీంతో ఆదాయం ఎలా పెంచాలో అర్థం కాక.. అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారట.

## ఆర్టీసీలో సగం అద్దె వాహనాలే..

అదిలాబాద్, అక్టోబరు 25, తెలంగాణ ఆర్టీసీ సిబ్బంది.. డొక్కు బస్సులతో ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు పాతవి కావడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో.. ఎక్కడపడితే అక్కడే ఆగిపోతున్నాయి. ఫలితంగా అటు ప్రయాణికులు, ఇటు సిబ్బంది తిప్పలు పడుతున్నారు. కొత్త బస్సులు సమకూర్చాలని కోరుతున్నారు.తెలంగాణలోని ఆర్టీసీ బస్సులు చాలావరకు పాతబడ్డాయి. వాటితోనే సంస్థ నెట్టుకొస్తుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. డొక్కు బస్సుల్లో ప్రయాణం ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. పాత బస్సులను నడపటం కష్టంగా ఉందని సిబ్బంది వాపోతున్నారు. పాత బస్సుల స్థానంలో కొత్తవి సమకూర్చాలని డిమాండ్ చేస్తున్నారు.ఉదాహరణకు.. ఆదిలాబాద్ రీజియన్‌లోని 6 డిపోలు ఉన్నాయి. మొత్తం 620 బస్సులున్నాయి. వాటిల్లో 311 అద్దె బస్సులే ఉన్నాయి. 309 బస్సులు ఆర్టీసీవి. ఆర్టీఏ నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లు దాటినా.. 13 లక్షల కిలోమీటర్ల వరకు తిరిగిన బస్సులను వినియోగించొద్దు. కానీ.. ఈ నిబంధనలు ఆర్టీసీలో అమలు కావటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

## ప్రక్షాళన పేరుతో విహారయాత్రలా....

హైదరాబాద్, అక్టోబరు 25,మూసీ ప్రక్షాళన? తెలంగాణ రాజకీయాల్లో రచ్చకు దారితీసిన అంశం. దీనిపై అపోజిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. అధికార పార్టీ లీడర్లు మాత్రం అదే మూసీ సుందరీకరణ కోసం అధ్యయనమంటూ విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఇది ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. అనుమానాలు.. అభ్యంతరాలపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం వదిలేసి.. పవర్లో ఉన్న పార్టీ లీడర్లు స్టడీ టూర్కు వెళ్లడం ఏంటంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.మూసీ ప్రక్షాళనకు నిర్ణయం తీసుకునే ముందే సీఎం రేవంత్ రెడ్డి సౌత్ కొరియా వెళ్లి..హన్ నదిని పరిశీలించి వచ్చారు. ఆ తర్వాతే..మూసీ ప్రక్షాళన కోసం చర్యలు చేపట్టారు. డీపీఆర్ కోసం ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. అంతలోపు మూసీ పరివాహక ప్రాంతంలో సర్వేలు, మార్కింగ్చేసే ప్రాసెస్ జరుగుతోంది. మూసీ పరివాహక ప్రాంతవాసుల్లో ఉంటున్న జనాలను ఒప్పించి మరో చోటకు తరలించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇలా ఓ వైపు అంతా పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతూ ఉంటే.. సడెన్ గా ఇప్పుడు మంత్రులు, వలస ఎమ్మెల్యేలు, కొందరు అధికారులు హన్ నదిపై అధ్యయనం కోసం దక్షిణ కొరియాకు వెళ్లడం ఎందుకనే చర్చ సాగుతోంది.స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి సియోల్ వెళ్లి, హాన్ నదిని చూసి, మూసీ ప్రక్షాళను ఏం చేయాలో డిసైడ్ అయ్యాక.. ఇప్పుడు మళ్లీ ఇద్దరు మంత్రులు, వలస ఎమ్మెల్యేలు వెళ్లి హాన్ నదిని చూసి మాత్రం చేసేదేముందన్న సందేహం కలుగుతోందట చాలా మందిలో. ఎందుకంటే మూసీ పునరుజ్జీవంపై సందేహాలు ఉన్నది ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు. అవసరమైతే బీఆర్ఎస్, బీజేపీ నేతలను సియోల్ తీసుకెళ్లి వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి.అంత ఈజీ కాదనుకుంటున్న మూసీ ప్రక్షాళను ఏవిధంగా సుసాధ్యం చేయాలనుకుంటున్నారో హాన్ నదిని ప్రత్యక్షంగా చూపించి అర్థమయ్యేలా చేయాలి. కానీ అది వదిలేసి అల్రెడీ సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి హాన్ నదిపై స్టడీ చేసి. పనులే మొదలుపెట్టాక.. ఇప్పుడు మంత్రులు, వలస ఎమ్మెల్యేలు వెళ్లి మాత్రం ఉపయోగం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఇందులో భాగంగా సియోల్ వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్యనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా చెప్పే అవకాశమూ లేకపోలేదనే చర్చ సాగుతోందిజ అయితే ప్రభుత్వం తీసుకెళ్తానంటే బీఆర్ఎస్, బీజేపీ నేతలు సియోల్కు వస్తారా అన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. వాళ్లు వస్తారో రారో.. సియోల్కు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లే ముందు ప్రతిపక్ష పార్టీల నేతలను ఆహ్వానించి ఉండాల్సిందన్న వాదన వినిపిస్తోంది. అయితే మంత్రులు, ఎమ్మెల్యేలు మూసీ ప్రాజెక్టు పేరుతో ఏదో విహార యాత్రకు వెళ్లినట్టు ఉంది తప్ప..వాళ్లు వెళ్ళి అక్కడ స్టడీ చేసేదేముందన్న గుసగుసలు సచివాలయవర్గాల్లో వినిపిస్తున్నాయి.

## పోలీస్ స్టేషన్ లో ప్లేయింగ్ జోన్

నిజామాబాద్, అక్టోబరు 25, కామారెడ్డి పోలీసులు.. ఇతర జిల్లాల అధికారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వినూత్న ఆలోచనలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. చిన్నారులను ప్రోత్సహించడమే కాకుండా.. ఏకంగా పోలీస్ స్టేషన్‌లో ప్లేయింగ్ జోన్ ఏర్పాటు చేశారు. ఠాణాను పచ్చదనంతో నింపేశారు.పోలీస్ స్టేషన్.. చాలా బిజీబిజీగా ఉంటుంది. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై పోతారు. కొందరు ఏడుస్తూ కనిపిస్తారు. మరికొందరు బాధతో కూర్చుంటారు. ఇంకొందరు భయంతో వణికిపోతారు. వీటికి కారణాలు ఏమైనా.. పోలీస్ స్టేషన్ అంటనే చిన్నారులు భయపడే పరిస్థితి ఉంటుంది. పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లాలంటే చిన్నారులు వణికిపోతారు. అలాంటి పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చారు కామారెడ్డి పోలీసులు.కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దారులు, కక్షిదారులతో వచ్చే వారి పిల్లలు సేదతీరేలా ఏర్పాట్లు చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్ నిర్మించారు. ఈ చిల్డ్రన్ ప్లేయింగ్ జోన్‌లో పచ్చదనంతో నిండిన ఉద్యానవనం.. పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చిన్నారులకు మానసిక ఉల్లాసాన్ని నింపుతున్నారు. పోలీస్ స్టేషన్ అంటే భయం లేకుండా వచ్చేలా చేస్తున్నారు.కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీఐ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గొల్లవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పోలీసులు అందంగా తీర్చిదిద్దారు. స్కూలు బిల్డింగ్‌కు రంగులు వేయించారు. విద్యార్థులు కూర్చోవడానికి కుర్చీలను అందించారు. పుస్తకాలను ఉచితంగా ఇచ్చారు. పాఠశాల ఆవరణమంతా జాతీయ నాయకులు, శాస్త్రవేత్తల సందేశాలు, సందేశాత్మక చిత్రాలు గీయించారు.'నేటి బాలలే రేపటి పౌరులు అని మన జాతీయ నాయకులు చెప్పారు. అందుకే పిల్లల మనసుకు నేరం మరకలు అంటొద్దని ప్రయత్నిస్తాను. చిన్నారుల పోలీస్ స్టేషన్‌లో ప్లేయింగ్ జోన్ ఏర్పాటు చేయించాం. సామాజిక బాధ్యతగా చిన్నారుల కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా. మా కుటుంబ సభ్యుల పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని.. గొల్లవాడ పాఠశాల బాగుకోసం కొంత ఖర్చు చేశాను' అని సీఐ చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు.కేవలం ఈ విషయాల్లోనే కాదు.. ఫిర్యాదులు స్వీకరించడం, దర్యాప్తు చేయడంలోనూ కామారెడ్డి పోలీసులు ఆదర్శంగా నిలుస్తున్నారు. కేసులు, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఆపద అంటే ఆలోచించకుండా దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపడుతూ.. ఇతర ఠాణాల పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారు.

# సినిమా





## కంగువ.. అద్భుతమైన సినిమా



హీరో సూర్యహీరో సూర్య నటిస్తున్న భారీ చిత్రం 'కంగువ'. ఈ చిత్రాన్ని పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను హ్యూజ్ బడ్జెట్‌తో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు శివ మాట్లాడుతూ, 'వెయ్యేళ్ల కిందట ఆదిమానవుల టైమ్ నుంచి ఐదు తెగల మధ్య జరిగే పోరాటాన్ని నేపథ్యంగా ఎంచుకుని స్క్రిప్ట్ తయారు చేశాం. ట్రైలర్ చూసినప్పుడు ఎలాంటి గొప్ప ఫీలింగ్ కలిగిందో థియేటర్‌లోనూ అలాంటి అనుభూతికి లోనవుతారు' అని తెలిపారు. 'అభిమానులు నాపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతగా వారికి గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే 'కంగువ' లాంటి గొప్ప సినిమా చేశాను. ఇది ఇప్పటివరకు స్క్రీన్ మీద మీరు చూడని ఒక అరుదైన అద్భుతమైన సినిమా. దర్శకుడు శివ వల్లే ఇది సాధ్యమైంది. ఇలాంటి సినిమాలు చేసేందుకు దర్శకుడు రాజమౌళి స్ఫూర్తినిచ్చారు' అని హీరో సూర్య అన్నారు.

## మీడియా ముందుకు రానున్న జానీ?



తెలుగు, తమిళ భాషల్లో పెద్ద పెద్ద స్టార్ల సినిమాలకు కొరియోగ్రఫీ చేయడమే కాక.. 'తిరు' సినిమాకు గాను నేషనల్ అవార్డు కూడా గెలుచుకుని కొన్ని నెలల ముందు కెరీర్ పీక్స్‌ను అందుకున్నాడు డ్యాన్స్ మాస్టర్ జానీ.మరోవైపు ఆయన ప్రచారం చేసిన జనసేన పార్టీ కూడా ఏపీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడంతో తన సంతోషానికి అవధుల్లేకపోయాయి. ఇలా అన్నీ కలిసి వస్తున్న సమయంలో ఆయన మాజీ అసిస్టెంట్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు, పెట్టిన కేసుతో జానీ జీవితం తల్లకిందులైపోయింది.జానీ బాగా అన్ పాపులర్ కావడమే కాదు.. అరెస్టయి జైలుకు వెళ్లాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో జానీకి వెంటనే బెయిల్ కూడా లభించలేదు. జాతీయ అవార్డు అందుకోవడం కోసం మధ్యంతర బెయిల్ పొందితే.. ఆ అవార్డునే క్యాన్సిల్ చేశారు. మళ్లీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. ఐతే ఎట్టకేలకు జానీ విజ్ఞప్తిని కోర్టు మన్నించింది. షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. దీంతో జానీ మద్దతుదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఒకసారి బెయిల్ వచ్చిందంటే ఇక ఈ కేసులో పోరాటం తేలికవుతుందని జానీ భావిస్తున్నాడు. కాగా ఈ కేసులో చిక్కుకున్నాక జానీ ఒక్కసారి కూడా మీడియాతో మాట్లాడింది లేదు.తనపై ఆరోపణలు రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తర్వాత అరెస్టయి జైలుకు వెళ్లాడు. దీంతో తన వెర్షన్ ఏంటన్నదే మీడియాకు తెలియలేదు. పోలీసుల విచారణలో తాను తప్పు చేసినట్లు జానీ అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. అదెంత వరకు నిజమో తెలియదు.

## దేవి డబుల్ బొనాంజా



ఇప్పుడున్న ట్రెండ్ లో ఒక సంగీత దర్శకుడి ప్యాన్ ఇండియా మూవీ మూడు నెలలకు ఒకటి విడుదల కావడమే గగనమైపోయింది. అలాంటిది కేవలం ఇరవై రోజుల వ్యవధిలో రెండు అతి పెద్ద క్రేజీ సినిమాలు రిలీజంటే ఎవరికైనా అది ప్రత్యేకంగా నిలిచిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్ ఆ ఘనతను అందుకోబోతున్నాడు. నవంబర్ 14 రాబోతున్న కంగువకి ఏకంగా కోలీవుడ్ బాహుబలి రేంజ్ లో అంచనాలు పెట్టుకున్న సంగతి తెలిసిందే. సూర్యతో పాటు టీమ్ మొత్తం చూపిస్తున్న కాన్ఫిడెన్స్ పక్కనపెడితే ఆరవ డిస్ట్రిబ్యూటర్లు ఎప్పుడూ చూడని అతి పెద్ద నెంబర్లు నమోదు కావడం ఖాయమని అంటున్నారు. తమిళంలో ఇప్పటిదాకా బోలెడు ఆల్బమ్స్ కంపోజ్ చేసిన దేవిశ్రీ ప్రసాద్ కు అవన్నీ ఒక ఎత్తు అయితే కంగువ మాత్రం ఇంకోవైపు నిలుస్తుంది. ఇది కనక బ్లాక్ బస్టర్ హిట్ అయితే తన పేరు మరోసారి జాతీయ స్థాయిలో మారుమ్రోగిపోతుంది.అనిరుధ్ రవిచందర్ రాజ్యమేలుతున్న గడ్డ మీద ముద్ర వేయడానికి దేవికి ఇంతకన్నా ఛాన్స్ దొరకదు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో నమ్మకం నిలబెట్టుకుంటే చాలు. ఇక డిసెంబర్ 5 పుష్ప 2 ది రూల్ దిగేస్తాడు. వెయ్యి కోట్లకు పైగా టోటల్ బిజినెస్ తో ఇప్పటికే అల్లు అర్జున్ రేపుతున్న ప్రకంపనలు ఇండియా వైడ్ హాట్ టాపిక్ గా మారాయి. కంగువ, పుష్ప 2 రెండు కనక విజయవంతమైతే దేవి బ్యాక్ టు ట్రాక్ అని గర్వంగా చెప్పుకోవచ్చు. తమన్ హవాలో కొంచెం వెనుకబడినట్టు అనిపించినా తనదైన రోజు చెలరేగిపోయే ఈ మిస్టర్ బ్యాచిలర్ కు వచ్చే ఏడాది ఎలాగూ ఉస్తాద్ భగత్ సింగ్ లాంటి పెద్ద సినిమాలు చేతిలో ఉన్నాయి.

## డిసెంబర్ 5 పుష్పరాజ్ ఆగమనం



ఊహించినట్టే పుష్ప 2 ది రూల్ విడుదల తేదీ ముందు ప్రకటించిన దానికన్నా ఒక రోజు ముందుకు జరిగి డిసెంబర్ 5 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టనుంది.ఈ వార్త రెండు వారాల క్రితమే మా సైట్ ఎక్స్ క్లూజివ్ గా అందించిన సంగతి తెలిసిందే. ఇవాళ దాన్నే హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్ ద్వారా కొత్త పోస్టర్ తో పాటు అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. చేతిలో సిగార్ పైప్ తో సైడ్ లుక్ తో అల్లు అర్జున్ ఇచ్చిన స్టిల్ ఫ్యాన్స్ కి మాంచి కిక్ ఇచ్చేలా ఉంది. దేశవ్యాప్తంగా పుష్ప 2ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్న పంపిణీదారులతో కలిసి ఈ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయడం విశేషం. రిలీజ్ డేట్ విషయంలో డిసెంబర్ 5ని ఫిక్స్ చేయడం ద్వారా మైత్రి మూవీ మేకర్స్ వేసిన ఎత్తుగడ ఓపెనింగ్స్ పరంగా అద్భుత ఫలితాన్ని ఇవ్వడం ఖాయం. గురువారం రిలీజులు పాజిటివ్ టాక్ వచ్చిన ప్యాన్ ఇండియా మూవీస్ కి ఎంత పెద్దగా ఉపయోగపడుతుందో సరిపోదా శనివారం, దేవర లాంటివి నిరూపించిన నేపథ్యంలో పుష్ప 2 వాటిని మించిన ప్రయోజనం అందుకోవడం ఖాయం. బాలీవుడ్ నుంచి ఆరో తేదీ విక్కీ కౌశల్ చావా ఉన్న నేపథ్యంలో బన్నీ ఒక రోజు ముందే బరిలో దిగడం ద్వారా టాక్ నుంచి వచ్చే పూర్తి ప్రయోజనం అందుకునే అవకాశం ఉంటుంది.

## సంక్రాంతి సస్పెన్స్ సులభంగా తేలదు



2025 సంక్రాంతికి ఏ సినిమాలు పక్కాగా వస్తాయనే విషయంలో ఇప్పటికీ క్లారిటీ లేక బయ్యర్లు, సినీ ప్రియులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. 'గేమ్ ఛేంజర్' జనవరి 10 పక్కాగా రిలీజవుతుంది.అందులో ఎలాంటి అనుమానం లేదు. 'బాలయ్య 109' ఓ రెండు రోజుల తర్వాత జనవరి 12 లాక్ చేసుకునే ఛాన్స్ ఉంది. నిర్మాత నాగవంశీ చూచాయగా ఈ విషయాన్నే చెబుతున్నారు. ఈ రెండు తప్ప ఎవరూ నొక్కి వక్కాణించి తమదీ వస్తుందని చెప్పడం లేదు. గేమ్ నిర్మిస్తున్న దిల్ రాజు నిర్మాణంలోనే రూపొందుతున్న 'వెంకటేష్ %-% అనిల్ రావిపూడి' చిత్రం బరిలో తప్పుకుందనే ప్రచారం ప్రస్తుతానికి గాసిప్పే. నిజంగా రేస్ నుంచి బయటికి వెళ్లిందా లేదానేది ఇప్పట్లో చెప్పరు. సందీప్ కిషన్ 'మజాకా'ను పండగ బరి కోసమే రెడీ చేస్తున్నారు. ఎంత పోటీ ఉన్నా సరే ఫుల్ ఎంటర్ టైన్మెంట్ ఉన్న తమ మూవీ మాస్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుందనే నమ్మకం దర్శకుడు త్రినాథరావు నక్కినలో కనిపిస్తోంది. అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చేది లేనిది హీరో మరో సినిమా విదాముయార్చి మీద ఆధారపడి ఉండటంతో మైత్రి డేట్ ని ఖరారు చేసుకోలేదు. తాజాగా 'శర్వానంద్ %-% రామ్ అబ్బరాజు' కాంబోలో తెరకెక్కుతున్న ఎంటర్ టైనర్ సైతం జనవరినే టార్గెట్ చేసుకుందనే వార్త ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. కథ ఇక్కడితో అయిపోలేదు. తమిళ హిట్ గరుడన్ రీమేక్ 'వామన'ను సైలెంట్ గా షూటింగ్ కానిస్తూ వీలైతే సంక్రాంతి కోసమే అనేలా వేగవంతం చేస్తున్నారు. ఇందులో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

## బన్నీకి రాజకీయం ఆపాదించొద్దు

జరిగిపోయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎన్నికల ప్రచార సమయంలో అల్లు అర్జున్ తన స్నేహితుడైన వైసిపి అభ్యర్థి కోసం నంద్యాల వెళ్లి రావడం గురించి ఏదో ఒక రూపంలో, ఎక్కడో ఒక చోట చర్చ జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో దీని డిస్కషన్ కు అంతూపొంతూ ఉండదు. ఇవాళ జరిగిన పుష్ప 2 రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ లోనూ ఈ ప్రస్తావన వచ్చింది. ఆన్ లైన్ మెగా ఫ్యాన్స్ వర్సెస్ బన్నీ అభిమానులు రెండుగా విడిపోయిన నేపథ్యంలో దాని ప్రభావం ఓపెనింగ్స్ మీద ఏమైనా ఉంటుందా అని ఎదురైన ప్రశ్నకు మైత్రి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ స్పష్టత ఇచ్చారు. అల్లు అర్జున్ రాజకీయంగా ఎలాంటి స్టాండ్ తీసుకోలేదని, వ్యక్తిగత మద్దతుని పరిగణనలోకి తీసుకుని అదేదో పొలిటికల్ పార్టీకి ఆపాదించవద్దని చెబుతూ వీలైనంత క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. రెండు కుటుంబాల మధ్య చిన్న చిన్న ఇన్సి డెంట్స్ ఏవైనా ఉన్నా అవి కేవలం పరిమిత కాలానికి మాత్రమేనని, వాళ్లంతా ఒకటేనని నవీన్ సైతం దీని గురించి మాట్లాడ్డం విశేషం. పుష్ప 2 రిలీజ్ టైంలో ఉద్దేశపూర్వకంగా ట్రోలింగ్ జరగొచ్చనే ఊహాగానాల ప్రచారంలో ఉన్న టైంలో ఇలాంటి టాపిక్ రావడం సహజమే. అయితే సమావేశంలో ప్రత్యక్షంగా అల్లు అర్జున్ లేడు కాబట్టి ఇంతకన్నా సమాధానం ఆశించలేం. ప్రమోషన్లు త్వరలో మొదలుకాబోతున్నాయి కనక బన్నీ ప్రత్యేకంగా వాటిలో పాల్గొన్నప్పుడు ఏదో ఒక రూపంలో దీనికి సంబంధించిన ప్రశ్న ఖచ్చితంగా ఎదురవుతుంది. నిజానికి ఇరు వైపులా ఫ్యాన్స్ దాని కోసం ఎదురు చూస్తున్న మాట వాస్తవం.





# క్రీడలు



## టి20 వరల్డ్ కప్ ఛాంపియన్‌ను నేలకు దించారు..



మూడు వన్డేల సిరీస్ లో న్యూజిలాండ్ జట్టు భారత్ లో పర్యటిస్తోంది. వచ్చే ఏ డాది వన్డే వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో ఈ టోర్నీని భారత జట్టు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పైగా టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కు ఈ సిరీస్ అత్యంత ముఖ్యం కావడంతో.. టీమిండియా మేనేజ్మెంట్ పకడ్బందీగా వ్యవహరించింది. జట్టు కూర్పును కూడా సమర్థవంతంగా రూపొందించింది. కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చినప్పటికీ%ొ% యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. దీంతో పాత కొత్త కలయికతో టీమిండియా అరారింది. టీమిండియా ప్లేయర్లు కసి కొద్ది ఆడటంతో టి20 వరల్డ్ కప్ సాధించిన న్యూజిలాండ్ జట్టు ఒక్కసారిగా తలవంచింది.. అహ్మదాబాద్ వేదికగా జరిగిన తొలి వన్డేలో భారత్ ఏకంగా 59 రన్ తేడాతో విజయం సాధించింది. దీప్తి శర్మ 41 రన్స్, 1/35 ఆల్ రౌండర్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. భారత జట్టు సాధించిన గెలుపులో ముఖ్యపాత్ర పోషించింది.. కెప్టెన్ హర్మన్ ఫిట్ నెస్ సరిగా లేకపోవడంతో ఈ మ్యాచ్ కు దూరమైంది. దీంతో వైస్ కెప్టెన్ స్మృతి మందాన జట్టుకు నాయకత్వం వహించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 44.3 ఓవర్లలో టు 27 రన్స్ చేసింది.. హస బీన్స్ 42, దీప్తి శర్మ 41, జెమిమా 35, యాస్తిక భాటియా 37, షఫాలి వర్మ 33 పరుగులు చేసి టాప్ స్కోరర్లుగా గెలిచారు. స్మృతి మందాన ఐదు పరుగులకే వెనుదిరగడం టీమిండియా అభిమానులను నిర్వేదంలో ముంచింది. ఇక న్యూజిలాండ్ బౌలర్లలో అమేలీయ నాలుగు వికెట్లను పడగొట్టింది. జెస్ కేర్ మూడు వికెట్లను సొంతం చేసుకుంది. కార్సన్ రెండు వికెట్లను పడగొట్టింది. టి20 వరల్డ్ కప్ లో ఓడించిందనే కసితో టీమ్ ఇండియా బౌలర్లు రెచ్చిపోయి బౌలింగ్ చేశారు. ఫలితంగా న్యూజిలాండ్ బ్యాటర్లు వణికి పోయారు. 40.4 ఓవర్లలో 168 పరుగులకే చాప చుట్టేశారు. బ్రూక్ 39, గ్రీన్ 31 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. రాధా యాదవ్ 3 వికెట్లు సొంతం చేసుకుంది. సజ్నా రెండు వికెట్లు దక్కించుకుంది. దీప్తి, అరుంధతి చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్ లో దీప్తి శర్మ అద్భుతమైన ప్రతిభ చూపించింది. ముఖ్యంగా న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ (2) బద్ధకంతో రనౌట్ అయింది.. టి20 వరల్డ్ కప్ సాధించామని గర్వమో లేక రనౌట్ చేయలేరనే అతి విశ్వాసము తెలియదు గాని.. చిత్రమైన తీరుగా ఆమె అవుట్ అయింది. దీప్తి శర్మ అత్యంత చాకచక్యంగా సోఫీ డివైన్ ను పెవిలియన్ పంపించింది. దీప్తివేసిన 12 ఓవర్లో ఈ సంఘటన జరిగింది. దీప్తి 12వ ఓవర్ చివరి బంతిని ఆఫ్ స్టంప్ లైన్ లో వేసింది. దానిని భారీ షాట్ ఆడటానికి సోఫీ ప్రయత్నించింది. అయితే బంతి పడిన గమనాన్ని అంచనా వేసి డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించింది. బంతి ఒక్కసారిగా దీప్తి శర్మ చేతుల్లోకి వెళ్ళింది. అయితే ఆమె బంతిని చేతిలో పట్టుకొని రనౌట్ చేస్తానన్నట్టుగా బెదిరించింది. అయినప్పటికీ సోఫీ అక్కడే నిలబడి ఉంది. వెంటనే దీప్తి శర్మ బంతిని వికెట్ కీపర్ కు అందించింది. ఆమె అంతే వేగంతో వికెట్లను పడగొట్టింది.

## బెంబేలెత్తిస్తున్న సాంట్నర్..



తొలి రోజు న్యూజిలాండ్ జట్టును 259 పరుగులకు కట్టడి చేసిన టీమిండియా.. బ్యాటింగ్ ప్రారంభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ పరుగులేమీ చేయకుండానే సౌతి బౌలింగ్లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇక రెండవ రోజు ఆట ప్రారంభించిన టీమిండియా సాంట్నర్ మెలితిప్పే బంతులకు తీవ్రంగా ఇబ్బంది పడింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా నలుగురు ఆటగాళ్లు అతడి చేతిలో ఔట్ అయ్యారు. దీంతో టీం ఇండియా తీవ్ర కష్టాల్లో పడింది. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ 1 పరుగు మాత్రమే చేసి సాంట్నర్ వేసిన ఫుల్ టాస్ బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 30 పరుగులు చేసిన యశస్వి జైస్వాల్ ఫిలిప్స్ బౌలింగ్లో మిచెల్ కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. 30 రన్స్ చేసి.. దూకుడు మీద కనిపించిన గిల్ సాంట్నర్ బౌలింగ్ లో వికెట్ల ముందు దొరికిపోయాడు. రెండవ రోజు అప్పటికే టీమిండియా కీలకమైన మూడు వికెట్లను నష్టపోయింది. అయితే ఆ తర్వాత కూడా టీమిండియా వికెట్ల పతనం మరింత వేగంగా కొనసాగింది. 19 బంతుల్లో 18 పరుగులు చేసి దూకుడు మీద కనిపించిన రిషబ్ పంత్ ఫిలిప్స్ బౌలింగ్ లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తొలి టెస్ట్ లో 150 పరుగులు చేసిన సర్ప రాజ్ ఖాన్ 11 పరుగులు చేసి సాంట్నర్ బౌలింగ్ లో ఓరూర్కే కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. చెన్నై టెస్ట్ లో సెంచరీ చేసి అద్భుతమైన ఫామ్ లో కనిపించిన రవిచంద్రన్ అశ్విన్.. ఈ టెస్ట్ లోనూ తేలిపోయాడు. 4 పరుగులు మాత్రమే చేసి సాంట్నర్ బౌలింగ్ లో వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో టీమ్ ఇండియా 103 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 7 వికెట్లు కోల్పోయి తీవ్రమైన కష్టాల్లో పడిన టీమ్ ఇండియాను జడేజా (11), సుందర్ (2) ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు.. పూణే మైదానం స్పిన్ వికెట్.. దీంతో న్యూజిలాండ్ బౌలర్ సాంట్నర్ నిప్పులు కురిపిస్తున్నాడు. గిల్, విరాట్ కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్, అశ్విన్ వంటి టాప్ ఆటగాళ్లు సాంట్నర్ చేతిలో ఔట్ అయ్యారు.. వీరిలో విరాట్ కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. సాంట్నర్ వేసిన ఫుల్ టాస్ బంతిని సరిగ్గా ఆడ లేకపోవడంతో అది అతడి వికెట్లను పడగొట్టింది. దీంతో ఒక పరుగు మాత్రమే చేసిన విరాట్ నిరాశతో మైదానాన్ని వీడాడు. అతడు తొమ్మిది బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేశాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ తొమ్మిది బంతులు ఎదుర్కొన్నప్పటికీ ఒక్క పరుగు కూడా చేయలేకపోయాడు. సౌతి బౌలింగ్లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు.

## చెన్నై చిన్నోడిపై కన్నేసిన మూడు జట్లు..



వాషింగ్టన్ సుందర్ బ్యాట్, బాల్ రెండింటిలోనూ సహకారం అందించగల సామర్థ్యం అతనిని టీ20 ఫార్మాట్‌లో ఆల్ రౌండర్‌గా మార్చింది. సుందర్ మిడిల్ ఆర్డర్‌లో తుఫాన్ బ్యాటింగ్ చేయడంలో ప్రవీణుడు. తన రొటేటింగ్ బౌలింగ్‌తో బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బందుల్లో పడేస్తుంటాడు. ఐపీఎల్ చివరి సీజన్‌లో, సుందర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడాడు. అతను ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. మెగా వేలానికి ముందు ఫ్రాంచైజీ సుందర్‌ని తన వద్దే ఉంచుకుంటుందన్న ఆశ లేదు. ఇటువంటి పరిస్థితిలో, ఈ 25 ఏళ్ల ఆల్ రౌండర్ వేలంలోకి రావడం ఖాయం. అతనిని దక్కించుకునేందుకు చాలా జట్లు ప్రయత్నిస్తున్నాయి. 3. లక్నో సూపర్ జెయింట్స్.. ఐపీఎల్ 2024లో, దీపక్ హుడా, కృనాల్ పాండ్యా లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో ఇద్దరు ప్రధాన ఆల్ రౌండర్లుగా కనిపించారు. ఇద్దరి ప్రదర్శన సగటు కంటే తక్కువగా ఉంది. ఈ ఇద్దరు ఆటగాళ్లను ఫ్రాంచైజీ ఇప్పుడు రిటైన్ చేసుకునే అవకాశం లేదు. ఇటువంటి పరిస్థితిలో, ఐపీఎల్ మెగా వేలంలో వాషింగ్టన్ సుందర్‌ను లక్ష్యంగా చేసుకోవడం చూడవచ్చు. సుందర్ తన ప్రదర్శన ద్వారా మ్యాచ్ గమనాన్ని మార్చే శక్తి కలిగి ఉన్నాడు. ప్రతి ఫ్రాంచైజీ ఇటువంటి ఆటగాళ్ల కోసం డబ్బు ఖర్చు చేయాలని కోరుకుంటుంది. 2. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బలహీన బౌలింగ్ ఎప్పటినుంచో వారి సమస్య. ఫ్రాంచైజీకి ఎలాంటి ఆల్ రౌండర్ లేదు. గత సీజన్‌లో గ్లెన్ మాక్స్‌వెల్ ఎలా రాణించాడనేది అందరికీ తెలిసిందే. మెగా వేలానికి ముందే అతడి కార్డు కూడా కట్ అయినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వాషింగ్టన్ సుందర్‌ను మెగా వేలంలో ఆర్‌సీబీ కొనుగోలు చేస్తే.. అది వారికి లాభదాయకమైన డీల్. ఎం చిన్నస్వామి స్టేడియంలో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు సుందర్ సులభంగా భారీ ఇన్నింగ్స్ ఆడగలడు. అతను బౌలింగ్‌లో కూడా నిరాశపరచడు. 1.చెన్నై సూపర్ కింగ్స్.. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుత ప్రముఖ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా, అతను చాలా సంవత్సరాలుగా ఫ్రాంచైజీలో భాగమయ్యాడు. అయితే గత సీజన్‌లో మాత్రం జడేజా తనదైన ముద్ర వేశాడు. అంతర్జాతీయ స్థాయిలో కూడా జడేజా చాలా కాలంగా వైట్ బాల్ క్రికెట్‌లో ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు.

## 16ఏళ్ల హాకీ కెరీర్‌కు రాణి రాంపాల్ గుడ్ బై

భారత మహిళా హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణి రాంపాల్ వీడ్కోలు పలికింది. సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు గురువారం రాంపాల్ వెల్లడించింది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆమె తన 16ఏళ్ల కెరీర్‌కు గుడ్ బై చెప్పేసింది. ఫార్వర్డ్ ప్లేయర్ అయిన రాణి సారథిగా భారత హాకీకి వన్నె తెచ్చింది. ఆమె ఏకంగా 254 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. 'భారత జట్టుతో నా ప్రయాణం ఎంతో చిరస్మరణీయం. ఇన్నేళ్లు దేశం తరఫున ఆడతానని ఊహించ లేదు. టీమిండియాకు ఆడాలనే కాంక్షతో అన్ని అడ్డంకులు దాటి నిజం చేసుకున్నా' అని రాణి మీడియా సమావేశంలో తెలిపింది. హరియాణాకు చెందిన రాణి రాంపాల్ 15ఏళ్లకే జాతీయ జట్టుకు ఎంపికైంది. ఫార్వర్డ్ ప్లేయర్‌గా తన ముద్ర వేసిన ఆమె అనతికాలంలోనే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టింది. రాణి సారథ్యంలో భారత మహిళల జట్టు అద్భుత విజయాలు సాధించింది. ఆమె కెప్టెన్సీలో 2014 ఆసియా క్రీడల్లో కాంస్యం.. 2018 ఆసియా గేమ్స్‌లో రజతం సాధించింది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో 4వ స్థానంలో నిలిచింది. 16ఏళ్ల కెరీర్‌లో రాణి 205 గోల్స్ కొట్టింది. భారత హాకీకి విశేష సేవలు అందించిన ఆమెకు ప్రభుత్వం 2020లో ప్రతిష్ఠాత్మక 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డుతో గౌరవించింది.

## ఆ విషయంలో డేవిడ్ వార్నర్ కు ఉపశమనం..



2018లో కేప్ టౌన్ టెస్ట్ లో 'సార్ పేపర్' ఘటన డేవిడ్ వార్నర్ కెరియర్ ను తీవ్రంగా ప్రభావితం చేసింది. దీంతో అతడు ఏడాది పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. జీవిత కాలం పాటు కెప్టెన్సీ పై నిషేధానికి గురయ్యాడు. అయితే ఈ నిషేధాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా కండక్ట్ కమిషన్ ఎత్తివేసింది. ఇటీవల క్రికెట్ ఆస్ట్రేలియా కండక్ట్ కమిషన్ సమీక్ష నిర్వహించింది. ఇందులో డేవిడ్ వార్నర్ పై జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో డేవిడ్ వార్నర్ కు ఉపశమనం లభించింది.. 2022లో క్రికెట్ ఆస్ట్రేలియా ప్రవర్తనా నియమావళి లో మార్పులకు శ్రీకారం చుట్టింది. ముగ్గురితో కమిషన్ ఏర్పాటు చేసింది.. అయితే ఆ కమిషన్ లోని ముగ్గురు వార్నర్ పై కెప్టెన్సీ పై నిషేధాన్ని ఎత్తివేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇదే విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా శుక్రవారం వెల్లడించింది. ఈ నిర్ణయం నేపథ్యంలో "బిగ్ బాష్ లీగ్" లో డేవిడ్ వార్నర్ తిరిగి సిడ్నీ థండర్స్ జట్టుకు సారధ్య బాధ్యత వహించే అవకాశం కలిగింది. ప్యానల్ ఎదుట డేవిడ్ వార్నర్ సాండ్ పేపర్ ఘటన పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. కెప్టెన్సీ పై నిషేధం ఎత్తివేయడం ద్వారా యువ క్రికెటర్లకు డేవిడ్ వార్నర్ తన సహకారాన్ని అందిస్తాడని ప్యానల్ కమిటీ వెల్లడించింది.. అయితే నిషేధం వల్ల ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్ గా ఉండే అవకాశాన్ని డేవిడ్ వార్నర్ 6 సంవత్సరాల పాటు కోల్పోయాడు.. అయితే ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లకు డేవిడ్ వార్నర్ కెప్టెన్ గా వ్యవహరించాడు.. ప్రస్తుతం డేవిడ్ వార్నర్ కు 37 సంవత్సరాల వయసు. ఇటీవల అతడు అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. ఏడాది ప్రారంభంలో డేవిడ్ వార్నర్ పాకిస్తాన్ జట్టుతో జరిగిన టెస్ట్ సిరీస్ లో ఆడాడు. ఆ తర్వాత తన సుదీర్ఘ ఫార్మాట్ కు శాశ్వత విశ్రాంతి ప్రకటించాడు.

## 156 పరుగులకే భారత్ ఆలౌట్!



పూణె టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 156 పరుగులకే కుప్పకూలింది. దీంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల ఆధిక్యం సాధించింది. కివీస్ స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్లను బాగా కట్టడి చేశారు. ముఖ్యంగా మిచెల్ సాంట్నర్ వేసిన బంతులకు టీమ్ ఇండియా బ్యాట్స్‌మెన్లు ధీటుగా ఎదుర్కోలేక చేతులెత్తేశారు. మిచెల్ సాంట్నర్ ఏడుగురు భారత బ్యాట్స్‌మెన్‌లను అవుట్ చేశారు. గ్లెన్ ఫిలిప్స్ 2 వికెట్లను తీశారు. ఇది కాకుండా టిమ్ సౌథీ 1 వికెట్ తీసుకున్నాడు. భారత్ ఒక వికెట్ నష్టానికి 16 పరుగుల వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించింది. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ సులువుగా పరుగులు సాధించగా, శుభ్‌మన్ గిల్ అవుటైన వెంటనే వికెట్ల పతనం మొదలైంది. 30 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ పెవిలియన్‌కు చేరుకున్నాడు. యశస్వి జైస్వాల్ 30 పరుగులు చేసి గ్లెన్ ఫిలిప్స్ బంతికి అవుటయ్యాడు. విరాట్ కోహ్లీ 1 పరుగు వద్ద మిచెల్ సాంట్నర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. రిషబ్ పంత్ 18 పరుగుల వద్ద గ్లెన్ ఫిలిప్‌కు అవుటయ్యాడు. సర్ఫరాజ్ ఖాన్ 11 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మిచెల్ సాంట్నర్ సర్ఫరాజ్ ఖాన్‌ను అవుట్ చేశారు. అయితే, రవీంద్ర జడేజా 38 పరుగులు జోడించి, మిచెల్ సాంట్నర్ బంతికి పెవిలియన్‌కు చేరుకున్నాడు. రవి అశ్విన్ 4 పరుగులు చేశాడు. వాషింగ్టన్ సుందర్ 18 పరుగులు చేసి నాటౌట్ గా వెనుదిరిగాడు. పూణె టెస్టు తొలిరోజు న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ జట్టు 259 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ తరఫున ఓపెనర్ డ్వేన్ కాన్వే అత్యధికంగా 76 పరుగులు చేశాడు. దీంతో పాటు బెంగళూరు టెస్టు హీరో రచిన్ రవీంద్ర 65 పరుగుల సహకారం అందించాడు. భారత్ తరఫున బౌలర్ వాషింగ్టన్ సుందర్ కివీ జట్టులోని ఏడుగురు బ్యాట్స్‌మెన్‌లను వాషింగ్టన్ సుందర్ అవుట్ చేశారు. ఇది కాకుండా రవి అశ్విన్ 3 వికెట్లు తీశాడు. ఇది ఇలా ఉంటే.. భారత్‌పై బెంగళూరులో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఘన విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ తిరుగులేని విజయాన్ని సాధించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దానిపై దృష్టి పెట్టి హామీలు అమలు పర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్



**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ అక్టోబర్ 25** : మంచిర్యాల లోని లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఐబీలో లక్షెట్టిపేట బీజేపి పట్టణం, మండలం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ...కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ లో బీజేపి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పై లేని పోనీ ఆరోపణలు చేసి మాట్లాడ్డం సిగ్గు చేటు.దొంగ దొంగ అంటే భుజాలు సర్దుకున్నట్టు ఉంది మీ వ్యవహారం,మరొకసారి బీజేపి పార్టీ పై కానీ రఘునాథ్ పై గాని అనుచిత వాక్యాలు చేస్తే సాహించేది లేదు. జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఎన్నో సేవకార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకే అంకితమై ముందుకు పోతున్న వ్యక్తిపై కాగ్రెస్ నాయకులు ఆరోపణలు చెయ్యడం సరికాదు, కాంగ్రెస్ పార్టీ ఏదైతే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దానిపై ద్రుష్టి పెట్టి హామీలు అమలు పర్చాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విరమల హరి గోపాల రావు, మండల అధ్యక్షుడు బొప్పు కిషన్, అధికార ప్రతినిధి బుద్ధి లక్ష్మణ్,జిల్లా కోశాధికారి గుండా ప్రభాకర్,గడిగోపుల చంద్రమౌళి,హేమంత్ రెడ్డి,మోటపలుకుల సతీష్,ఎంబడి వెంకటేష్,ముష్కం గంగన్న,కోమాకుల రవి,రాజ గురువయ్య, సుధాకర్,రాకేష్, ఆనంద్,లకావతీశ్వర్, సిరిమల వెంకటేష్,బిల్లా అనిల్,సారం వినోద్,భూత్ అధ్యక్షుడు,బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28 న స్థానిక సంస్థల వారిగా రిజర్వేషన్ల కల్పనపై బహిరంగ విచారణ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 :** రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించవలసిన, అవసరమైన రిజర్వేషన్లు పేర్కొనే విషయంలో ఎస్.సి., ఎస్.టి.,బి.సి. కులాలకు 50 శాతం రిజర్వేషన్ మించకుండా తెలంగాణ వెనుకబడిన తరగతుల కమీషన్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులములు, వెనుకబడిన తరగతుల కుల సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఆసక్తి గల అభ్యర్థుల నుండి,పార్టీల నుండి సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించడం కొరకు ఈ నెల 28న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.ఈ విచారణకు ఉమ్మడి జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు,శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాలోని బి.సి. సంఘ నాయకులు, ప్రతినిధులు,బి.సి కులస్తులు,ఎస్.సి., ఎస్.టి.,మైనార్టీ నాయకులు హాజరై తమ సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను 20 రూపాయల విలువ గల నాన్-జుడిషియల్ బాండ్ పేపర్పై ప్రమాణ పత్రమును ప్రభుత్వ నోటరీ అడ్వకేట్ సంతకముతో తమ ఆక్షేపణలను 6 ప్రతులను జత చేసి సమర్పించాలని తెలిపారు.

# ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డి.ఈనీ కలసిన బీ.ఆర్.ఎస్ నాయకులు





రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 25 అక్టోబరు 2024 భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల ఆద్వర్యంలో పార్టీ కార్య కార్థలందరు నూతనముగా విచ్చేసిన ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డి.ఈ రమేష్ చంద్రను కలసి సాదరంగా ఆహ్వానించి, సన్మానించి స్థానికంగా మణికొండలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ప్రత్యేకించి పంచవటి కాలనీ, తనాష నగర్ హుడా కాలనీ, ఖిజ్ర కాలనీ, కే.పి.ఆర్ కాలనీ తది తర కాలనీలు, నెక్నుంపూర్ పరిధి లోని బాబు హిల్స్ లో త్రీ ఫేస్ సప్లై, వేంకటేశ్వర కాలనీ లో 11 కేవీ లైన్, పోల్స్ రీప్లేస్ వంటి విషయాలు, ఇంటర్నెట్ వైర్ ల కారణముగా ప్రమాద భరిత పరిస్థితి నెలకొన్నదనీ, పుప్పాలగూడ పరిధి లోని నెమలినగర్ వద్ద గల ట్రాన్స్ఫార్మర్ వల్ల ప్రమాద ఘంటికలు మోగుతున్నాయనీ కావున వెంటనే షిఫ్టింగ్ చేయాలని, ఓవర్లోడ్ అయిన ట్రాన్స్ఫార్మర్ లు, పాడై పోయిన సర్వీస్ లీడ్స్ పరంగా తరచుగా జరుగుతున్న విద్యుత్ అంతరయం సరి చేయమని, జంగిల్ కట్టింగ్ పేరుతో వదలిన చెత్త చేదారాన్ని శుభ్ర పరచడం జాప్యం జరుగుతున్న కారణాల వలన మునిసిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్ని విషయాలు వివరంగా తెలుపడం జరిగినది. మణికొండలోని అన్ని సమస్యలపై వినతి పత్రం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డి.ఈ రమేష్ చంద్రను కలసి అందజేయడం జరిగినదనీ, పర్యవసానంగా విద్యుత్ అంతరాయల పట్ల స్పందించిన డీ.ఈ వెంటనే ఏ.ఈ కి ఫోన్ చేసి వినతి పత్రంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పురోగతిని ఎప్పటి కప్పుడు తెలియ పరుచమని అదేశించడమైనది, ఇట్టి కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, ధనరాజ్, ఆలస్యం నవీన్ కుమార్, రూపా రెడ్డి, ముత్తంగి లక్ష్మయ, అందే లక్ష్మణ్ రావు, రాజేంద్ర ప్రసాద్, గుట్టమిది నరేందర్, విఠల్, సంగం శ్రీకాంత్, కిరణ్, శ్రీధర్, టైగర్ రేఖ,ఆశ్వక్ అలి తది తరులు కలరు.

# గ్రంధాలయ చైర్మన్ గాలిసయ్యద్ అర్జుమన్అలీ ప్రమాణ స్వీకారం



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా శుక్రవారం రోజు సయ్యద్ అర్జుమన్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు గ్రంధాలయ సంస్థ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు రియాజ్ అలీ అధ్యక్షన వహించారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు ఎమ్మెల్సీ దండే విటల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అర్జుమా అలీ కి ప్రత్యేక అభినందనలు తెలిపార

# అఖిల భారత పశుగణన కార్యక్రమం పకడ్బంధీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 :** 21వ అఖిల భారత పశుగణన-తెలంగాణ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో జిల్లా పశు వైద్య-పశు సంవర్ధక శాఖ అధికారి ఈర్ల శంకర్, మండలాల పశు వైద్యాధికారులతో కలిసి పశుగణన కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని,ఈ ప్రక్రియలో ఆవులు, గేదెలు,గొర్రెలు,కోళ్ళు, మేకలు,ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ అనువర్తనం ద్వారా నిక్షిప్తంగా చేయడం జరుగుతుందని తెలిపారు.రెవెన్యూ గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకొని జిల్లాలోని గ్రామపంచాయతీలలో,వార్డులలో పశుగణన చేసేందుకు 127 మంది ఎన్యుమరేటర్లను నియమించి తగిన శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అన్ని మండలాలలోని పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో పశు గణన,డిజిటల్ అనువర్తనం ద్వారా పశువుల సమాచారాన్ని నిక్షిప్తం చేయడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ - 1 పరీక్ష కేంద్రం తనిఖీ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 25:**దుండిగల్ లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న గ్రూప్ %-% 1 పరీక్ష నిర్వహణను శుక్ర వారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సిసి కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదులలో తిరిగి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ పర్యటనలో దుండిగల్ తహసిల్దార్ మతిన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# బెదిరింపులతో లొంగతీసుకోలేరు ఎంపీ వద్దిరాజు

## పెంట్యాల పుల్లయ్య అక్రమ అరెస్టును ఖండించిన ఎంపీ రవిచంద్ర



**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 25 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య పై అక్రమంగా కేసు పెట్టి, అరెస్టు చేయడం ద్వారా అధికార పార్టీ నేతలు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇలాంటి బెదిరింపు చర్యలతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు లొంగతీసుకోలేరని ఆయన పేర్కొన్నారు. పుల్లయ్య ను అన్యాయంగా అరెస్టు చేసి, జైల్లో నిర్బందించడం పట్ల ఎంపీ రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు రాజకీయ ప్రేరేపిత చర్యగా స్పష్టం అవుతోంది. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను, న్యాయ వ్యవస్థను దెబ్బతీసేందుకు దోహదపడతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో వీటిని ప్రజలు ఏ మాత్రం హర్షించరు. అరెస్టు సందర్భంగా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వైరా పోలీసు అధికారులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పుల్లయ్య అరెస్టును తట్టుకోలేక ఆయన భార్య గుండెపోటుతో కుప్ప కూలినా.. అధికార పార్టీ నేతలు మానవతా విలువలను మరిచారని విమర్శించారు. ప్రజల మద్దతుతో ఇలాంటి చర్యలకు గుణపాఠం చెబుతామని అన్నారు. పుల్లయ్య పై పెట్టిన తప్పుడు కేసు ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు

## అక్టోబరు 27న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి, శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అక్టోబరు 28 నుండి 30వ తేదీ వరకు జరగనున్న పవిత్రోత్సవాలకు అక్టోబరు 27వ తేదీన సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల్లో మొదటిరోజైన అక్టోబరు 28వ తేదీన ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్రప్రతిష్ఠ నిర్వహించనున్నారు. రెండో రోజు అక్టోబరు 29వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేస్తారు. చివరిరోజు అక్టోబరు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అదేవిధంగా ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల వీధి ఉత్సవం నిర్వహించనున్నారు. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక దోషాలు జరుగుతుంటాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో వేదపఠనం, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 509 దరఖాస్తులు

హైదరాబాద్, అక్టోబర్ 25 మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 509 దరఖాస్తులు అందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 200, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 76, విద్యుత్ శాఖ కు సంబంధించి 57, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 35, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 5, ఇతర శాఖలకు సంబంధించి 136 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# బోడెపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం అన్నదాన కార్యక్రమం






**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 25 (ప్రజాబలం)** ఖమ్మం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో జిల్లా కాంగ్రెస్ నాయకులు బోడెపూడి రాజా పుట్టినరోజు తో పాటు బోడెపూడి ట్రస్ట్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా తల సేమియా పిల్లల కోసం 100 మందితో రక్తదాన శిబిరం 3000 మందికి అన్నదాన కార్యక్రమం ఖమ్మం పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేశారు దీనికి ముఖ్య అతిథిగా ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ మరియు ఖమ్మం ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్ పాల్గొన్నారు హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకుడు రామ్ రెడ్డి మరియు బోడెపుడి రాజా మిత్రబృందం మరియు అభిమానులు నాయకులు పాల్గొన్నారు

# తండ్రి టార్చర్ భరించలేక దాక్కొన్న బాలిక

నల్గొండ, అక్టోబరు 25, తండ్రి పెట్టే బాధలు భరించలేక స్కూల్‌లోనే దాక్కుందో బాలిక. తన తండ్రి అమ్మేస్తానంటూ బెదిరిస్తున్నాడని ఇంటికి వెళ్లనంటూ మారాం చేసింది. ఇంతలో ఆ తండ్రి వచ్చి స్కూల్‌లో గొడవ చేశాడు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి బాలికను అధికారుల సంరక్షణలో ఉంచారు. హైదరాబాద్‌కు చెందిన అక్బర్ దంపతులు చాలా రోజు క్రితం చౌటుప్పల్ వచ్చి జీవిస్తున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. భర్తతో గొడవ పడ్డ భార్య తన కుమారుడితో పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అక్బర్ తన కుమార్తెతో కలిసి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన అక్బర్ నిత్యం ఆమెను వేదించడం మొదలు పెట్టాడు. భార్యపై కోపం వచ్చిన ప్రతిసారి 11 ఏళ్ల కుమార్తెపై కక్ష తీర్చుకోవడం అలవాటుగా మారింది. బుధవారం కూడా బాలికను చిత్రవధ చేశాడు. కొట్టి హింసించాడు. ఎవరికైనా అమ్మేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాలిక భయపడిపోయింది. చౌటుప్పల్ లోని బంగారుగడ్డలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న బాలిక గురువారం స్కూల్‌కు రాలేకపోయింది. సాయంత్రానికి భయపడుతూనే స్కూల్‌కు వచ్చింది. జరిగిన విషయాన్ని స్కూల్ పిల్లలకు చెప్పింది. రోజంతా ఏం తినలేదని ఆకలిగా ఉందంటూ బోరుమంది. బాలిక పరిస్థితి గమనించిన స్నేహితులు విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే వాళ్లు బాలికతో మాట్లాడి ధైర్యం చెప్పి అన్నం తినిపించారు. స్కూల్ విడిచిపెట్టే టైం అయింది. రోజూ తన తండ్రి కొందుతున్నాడని... అమ్మేస్తానంటూ భయపెడుతున్నాడని చెబూతూ ఏడ్చింది. ఇంతలో ఇంటికి వెళ్లిన తండ్రికి పాప కనిపించలేదు. ఫుల్‌గా మద్యం సేవించి ఉన్న అక్బర్ నేరుగా స్కూల్ వద్దకు వచ్చి గొడవపడ్డాడు. తండ్రి గొంతు విన్న బాలిక స్కూల్‌లోనే వేరే గదికి వెళ్లి దాక్కుంది. తండ్రితో వెళ్లబోనంటూ ఉపాధ్యాయులకు చెప్పేసింది. పాప భయపడుతోందని తర్వాత పంపిస్తామంటూ ఉపాధ్యాయులు చెబుతున్నా అక్బర్ వినిపించుకోలేదు. అక్బర్ చేసిన హంగామాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా బెదిరిపోయారు. ఇంతలో స్థానికులు ఎంఈవో, పోలీసులకు ఫోన్ ?చసి విషయాన్ని చెప్పారు. సమాచారం అందుకున్న వచ్చిన వారు అక్బర్‌తో మాట్లాడారు. వాళ్లపై కూడా తిరగుబాటు చేశాడు అక్బర్.

చివరకు బాలికను మండల రిసోర్స్ సెంటర్‌కు తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి జిల్లా బాలసదన్‌కు తీసుకెళ్లారు. తండ్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

# చేతులెత్తేసిన టీమిండియా లైనింగ్

పూణె, అక్టోబరు 25, (న్యూస్ పల్స్) న్యూజిలాండ్ వర్సెస్ టీమిండియా ( మధ్య జరుగుతున్న రెండో టెస్టులో? రోహిత్ శర్మ సేన చేతులెత్తేసింది. 156 పరుగులకే మొదటి ఇన్నింగ్స్ లో కుప్పకూలింది టీమ్ ఇండియా. ఇవాళ ఉదయం బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా.. లంచ్ బ్రేక్ అయిపోయిన తర్వాత తొమ్మిది వికెట్లు కోల్పోయింది. 45.3 ఓవర్లలోనే?. పది వికెట్లు నష్టపోయి? పీకల్లోతు కష్టాల్లోకి వెళ్ళింది.టాప్ ఆర్డర్ అలాగే మిడిల్ ఆర్డర్ ఎవరు కూడా రాణించకపోవడంతో..దారుణంగా.. మొదటి ఇన్నింగ్స్ లో ప్రదర్శన కనబరిచింది టీమిండియ. టీమిండియా బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 30 పరుగులు, శుభమన్ గిల్ 30 పరుగులు అలాగే? ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 38 పరుగులు చేసి రాణించారు. ఇందులో రోహిత్ శర్మ డక్ అవుట్, విరాట్ కోహ్లీ ఒకే ఒక్క పరుగు చేసి పెవిలియన్ బాట పట్టారు.మొదటి రోజు సాయంత్రం ఒక వికెట్ కోల్పోయిన టీమిండియా ఇవాళ ఉదయం నుంచి ఇప్పటివరకు 9 వికెట్లు నష్టపోవడం జరిగింది. దీంతో? న్యూజిలాండ్ కంటే 103 పరుగులు వెనుకబడిపోయింది టీమిండియా. నిన్నటి వరకు న్యూజిలాండ్ పై పెత్తనం చెలాయించిన టీమిండియా? బ్యాటింగ్ లో మాత్రం చేతులెత్తేసింది.

జై స్వాల్ రికార్డు

పూణేలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ అరుదైన ఘనత సాధించారు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000 టెస్టు పరుగులు చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.తద్వారా 22 ఏళ్ల యువ సంచలనం 1979లో 23 ఏళ్ల వయసులో 1000 పరుగుల మార్కును చేరుకున్న దిలీప్ వెంగ్‌సర్కార్ పేరిట ఉన్న మునుపటి రికార్డును అధిగమించాడు.ప్రస్తుతం జైస్వాల్ 2024లో అత్యధిక టెస్టు పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. రూట్ 14 మ్యాచుల్లో 1305 పరుగులు చేశాడు.ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైస్వాల్ ఇప్పటివరకు కేవలం 10 మ్యాచ్‌లలో 59.23 సగటుతో 1007 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు, ఆరు అర్ధ సెంచరీలు ఉన్నాయి.2024లో టీమిండియా మరో మూడు టెస్టులు ఆడాల్సి ఉంది. దీంతో జైస్వాల్ భారత దిగ్గజాల పేరిట ఉన్న కొన్ని అతిపెద్ద రికార్డులను అధిగమించే అవకాశం ఉంది.ముఖ్యంగా లిటిల్ మాస్టర్ సచిన్ టెండూల్కర్ 2010లో 14 మ్యాచ్‌లలో 1,562 రన్స్‌తో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టెస్టు పరుగులు చేసిన భారతీయ ఆటగాడిగా రికార్డును కలిగి ఉన్నాడు. అలాగే వీరేంద్ర సెహ్వాగ్ 2008లో చేసిన 1,462 పరుగులు ఒకే ఏడాదిలో ఒక భారతీయ ఓపెనర్ చేసిన అత్యధిక పరుగులు. ఈ ఏడాది మిగిలిన మూడు టెస్టు మ్యాచుల్లోని ఆరు ఇన్నింగ్స్‌లలో కలిపి జైస్వాల్ 500 పరుగులు చేస్తే ఈ రెండు రికార్డులు బ్రేక్ చేసే అవకాశం ఉంది.

# తుఫాను దెబ్బకు భారీగా పెరిగిన కూరల ధరలు

విశాఖపట్టణం, అక్టోబరు 25, బంగాళాఖాతంలో దానా తుపాను వేగంగా కదులుతోంది. ఇది, గురువారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారుతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే.. దానా తుపాను ప్రభావం ఒడిశా మీద చాలా ఎక్కువగా, పశ్చిమ బెంగాల్ మీద ఎక్కువగా, ఆంధ్రప్రదేశ్ మీద తక్కువగా ఉండొచ్చు. తుపాను గమనం, ప్రభావం గురించి భారత వాతావరణ శాఖ ఈ మూడు రాష్ట్రాలకు ఎప్పటికప్పుడు సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తోంది. తుపాను నష్టాన్ని సాధ్యమైనంత మేర తగ్గించేందుకు ఈ మూడు ప్రభుత్వాలు కూడా ఇప్పటికే ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాయి. దానా తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ఒడిశాలోని తీర ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. ఇప్పుడు, అక్కడి మార్కెట్లలో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రజలు ఎక్కువ రోజులకు సరిపోయే కూరగాయలు కొని నిల్వ చేసుకోవడానికి మార్కెట్లకు పోటెత్తారు. డిమాండ్ పెరగడంతో ఒడిశా లోకల్ మార్కెట్‌లలో టమాటాలు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు సహా అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. మంగళవారం ఒక్క రోజే, కటక్‌లో బంగాళదుంప ధర కిలో రూ.30 నుంచి రూ.50కి పెరిగింది. ఒడిశాలోని అతి పెద్ద కూరగాయల మార్కెట్‌లో ఉల్లిపాయల ధర కిలోకు రూ.40 నుంచి రూ.60కి పెరిగింది.భువనేశ్వర్‌లోని కూరగాయల మార్కెట్‌లలో ప్రస్తుతం టమాటా కిలో రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. బీన్స్, దొండకాయ, బెండకాయ, క్యాలీఫ్లవర్ వంటి ఇతర కూరగాయల ధరలు కూడా ఒక్కో కిలోకు రూ.20 వరకు పెరిగాయి. కూరగాయలతో పాటు కిరాణా సరుకుల కోసం కూడా ప్రజలు క్యూ కడుతున్నారు. లోకల్ షాపులతో పాటు పెద్ద మాల్స్‌లోనూ రద్దీ పెరిగింది. తుపాను ముందు పరిస్థితే కాదు, తుపాను తర్వాతి పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకుని నిత్యావసర వస్తువుల కొనుగోళ్లు జరుగుతున్నాయి."రాష్ట్రాన్ని తుపాను తాకిన తర్వాత మార్కెట్ పరిస్థితి ఎలా ఉంటుందో మాకు తెలియదు. సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడితే ధరలు మరింత పెరగొచ్చు. కాబట్టి, మా కుటుంబానికి కొన్ని రోజుల పాటు సరిపోయే కూరగాయలను, సరుకులను ముందే కొంటున్నాం" అని ప్రజలు చెబుతున్నారు.తుపాను అల్లకల్లోలం సృష్టిస్తే రోడ్లు కోతకు గురి కావచ్చు. కొండ చరియలు, మట్టి పెళ్లలు రోడ్లపై విరిగి పడొచ్చు. వంతెనలు కొట్టుకుపోవచ్చు. రోడ్లపై చెట్లు, కరెంటు స్తంభాలు పడొచ్చు. కొన్ని ప్రాంతాలు ముంపునకు గురికావచ్చు. పైగా, కూరగాయలను రవాణా చేసే ట్రక్కుల కొరత కూడా ఉంటుంది. ఇన్ని రకాల ఆందోళనలు ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.ఉదయం తీవ్ర తుపానుగా మారనున్న దానా, శుక్రవారం ఉదయానికి ఒడిశాలోని పూరీ – పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ఐలాండ్ మధ్య తీరం దాటొచ్చని ఎఓఆ అంచనా వేసింది. తుపాను నేపథ్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తూర్పు కోస్తా రైల్వే పరిధిలో నడిచే చాలా రైళ్లను రద్దు చేశారు. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య నడిచే వందేభారత్ ట్రైన్‌ను రద్దు చేశారు.

# ఫ్రీ గ్యాస్ బుకింగ్స్ ప్రారంభం

విజయవాడ, అక్టోబరు 25, ఏపీ ప్రజలకు గుడ్‌న్యూస్. ప్రభుత్వం దీపావళి ధమాకా వార్త చెప్పింది. ఈ నెల 29 నుంచి ఉచిత గ్యాస్ పథకం బుకింగ్స్ ప్రారంభమవుతందన్నారు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఈనెల 31 నుంచి మార్చి 31 వరకు మొదటి సిలిండర్ ఎప్పుడైనా తీసుకోవచ్చని అన్నారు. గ్యాస్ కనెక్షన్ ఉండి? తెల్ల రేషన్ కార్డు, ఆధార్ ఉన్నవాళ్లు ఈ పథకానికి అర్హులని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబం అక్టోబర్ 31 నుంచి మార్చ్ 31 వరకు మొదటి సిలిండర్ ఎప్పుడైనా తీసుకోవచ్చని చెప్పారు. గ్యాస్ సిలిండర్ అందిన వెంటనే మీరు డబ్బు చెల్లిస్తే 48 గంటల్లో ప్రభుత్వం తిరిగి డీబీటీ ద్వారా నగదు వెనక్కి ఇచ్చేస్తుందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 1967 కు కాల్ చేసి సేవలు పొందొచ్చని మంత్రి చెప్పారు. వీలైనంత ఎక్కువ మందికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని.. ప్రస్తుతం 1.47 కోట్లు వైట్ రేషన్ కార్డ్స్ ఉన్నట్లు వెల్లడించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.
అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఉస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు ఆ పథకాన్ని అమలుచేస్తూ చంద్రబాబు సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ దీపావళి నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. అర్హులైన వారందరికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. ఈ పథకానికి ఏడాదికి 2వేల 684 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# జైన్ పరిశ్రమ ప్రారంభానికి సహకరిస్తాం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





జూపాడుబంగ్లా/నంద్యాల, అక్టోబర్ 25 జైన్ పరిశ్రమ త్వరలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం జూపాడుబంగ్లా మండలం తంగడంచలోని జైన్ ఇరిగేషన్ సిస్టం లిమిటెడ్ పరిశ్రమ పరిసరాలను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య తో కలిసి పరిశీలించారు. జైన్ పరిశ్రమ అధికారులు తంగడంచ నుంచి ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యకలాపాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి జైన్ పరిశ్రమకు అన్ని విధాల సహకరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ రాష్ట్రం తరహాలో అరటి పంట కోత దశలో రైతులకు వ్యయం తగ్గించేందుకు రోప్ వే తరహా పద్ధతిని రాయలసీమ జిల్లాల్లో కూడా తీసుకురావాలని జైన్ అధికారులను కలెక్టర్ సూచించారు. వీలైనంత త్వరగా అరటి, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను తంగడంచ నుంచి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జైన్ అధికారులను ఆదేశించారు. తంగడంచ ఫామ్ లో ఉన్న 1600 ఎకరాల్లో విత్తనోత్పత్తి ఏ విధంగా తీసుకురావాలన్న అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చించి ముందుకు వెళ్తామన్నారు.నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య మాట్లాడుతూ జైన్ పరిశ్రమ గత పాలకుల మూలంగా ముందుకు వెళ్లలేకపోయిందని ప్రస్తుతం ప్రభుత్వ హయాంలోనైనా జైన్ పరిశ్రమ ప్రారంభమయ్యేందుకు చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ను విజ్ఞప్తి చేశారు. జైన్ పరిశ్రమలో 100% స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని జైన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ ఎం దాసు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, జైన్ పరిశ్రమ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ బాబు, తంగడంచ ఇంచార్జ్ మహేంద్ర బాబు, లైజనింగ్ అధికారి మౌలాలి, జూపాడుబంగ్లా తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు

# ఇవాళ కేబినెట్ సమావేశం

హైదరాబాద్, అక్టోబరు 25, తెలంగాణ కేబినెట్ సమావేశం శనివారం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆరో ఫ్లోర్’లో గల కేబినెట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు.తొలుత ఈనెల 23న మంత్రి వర్గ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వ భావించింది. కానీ అనూహ్యంగా దాన్ని 26కు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారులు ప్రకటన చేయడం గమనార్హం. ఇక తాజా భేటీలో నూతన రెవెన్యూ చట్టం రూపకల్పనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేయనుందట. ధరణి స్థానంలో తెచ్చిన భూమాత పోర్టల్ కోసమూ ఆమోదం తెలపనున్నారని సమాచారం.మరోవైపు చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాకు మరిన్ని పవర్స్ కల్పించేందుకు తెచ్చిన ఆర్డినెన్స్’కి సవరణలు చేపడతారని తెలుస్తోంది. ఇదే సమయంలో గతంలో ఉన్న వీఆర్ఎస్ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే క్యాబినెట్ లోనూ దానిపై చర్చించనున్నారు. ఈ సందర్భంగానే గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించనున్నారట.గ్రామ రెవెన్యూ అధికారి ఉద్యోగాలను వీఆర్వో, వీఆర్ఏలతోనే సగం పోస్టులు భర్తీ చేయాలని సర్కారు యోచిస్తోంది. మిగతా సగం ఉద్యోగాలు కొత్తవారితో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో నింపాలన్నది గవర్నమెంట్ ప్లాన్ గా తెలుస్తోంది. తాజాగా ఈ కొత్త పోస్టుల భర్తీకి సంబంధించిన అంశాలపై కేబినెట్ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు సమాచారం.శీతాకాలం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హైడ్రా, కొత్త రెవెన్యూ బిల్లులపై ఇటు అసెంబ్లీ, అటు కౌన్సిల్ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రెండు డ్రాఫ్ట్ బిల్లులపైనా కేబినెట్ లో చర్చలు చేయనున్నట్లు తెలిసింది. ఇక నవంబర్ నెలలో నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాల తేదీలపై ఈ భేటీలోనే చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# శారదా పీఠానికి మరో షాక్

తిరుమల, అక్టోబరు 25,విశాఖ శారదా పీఠానికి ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో బిగ్ షాక్ ఇచ్చింది. తిరుమలలో ఆ పీఠం చేపట్టిన భవనాలకు అనుమతులు రద్దు చేసింది. గత ప్రభుత్వం హయాంలో తిరుమల గోగర్భం డ్యామ్ ప్రాంతంలో భూమి లీజుకు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించారంటూ అనుమతులు రద్దు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవోకి ఆదేశాలు జారీ చేశారు.2005 ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం తిరుమలలో భక్తులకు వసతి, అన్నప్రసాదాలు కల్పించేందుకంటూ శారదా పీఠానికి గోగర్భం జలాశయ ప్రాంతంలో 5వేల చదరపు అడుగుల స్థలాన్ని 30ఏళ్ల పాటు లీజుకు ఇచ్చింది. సెల్లార్, గ్రౌండ్, మొదటి రెండు, మూడు అంతస్తుల నిర్మాణానికి 2007లో శారదా పీఠం నిర్వాహకులు అనుమతులు తీసుకున్నారు. కానీ, పీఠం నిర్వాహకులు టీటీడీ ఇచ్చిన అనుమతులను పక్కనబెట్టి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారనే విమర్శలున్నాయి.2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదనపు నిర్మాణాలకు అనుమతులు పొందింది. కానీ, దానిని కూడా నిబంధనలు అతిక్రమించి అదనంగా నిర్మాణాలు చేపట్టినట్లు టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. దీంతో అదనపు నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ ధర్మకర్తల మండలి చేసిన తీర్మానాన్ని కూటమి ప్రభుత్వం తిరస్కరించింది.

## ముత్యాలమ్మ గుడి కేసులో నిందితుడు, కంప్యూటర్ ఇంజినీర్

హైదరాబాద్, అక్టోబరు 25,సికింద్రాబాద్ పరిధిలోని ముత్యాలమ్మ ఆలయంపై దాడి జరిగిన కేసులో హైదరాబాద్ సీపీ స్పందించారు. ముంబయిలో ఉన్నపుడు కూడా నిందితుడు ఆవేశంగా ప్రవర్తించాడన్నారు. ఇప్పటికే నిందితుడుపై ముంబయిలో రెండు కేసులు ఉన్నాయన్నారు. నిందితుడు కంప్యూటర్ ఇంజినీర్ అని, ఆఫీస్ లోనూ పని చేసిన కాలంలో ఇలాంటి గొడవలే జరిగేవన్నారు. ఈ

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com